
RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

**PRAJABALAM** Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in




24 మే 2025 శనివారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:304



ప్రజాబలం

24 మే 2025 శనివారం

# గ్రీన్‌గ్యాస్‌కు గ్లోబల్ ట్యాక్స్...

గ్లోబల్ వార్మింగ్ కట్టడికోసం గ్రీన్‌హౌస్ ఉద్గారాల (హరిత వాయువుల వెల్లువ)పై గ్లోబల్ ట్యాక్స్ విధించడానికి షిప్పింగ్ వనరుగా ఉన్న ప్రధాన దేశాలు అంగీకారం తెలిపాయి. దీని ప్రకారం నౌకలు విడుదల చేసే ప్రతి టన్ను కార్బన్ డైయాక్సైడ్‌పై ఇకనుంచి కనీసం 100 డాలర్ల వంతున పన్ను విధించనున్నాయి. ఆయా దేశాల నౌకలు లక్షాలను చేరలేకపోయినా, ఇంటర్నేషనల్ మారిటైం ఆర్గనైజేషన్ నెట్ జీరో ఫండ్‌కు నిధులు అందించకున్నా 2028 నుంచి ఈ ట్యాక్స్‌ను వసూలు చేయనున్నారు. ఇందుకు సంబంధించి ఏప్రిల్ 11న లండన్‌లో 60కి పైగా దేశాల ప్రతినిధులతో ఇంటర్నేషనల్ మారిటైం ఆర్గనైజేషన్ (ఐఎంఒ) సమావేశం జరిగింది. అయితే అగ్రరాజ్యం అమెరికా మాత్రం దీనికి గైర్హాజరు కావడం గమనార్హం. ఓడల్లో వాడే ఇంధనానికి సైతం ఈ సమావేశం పలు ప్రమాణాలను నిర్దేశించింది. మొత్తం ఉద్గారాల్లో షిప్పింగ్ వాటా 3 శాతమని ఐక్యరాజ్యసమితి గణాంకాలు చెబుతున్నాయి. ఓడల సంఖ్యతోపాటు వాటి పరిమాణం పెరుగుతుండడం, అందుకు అనుగుణంగా ఇంధనవాడకం విపరీతంగా పెరిగిపోతుండటంతో రానున్న రోజుల్లో షిప్పింగ్ ఉద్గారాలు ఇంకా ఎక్కువవుతాయని భావిస్తున్నారు. ఐఎంఒ భేటీలో కుదిరిన ఒప్పందంపై సెక్రటరీ జనరల్ ఆర్సెనియో డొమింగెజ్ హర్షం వెలిబుచ్చారు. వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి షిప్పింగ్ ఆధునికీకరణకు ఎన్నో సంక్లిష్టమైన సవాళ్లను ఎదుర్కొంటూ ఈ బృందం అర్థవంతమైన ఏకాభిప్రాయాన్ని సాధించిందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రపంచ వాణిజ్యానికి సముద్ర నౌకా రవాణా అన్నది వెన్నుముక వంటిది. ఏటా సుమారు 12 బిలియన్ టన్నుల సరకు నౌకలపై రవాణా అవుతుందని యునైటెడ్ నేషన్స్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్ (యుఎన్‌సిటిఎడి) 2023 నివేదిక వెల్లడిస్తోంది. 2022లో సముద్ర వాణిజ్యం 0.4 శాతం తగ్గినా, కంటైనర్ల ద్వారా రవాణా (2024 నుంచి కంటైనర్ల రవాణా ఏటా 3% పెరుగుతోంది) చమురు, గ్యాస్ రవాణా 2022 నుంచి క్రమంగా 6%, 4.6 శాతం పెరుగుతుండడంతో 2028 నాటికి మొత్తం సముద్ర వాణిజ్యం 2.1% నుంచి 2.2% వరకు పెరుగుతుందని అంచనా.ఈ విధమైన పెరుగుదల ఇంధన వాడకానికి మరింత ఆజ్యం పోస్తుంది. గత దశాబ్దకాలంగా షిప్పింగ్ ఉద్గారాలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఏటా విడుదలయ్యే ఒక బిలియన్ మెట్రిక్ టన్నుల కార్బన్‌డైయాక్సైడ్ ఉద్గారాలు, 3% గ్లోబల్ గ్రీన్‌హౌస్ గ్యాస్‌తో సమానం. భారీ నౌకలు ప్రతి ట్రిప్పుకు ఎక్కువ సరకును రవాణా చేస్తుంటాయి. భారీ మొత్తంలో ఇంధనాన్ని మండిస్తుంటాయి. పనామా, లిబేరియా, మార్షల్ దీవుల్లో ఇదే పరిస్థితి. ప్రపంచం మొత్తం మీద రవాణా అయ్యే టన్నుల సరకుల్లో మూడోవంతు ఈ రేవుల ద్వారానే జరుగుతుంది. అంతే సమానంగా ఉద్గారాలు విడుదల అవుతుంటాయి. ఇంటర్నేషనల్ మారటైమ్ ఆర్గనైజేషన్ (ఐఎంఒ) 2023 సవరించిన గ్రీన్‌హౌస్ గ్యాస్ (జిహెచ్‌జి)వ్యూహం (స్ట్రాటెజీ) ఆశించే లక్షాలను నిర్దేశించింది. 2008 నాటి ఉద్గారాలస్థాయిలను ప్రామాణికంగా తీసుకుని 2030 నాటికి 20% నుంచి 30% వరకు ఉద్గారాలు తగ్గించాలని, 2050 నాటికి జీరో స్థాయికి చేరుకోవాలని నిర్దేశించింది.

అయిననప్పటికీ, ఎలాంటి చొరవ తీసుకోకుంటే ఉద్గారాలు మరింత ఎక్కువగా పెరుగుతాయని అంచనా వేశారు. యునైటెడ్ నేషన్స్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్ గుర్తించడం బట్టి భౌగోళిక రాజకీయ మార్పులు, ఉక్రెయిన్ యుద్ధం వంటి పరిణామాలు, మళ్లీ చమురు, ఆహార ధాన్యాల నౌకల రవాణా టన్నుల భారం కన్నా మరింత దూరం సాగేలా చేస్తున్నాయి. 2023లో చమురు రవాణా దూరంతోపాటు సుదీర్ఘకాలం సాగింది. ఐఎంఒ మెరైన్ ఎన్విరాన్‌మెంట్ కమిటీ నిర్ణయించిన గ్లోబల్ కార్బన్ టాక్స్ మేరకు ఆయా లక్షాల నౌకలు నెట్ జీరో నిధులను అందించడం కానీ, లేదా ఉద్గారాల నియంత్రణ కానీ చేయలేకపోతున్నాయని వ్యాఖ్యానించింది. ఇది వాడుతున్న ఇంధన ప్రమాణాల బట్టి ఆధారపడి ఉంది. ఉద్గారాలను పూర్తిగా, లేదా కొంత స్థాయివరకు తగ్గించడానికి దోహదపడే హైడ్రోజన్, మెథనాల్, అమెనియా వంటి వాటిని ప్రోత్సహించడం అవసరం. ప్రకృతికి విరుద్ధమైన మానవ కార్యకలాపాల వల్ల భూమి వేడెక్కిపోతూనే ఉంది. 1850లో భూ ఉష్ణోగ్రతను నమోదు చేయడం మొదలైనప్పటి నుంచి అత్యుష్ణ సంవత్సరంగా 2023 రికార్డు సృష్టించగా, వెంటనే 2024 ఆ రికార్డును బద్దలు కొట్టింది. ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఒ) గత జనవరిలో ఈమేరకు ఓ నివేదిక విడుదల చేసింది.

అసలు గడచిన పదేళ్లు భూమిపై గత 125000 ఏళ్లలోనే అత్యుష్ణ సంవత్సరాలని ఐరోపా, బ్రిటన్, జపాన్ దేశాల వాతావరణ సంస్థలు నిర్ధారించాయి. బొగ్గు, చమురు ఆధారిత పారిశ్రామిక విప్లవం వచ్చినప్పటి నుంచి భూ ఉష్ణోగ్రత పెరుగుతూ వస్తోంది. ఈ పెరుగుదల 1.5 సెల్సియస్ డిగ్రీలకు (2.7 ఫారన్ హీట్) మించకుండా చూడాలని 2015లో పారిస్ వాతావరణ సభ తీర్మానించింది. కానీ ఈ ఏడాది భూ ఉష్ణోగ్రత ఆ పరిమితిని మించి 1.6 సెల్సియస్ డిగ్రీలకు పెరిగిందని ఐరోపా కమిషన్‌కు చెందిన కొపెర్నికస్ వాతావరణ విభాగం తెలిపింది. జపాన్ ఈ పెరుగుదలను 1.57 డిగ్రీలుగా, బ్రిటన్ 1.53 డిగ్రీలుగా లెక్కగట్టాయి. వాతావరణ మార్పుల వల్ల వరదలు, తుపానులు, అనావృష్టి తలెత్తి గత ఏడాది ప్రపంచ వ్యాప్తంగా 14,000 కోట్ల డాలర్ల నష్టం జరిగింది. శిలాజ ఇంధనాలైన బొగ్గు, చమురు, సహజ వాయువులను మండించడం వల్లనే వాతావరణంలో కర్బనం పెరిగి ఉష్ణోగ్రతను పెంచుతోంది. పారిశ్రామిక విప్లవంనుంచి సంపన్న ఐరోపా, అమెరికా ఖండ దేశాలు శిలాజ ఇంధనాలను మండించడం ద్వారా ప్రపంచానికి 170 లక్షల కోట్ల డాలర్ల నష్టం కలిగించాయి. ఈ నష్టాలను అధిగమించడానికి వర్ధమాన దేశాలకు లక్షల కోట్ల డాలర్ల సహాయం చేయాల్సిన సంపన్న దేశాలు కేవలం 30,000 కోట్ల డాలర్లను అదీ 2035 కల్లా విదిలిస్తామని ప్రతిపాదించాయి. భూగోళం వేడెక్కడ మనేది కఠోరమైన వాస్తవమని డబ్లుఎంఒ తాజా నివేదిక మరోసారి రుజువు చేస్తోందని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ వ్యాఖ్యానించారు. భూతాపం పెరగడం మాతాశిశు ఆరోగ్యాన్ని కూడా దెబ్బతీస్తోంది. వేడి ఎక్కువగా ఉండే రోజుల సంఖ్య పెరుగుతున్నందున నెలలు నిండక ముందే శిశు జననాలు సంభవిస్తున్నాయి. తల్లులకు ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. 202024 మధ్య కాలంలో 247 దేశాలు, 940 నగరాల్లో అధిక వేడిరోజులు రెట్టింపు అయ్యాయని తేల్చారు. గడిచిన అయిదేళ్లలో భారత్‌లో గర్భిణులకు ప్రమాదకరమైన రీతిలో జాతీయ స్థాయిలో ఏటా సగటున ఆరు అదనపు అత్యుష్ణ రోజులు నమోదైనట్టు నివేదికలు చెబుతున్నాయి.

# రాజీలేని పోరాట యోధుడు

తెలంగాణ ప్రాంతం దశాబ్దాల కాలం నుండి ఉద్యమాలకు ఆలవాలం. నిరంకుశ వాదంపై అలుపెరుగని పోరాటం చేసిన కార్యస్థలం. నిజాం రాచరిక పాలన సాగుతున్న ఆ రోజుల్లో ప్రజలు బానిసలుగా బతికేవారు. నరకం చూసేవారు. ఖాసీం రజ్వీ అనుచరుల అకృత్యాలకు అడ్డూ అదుపూ లేకుండా ప్రజల ధన, మాన ప్రాణాలకు రక్షణ కరువైన దుస్థితి. తెలంగాణ పల్లెల్లో ఒకవైపు భూస్వాములు, రజాకార్ల ఆకృత్యాలపై సాయుధ దళాలు దాడులకు దిగుతుంటే.. మరోవైపు సింగరేణి బొగ్గు గనుల్లో నెలకొన్న దుర్భర పరిస్థితులు కార్మికుల్లో చైతన్యాన్ని కలిగించాయి. ఈ ప్రాంతంలోని దేవులపల్లి శేషగిరిరావు అనే వ్యక్తి ఇల్లందు, కొత్తగూడెం కేంద్రాలుగా బొగ్గు గని కార్మికుల్లో పోరాట చైతన్యాన్ని నింపారు. నిజాం కాలంలోనే కార్మికులను రహస్యంగా సంఘటిత పరిచి సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ను స్థాపించారు. భూస్వాములు, పోలీసుల దాడులను తిప్పికొట్టేందుకు శేషగిరిరావు సాయుధ దళానికి నాయకత్వం వహించారు. సాయుధ దళంతో భద్రాచలం ఏరియాలోని నెల్లిపాక అడవుల మీదుగా మణుగూరు వెళ్తున్న క్రమంలో జరిగిన ఎదురుకాల్పుల్లో శేషగిరి దళం నామ రూపాలు లేకుండా పోయింది. ఉద్యమ కారుడు శేషగిరిరావు కాల్చి చంప బడినపుడు శేషగిరి రావు పేరులోని గిరిని తన పేరు ముందుంచుకుని నల్లమల ప్రసాద్, నల్లమల గిరిప్రసాద్‌గా మారి గిరి దళాన్ని ముందుకు నడిపాడు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం పల్లెలకు పరిమితం కాలేదు. బొగ్గు గనుల్లో దుర్భర జీవితాలు అనుభవిస్తున్న కార్మికులు కూడా ఉద్యమంలో పాల్గొన్నారు. ముఖ్యంగా నిజాంకు ముఖ్య అనుచరుడిగా ఉన్న ఖాసీం రజ్వి అనుచరుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా మడిమ తిప్పని పోరాటాలు కొనసాగించారు. గార్ల, బయ్యారం, ఇల్లందు ప్రాంతాల్లో నిజాంకు వ్యతిరేకంగా ఉద్యమాలు జరిగాయి. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఈ ప్రాంతం మధిర నియోజకవర్గం పరిధిలోకి వచ్చేది. అప్పట్లో మధిర వరంగల్ జిల్లాలో భాగస్వామ్యంగా ఉండేది. మధిర నియోజకవర్గం లోని ప్రతి ఊరు ఆనాటి నిజాం కు వ్యతిరేకంగా పోరాడింది. ప్రధానంగా ఆంధ్ర ప్రాంతంలో బ్రిటిష్ ప్రభుత్వం ఉండడంతో అక్కడి పోరాట ప్రభావం మధిరపై కనిపించేది. ఫలితంగా కమ్యూనిస్టులు ఇక్కడ ఆంధ్ర మహాసభ పేరుతో పెద్ద ఎత్తున ఉద్యమాలు నడిపారు. మధిర లోని అల్లినగరంలో ప్రారంభమైన ఉద్యమం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి నాంది అని చరిత్రకారుల భావన.కమ్యూనిస్టు పార్టీ నేతలు నల్లమల గిరిప్రసాద్, బొమ్మకంటి సూర్యనారాయణ, మల్లు స్వరాజ్యం ఆధ్వర్యంలో ఆనాడు క్యాంపులు నిర్వహించారు. అలా ఆనాటి ప్రజా ఉద్యమాలతో విడదీయ జాలని సంబంధం, అనుబంధం కలిగి ఉన్నాడు నల్లమల గిరి ప్రసాద్. ఖమ్మం శాసనసభ్యులుగా, రాజ్యసభ సభ్యులుగా, సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా, స్వాతంత్ర్య సమరయోధుల స్కీనింగ్ కమిటీ చైర్మన్ గా, విశాలాంధ్ర విజ్ఞాన సమితి అధ్యక్షుడిగా, భారత కమ్యూనిస్టు పార్టీ అఖిల భారత డిప్యూటీ జనరల్ సెక్రటరీగా, తెలంగాణ సాయుధ పోరాట యోధునిగా పేరెన్నిక గన్న భారత కమ్యూనిస్టు పార్టీ ఉద్యమం మచ్చలేని మహా నాయకుడు నల్లమల గిరిప్రసాద్. ఖమ్మం జిల్లా, మధిర మండలం, తొండల గోపవరం గ్రామంలో ఏప్రిల్ 6, 1931లో నల్లమల ప్రసాద్ జన్మించాడు. మద్రాస్ కళాశాలలో చదివే సమయంలో ఆంధ్రా మహాసభ కార్యకలాపాల పట్ల ఆకర్శితులయ్యాడు. 1947లో చదువుకు స్వస్తిచెప్పి ఆంధ్రా మహాసభలో, తర్వాత కమ్యూనిస్టుపార్టీలో చేరాడు. నిజాం రాక్షస రజాకారుల మూకలు గ్రామాలపై పడి బీభత్సకాండ జరుపుతుండగా ప్రజలు తిరబడి సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన నేపథ్యంలో తుపాకి చేతబట్టి సాయుధుడయ్యాడు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ నాయకుడు శేషగిరిరావును కాల్చి చంప బడినపుడు “శేషగిరి రావు” పేరులోని “గిరి”ని తన పేరు ముందుంచుకుని నల్లమల ప్రసాద్, నల్లమల గిరిప్రసాద్‌గా మారి గిరి దళాన్ని నడిపాడు. సాయుధ పోరాటం అనంతరం ఐదు సంవత్సరాల అజ్ఞాత జీవితం గడిపాడు. 1953లో అప్పటి ప్రభుత్వం గిరిప్రసాద్‌పై అనేక కేసులు నమోదుచేసి జైలుకు పంపగా, ఆ కేసులలో ఏదీ రుజువు కాలేదు. గిరి ప్రసాద్ 1953లో ఉద్యమ కమ్యూనిస్టు పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శిగా ఎన్నికై 11 సంవత్సరాల పాటు కొన సాగాడు. 1962లో ఖమ్మం నుండి శాసన సభ్యునిగా ఎన్నికయ్యాడు. కమ్యూనిస్టు పార్టీ చీలిక సమయంలో సిపిఐ బలమైన రాజకీయ శక్తిగా ఎదిగేందుకు విశేష కృషి చేశాడు. 1978లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికై 1991 వరకు పని చేశాడు. విశాలాంధ్ర విజ్ఞాన సమితి అధ్యక్షునిగా, 1992నుంచి రాజ్యసభ సభ్యుడుగా పనిచేశాడు. 1992లో సి.పి.ఐ. జాతీయ కార్యదర్శిగా, 1996లో ఉప ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యాడు. స్వాతంత్ర్య సమరయోధుల స్క్రీనింగ్‌కమిటీ చైర్మన్‌గా పనిచేశాడు. కమ్యూనిస్టు సిద్ధాంతాలకు జీవితాంతం కట్టుబడిన నల్లమల గిరిప్రసాద్ 1997, మే 24 న ఈ లోకాన్ని వదిలి వెళ్ళాడు.

# అలంకారప్రాయంగా కామన్వెల్త్

కామన్వెల్త్ అనేది.. ఆయా దేశాలు ఎలాంటి లాంఛనప్రాయమైన కట్టుబాట్లూ లేకుండా.. సుహృద్భావంతో స్నేహపూర్వకంగా చారిత్రక సంబంధాలను కొనసాగిస్తూ కలిసివుండటానికి గల ఒక మార్గం. కామన్వెల్త్... ప్రపంచంలోని మూడో వంతు జనాభా గల దేశాల కూటమి. ఎన్నో మతాలు, జాతులు, భాషలు, సంస్కృతుల వారు ఇందులో భాగంగా ఉన్నారు. బ్రిటీష్ సామ్రాజ్యం దాని వలస రాజ్యాల స్థాపన ప్రక్రియను ప్రారంభించినప్పుడు, మాజీ బ్రిటిష్ కాలనీల నుండి స్వతంత్ర రాష్ట్రాల ఏర్పాటుకు, గతంలో సామ్రాజ్యంలో భాగమైన దేశాల సంస్థ యొక్క అవసరం ఏర్పడింది.కామన్వెల్త్ దినోత్సవాన్ని అంతకు ముందు ‘ఎంపైర్ దే’ అని పిలిచేవారు. అప్పటి రాయల్ కామన్వెల్త్ సొసైటి అయిన రాయల్ కలోనియల్ ఇన్స్టిట్యూట్ కెనడియన్ శాఖ ‘ఎంపైర్ దే ‘జరపాలన్న సూచన చేసింది. ఈ ప్రతిపాధనను 1898 లో కెనడియన్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ సమావేశంలో ప్రవేశ పెట్టగా ఏకగ్రీవంగా అమోదించారు. అలా ‘ఎంపైర్ దే ‘ ఓ జాతీయ కార్యక్రమమైనది. 1884లో, లార్డ్ రోజ్‌బెరీ అనే బ్రిటిష్ రాజకీయ నాయకుడు మారుతున్న బ్రిటిష్ సామ్రాజ్యాన్ని “కామన్వెల్త్ ఆఫ్ నేషన్స్” గా అభివర్ణించాడు. ఇరవయ్యో శతాబ్దం ఆరంభంలో బ్రిటిష్ వలస పాలనలోని పలు దేశాలు స్వాతంత్ర్యం పొందటం ప్రారంభమైంది. ఆ క్రమంలో ఆయా దేశాలకు బ్రిటన్‌కు మధ్య.. ఆయా దేశాల మధ్య సంబంధాలు ఎలా ఉండాలనేందుకు ఒక రాజ్యాంగ బద్ధమైన వ్యవస్థ అవసరమైంది.1916 మే 24 వ తేదీన యునైటెడ్ కింగ్డమ్ లో తొలిసారిగా ‘ఎంపైర్ దే’ ను దేశవ్యాప్తంగా జరుపుకున్నారు . 70 వేల స్కూళ్ళు , స్టాక్ ఎక్షేంజ్ వంటి సంస్థలు జెండా వందనం చేసి జాతీయ గీతంను ఆలపించారు. 1921 జనవరిలో ‘ఎంపైర్ దే ‘ ఉద్యమాన్ని వీలైనంతగా ముందుకు తీసుకువెళ్ళాలని భావించిన ‘ మీథ్ రాయల్ కలోనియల్ ఇన్స్టిట్యూట్ ను లాంచనంగా అహ్వానించారు. ఇన్స్టిట్యూట్ సభ్యులతో ఏర్పాటు చేసిన కమిటీ, మీథ్ బృందము కలిసి ఉద్యమ కార్యక్రమాలను రూపొందించారు.1927 నుండి 1929 వరకు ఉద్యమ తొలి అద్యక్షుడుగా మీథ్ కొనసాగాడు. 1901 లో మరణించిన క్వీన్ విక్టోరియా జన్మదినం అయిన మే 24 వ తేదీన ఏటా ‘ఎంపైర్ దే’ నిర్వహించాలని నిర్ణయించారు. అలా 1931లో ‘బ్రిటిష్ కామన్వెల్త్ ఆఫ్ నేషన్స్’ ఏర్పడింది.1931 లో, యునైటెడ్ కింగ్‌డమ్, కెనడా, ఐరిష్ ఫ్రీ స్టేట్, న్యూఫౌండ్లాండ్, యూనియన్ ఆఫ్ సౌత్ ఆఫ్రికాతో... ఐదు ప్రారంభ సభ్యులతో బ్రిటిష్ కామన్వెల్త్ నేషన్స్ వెస్ట్ మినిస్టర్ శాసనం క్రింద స్థాపించ బడింది. 1931లో ’బ్రిటిష్ కామన్వెల్త్ ఆఫ్ నేషన్స్’ ఏర్పడగా, . 1949లో ఆ పేరు నుండి ‘బ్రిటిష్’ పదాన్ని తొలగించారు. ఆ కూటమిలో చేరటమనేది ఆయా దేశాల ఇష్టాయిష్టాల మేరకే జరుగుతుంది. అలా 53 దేశాలు ఇందులో సభ్యులుగా చేరాయి. చివరిగా చేరిన మొజాంబిక్, రువాండాలకు బ్రిటిష్ వలసరాజ్యంతో ఎలాంటి సంబంధం లేదు. బ్రిటిష్ వలస పాలన నుంచి విముక్తమైన దేశాల కూటమిగా అది మారింది.ఆధునిక కామన్వెల్త్ కూటమి మొదట ఆస్ట్రేలియా, కెనడా, భారత్, న్యూజిలాండ్, పాకిస్తాన్, దక్షిణాఫ్రికా, శ్రీలంక, యూకేలు సభ్య దేశాలుగా స్వతంత్ర దేశాల ‘ఫ్రీ అసోసియేషన్’ పేరుతో అది ఏర్పడింది. ఆ తరవాత అది ‘కామన్వెల్త్ నేషన్స్’గా రూపాంతరం చెందింది. కామన్వెల్త్ కూటమిలో భాగమైన అత్యధిక దేశాలు బ్రిటిష్ సామ్రాజ్య పాలనతో ఏదో విధంగా సంబంధం ఉన్నవే. రవాండా, మొజాంబిక్ లాంటి దేశాలు మాత్రమే వాటికి అతీతం. రవాండా 2009లో, మొజాంబిక్ 1995లో కామన్వెల్త్ దేశాల కూటమిలో భాగమయ్యాయి. అవి గతంలో బ్రిటిష్ పాలనలో లేవు. ప్రపంచ దేశాలన్నింటి విస్తీర్ణంలో పావు భాగాన్ని కామన్వెల్త్ దేశాలే ఆక్రమిస్తున్నాయి.విస్తీర్ణం పరంగా కెనడా కామన్వెల్త్ కూటమిలో తొలిస్థానంలో, ప్రపంచంలో రెండో స్థానంలో ఉంది. ఆస్ట్రేలియా, భారత్‌లు కూడా విస్తీర్ణం పరంగా చాలా పెద్దవి. సమోవా, టువాలు, ఆంటిగ్వా లాంటి చిన్న దేశాలు కూడా కూటమిలో భాగంగా ఉన్నాయి. ప్రస్తుతం ప్రపంచ జనాభా దాదాపు 8.2 బిలియన్ ప్రజలు ఉన్నారు. 2024లో, ఐక్యరాజ్యసమితి అంచనా ప్రకారం ఇది 8.1 బిలియన్లకు చేరుకుందని పేర్కొంది, ప్రపంచ జానాభాలో మూడో వంతు ప్రజలు కామన్వెల్త్ కూటమిలో భాగమైన 53 దేశాల్లోనే జీవిస్తున్నారు. ఈ దేశాల్లో ఎక్కువమంది 30 ఏళ్ల లోపువారే.ఈ కూటమిలో జనాభా పరంగా భారతే అతిపెద్ద దేశం. మొత్తం కామన్వెల్త్ కూటమి దేశాల జనాభాలో సగం భారత్‌లోనే ఉంది. కూటమిలోని 31 దేశాల జనాభా 16 లక్షల కంటే తక్కువే. 2012 దాకా కామన్వెల్త్ కూటమికి ఎలాంటి రాజ్యాంగం లేదు. ఆ తరవాతే ప్రజాస్వామ్యం, లింగ సమానత్వం, శాంతి, భద్రత లాంటి 16 విలువలకు సభ్య దేశాలు కట్టుబడి ఉండాలని తీర్మానించు కున్నాయి. కామన్వెల్త్ సెక్రటేరియట్ లండన్‌లో ఉంది. విద్యా రంగం నుంచి పట్టణ ప్రణాళిక వరకూ అనేక రంగాల్లో కామన్వెల్త్ సంస్థలు కృషి చేస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో ఆయా దేశాల్లో ఎన్నికలు సక్రమంగా జరిగేలా చూసేందుకు పరిశీలకులు కూడా హాజరవుతుంటారు. అంతర్జాతీయ వ్యవహారాల్లో ఇతర దేశాల మీద ఆ కూటమి చూపే ప్రభావం ఏదీ లేదనే చర్చ ఉంది. సభ్య దేశాల మధ్య వాణిజ్య సంబంధాల కోసం కామన్వెల్త్ చేస్తున్నదేమీ లేదు. ఇందుకోసం అన్ని దేశాలూ ఏదో ఒక ప్రాంతీయ కూటమి లోనో అంతర్జాతీయ కూటమి లోనో భాగస్వాములుగా ఉన్నాయి. కామన్వెల్త్ అనేది రెండేళ్ల కోసారి కామన్వెల్త్ దేశాల రాజకీయ అధినేతల సమావేశం, నాలుగేళ్లకోసారి కొన్ని పతకాల కోసం క్రీడలను నిర్వహించే అలంకార ప్రాయమైన సంస్థగా మిగిలిపోతున్నదనే విమర్శలు కూడా లేక పోలేదు

# ప్రభుత్వ బడిని కాపాడుకోలేమా!

ప్రభుత్వ బడిని కాపాడటం, సంస్కరణల కోసం నూతనంగా నియమించిన తెలంగాణా విద్యాకమిషన్ సర్కార్‌కు కొన్ని సూచ నలు చేసింది. బడీడు పిల్లల కోసం ఇప్పుడున్న ప్రభుత్వ బడుల స్థానంలో నర్సరీ నుండి రెండవతరగతి వరకు ”తెలంగాణా ఫౌండేషన్ స్కూల్” మండ లానికి నాలుగు ఏర్పాటు చేయాలని,” నర్సరీ నుండి ఇంటర్ వరకు ”తెలం గాణా పబ్లిక్ స్కూల్” మండలానికి కనీసం మూడు చొప్పున ఏర్పరచాలని సిఫార్సు చేసింది, అంతే కాదు, 2025-26 విద్యా సంవ త్సరం నుంచి 2029-30కి ఈ ప్రణాళిక ముగిసేలా ఆర్థిక అంచనా కూడా ఇచ్చింది. మండలంలో నాలుగు ఫౌండేషన్ స్కూల్‌కు 3.5 కోట్ల చొప్పున 14కోట్లు, మూడు పబ్లిక్ పాఠశాలలకు ఒక్కో పాఠశాలకు 12కోట్ల చొప్పున 36కోట్లు వెరసి మండలానికి 50కోట్ల రూపాయలు ఖర్చు అంచనా వేసింది. ఈ లెక్కన 2025-26 ఏడాదికి గానూ వంద మండ లాలు ప్రభుత్వ బడులు తీసుకుంటే ఈఏడాది 5వేల కోట్లు ఖర్చుచేయాలి.బడ్జెట్ కంటేముందే ప్రభుత్వానికి తెలంగాణా విద్యాకమిషన్ నివేదిక ఇచ్చినా బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. మరి ప్రభుత్వ పాఠశాల సంస్కరణ ఎలా జరుగుతుంది? ఇంకా పాఠశాల యాక్సెస్ కోసం విద్యాకమిషన్ పలు సూచనలు చేసింది. క్యాచ్‌మెంట్ ఏరియా నుండి పాఠశాల వరకు అవసరమైతే ట్రాన్స్‌పోర్టు సౌకర్యం ఏర్పాటు చేయాలని సిపార్సు చేసింది. ఈ సిపార్సు కొత్తదేమీకాదు! సర్వ శిక్షాఅభియాన్ ఇంతకు ముందు యాక్సెస్‌లెస్ పాఠశాలలకు సిపార్సు చేసిన ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యాన్నే తాజాగా కమిటీ సిఫార్సు చేసింది. దశాబ్దంన్నర క్రితమే సర్వ శిక్షా అభియాన్ ఈ సిపార్సు చేసింది. అయినా పాలకులు పట్టించుకోకపోవడం వల్ల ఆ పథకం అమలు కాలేదు? ఇప్పుడు మినీబస్సులు,ఆటోలు నిరుద్యోగులకు ఇచ్చి ఉచిత రవాణా సౌకర్యం కల్పించడం అనే ఒక మంచి ఆలోచన తెలంగాణా విద్యా కమిషన్ చేసింది.ఇక గ్రామాలు, పట్టణం మురికివాడల్లో ఉన్న ఈ వేలాది ప్రభుత్వ పాఠశాలలకువిలువైన భూములు న్నాయి. కొన్ని దశాబ్దాలు గా కోట్లాది రూపాయలు వెచ్చించి సర్వశిక్షా అభియాన్ కట్టిన భవనాలూ ఉన్నాయి. ఇంటర్నెట్‌తో పాటు కంప్యూటర్ సౌక ర్యాలు, లేబొరేటరీ సౌకర్యాలు సైతం ఈ పాఠశాలల్లో అంతంత మాత్రమే. బోధించడానికి నిష్ణాతు లైన, శిక్షణ పొందిన ఉపాధ్యా యులు ఉన్నారు. కానీ! ”అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు” పాఠశాలలో చదువుకునే విద్యార్థుల సంఖ్య రోజురోజుకూ దిగజారి పోతు న్నది. అందులో నూటికి నూరు శాతం పర్యవేక్షణా లోపమే. ప్రభుత్వ పాఠశాల ఏరియాలో పిల్లలు లేరా? ఉన్నారు.కానీ,వారు ప్రభుత్వ పాఠశాల దాటి బస్సుల్లో ప్రయివేటుకు వెళ్తున్నారు. మరికొందరు హాస్టల్ సౌకర్యం ఉన్న రెసిడెన్షియల్ పాఠశాలల బాట పడుతున్నారు.

పాలకులు ఎవరు అధికారంలోకి వచ్చినా కొన్ని దశాబ్దాలుగా ఓ చిత్రమైన వైఖరిని వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో ఉన్న ముప్పై వేల పైచిలుకు ప్రభుత్వ పాఠశాలలకు నిధులు కేటాయించడం కష్టమని, కొద్ది నిధులతో ప్రజల కోసం తామేదో విద్యావ్యవస్థలో కొత్త ప్రయోగం చేస్తున్నట్లు నటిస్తు న్నారు.అరకొర రెసిడెన్షియల్ పాఠశాలలు ప్రక టించి ప్రభుత్వ పాఠశాలలో నమోదును, విద్యార్థుల సంఖ్యను తగ్గించి దెబ్బ తీస్తున్నారు? ప్రజల్ని మసి భూసి మభ్యపెడుతున్నారు? తక్కువ బడ్జెట్‌తో ఉన్నత ఫలితాలు తీసుకొస్తున్నామని చెప్పుకోవడా నికి పనికొస్తాయి తప్ప ఇలాంటి ప్రయోగాల్లో చిత్త శు ద్ధి కనపడదు! వీటితో ప్రజలకు ఎలాంటి ఉప యోగం ఉండదని ఇప్పటికే ఆయా వ్యవస్థలు నిరూ పించాయి. అంతిమ సారాంశం ఏమిమంటే సకల సౌకర్యాలున్న ప్రభుత్వ పాఠశాలల్లో చదువు కోవాల్సిన విద్యార్థులను అటు ప్రయివేటు పాఠశాల వ్యవస్థ, ఇటు గమ్యమేమిటో అర్థం కానీ ప్రత్యేక పాఠశాలల ఏర్పాటు, వెరసి రాష్ట్రంలో ఉన్న ముప్పై వేల పైచిలుకు ప్రభుత్వ పాఠశాలల్లో సగానికిపైగా మూతపడే దిశగా ప్రయా ణం కొనసాగుతున్నాయి. 2023-24 ప్రభుత్వ విద్యా గణాంకాల్ని అనుసరించి రాష్ట్రంలో ప్రభుత్వ రంగంలో ప్రాథమిక పాఠశాలలు 19,734, ప్రాథమి కోన్నత 3,237, ఉన్నత 4843, రెసిడెన్షియల్ 403, వీటికి అదనంగా ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలు మరో 662 ఉన్నాయి. మొత్తంగా 30,684 ప్రభుత్వ పాఠశాలలు ప్రస్తుతం మనుగడలో ఉన్నాయి.ఇక ప్రయివేటు రంగంలో గుర్తింపు పొందిన 12,126 పాఠ శాలలుండగా ఇందులో అత్యధికంగా ఆరువేల పైచిలుకు ప్రాథ మిక పాఠశాలలతో కూడిన ఉన్నత పాఠశాలలే!? ప్రభుత్వ పాఠశాలల్లో అన్నిరకాల శిక్షణ పొందిన, సబ్జెక్టు నైపుణ్యం కలిగిన 1,48, 456 మంది ఉపాధ్యాయులు పని చేస్తుండగా, కేవలం పన్నెండు వేల ప్రయివేటు రంగంలోని పాఠ శాలల్లో సరైన కనీస వేతనంగానీ, సరైన శిక్షణగానీ, చాలా మందిలో కనీసం నైపుణ్యంగానీ లేని1,89, 438 మంది ప్రయివేటు ఉపాధ్యాయులు ఉన్నారు.అంతేకాదు, ప్రభుత్వ పాఠశాలలో ప్రతి19 మందికి ఒక ఉపాధ్యాయుడు ఉంటే, ప్రయివేటు పాఠశాలలో ఆసంఖ్య 24గా ఉంది. అంటే ఇక్కడ ప్రయివేటు యాజమాన్యాలు లాభాలే ధ్యేయంగా పని చేయడంతో పాటు ఉపాధ్యాయులకు తక్కువ వేతనాలిస్తూ శ్రమదోపిడీకి పాల్పడుతున్నట్లు ప్రభుత్వ గణాంకాలే స్పష్టం చేస్తున్నాయి.

RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in



24 మే 2025 శనివారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:304

# తెలంగాణ అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం...

## జహీరాబాద్ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకారం అందిస్తాం

## రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి





సంగారెడ్డి జిల్లా ప్రతినిధి మే 23(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా/జహీరాబాద్/తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు, శ్రీ బసవేశ్వర మహారాజ్ విగ్రహావిష్కరణ చేశారు,జహీరాబాద్ నియోజకవర్గంలో రూ.100 కోట్లతో నిర్మించిన 9 కిలో మీటర్ల గ్రీన్ కారిడార్ నిమ్జ్ రోడ్డు, రూ.100 కోట్లతో జహీరాబాద్ పట్టణంలో నిర్మించిన రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి,చిరాగ్‌పల్లి-ఇప్పపల్లి గ్రామాల మధ్య రూ.20 కోట్లతో రోడ్డు పనులకు శంకుస్థాపన,ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు, మహిళా సంఘాలకు చెక్కులు పంపిణీ,రూ.2 కోట్ల తో 3 షిఫ్ట్ ల వారిగా మహిళా సహకార సంఘాలచే నిర్వహించబోయే

ఇండియన్ ఆయిల్ ఔట్ లెట్ ను ప్రారంభించారు,ఝరాసంగం మండలంలోని మాచునూరులో రూ.26 కోట్లతో నిర్మించిన కేంద్రీయ విద్యాలయ భవనాన్ని ప్రారంభించారు,అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి మెదక్ ప్రాంతానికి ఇందిరమ్మకు ఉన్న అనుబంధం విడదీయలేనిదని ఆయన అన్నారు. మెదక్ పేరు గుర్తొస్తేనే ఇందిరమ్మను తలచుకుంటామని తెలిపారు,అలాగే ఇందిరమ్మ గుర్తొచ్చిన ప్రతీసారి మెదక్‌ని తలుచుకుంటామని ఆయన వివరించారు. ఇందిరమ్మ తన చివరి రోజుల్లో మెదక్ ఎంపీగా కొనసాగారని గుర్తుచేశారు,రైతులను అప్పుల బాధ నుంచి విముక్తి కలిగించామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు,రైతు భరోసాని 12 వేలకు పెంచి సహాయం అందిస్తున్నామని చెప్పారు. భూమి లేని రైతులకు కూడా సహాయం అందిస్తున్నామని తెలిపారు.. వరి వేసుకుంటే ఉరే అని ఆనాటి పాలకులు అన్నారని కానీ నేడు వరి పంటకు బోనస్ ఇస్తున్నామన్నారు,18 నెలల్లో మహాలక్ష్మి పథకం కోసం 5500 కోట్లు కేటాయించామని కోటి మంది మహిళలను కొటేశ్వరులు చేయాలన్నదే తమ లక్ష్యమని పునరుద్ఘాటించారు. మిస్ వరల్డ్ కాంపిటీషన్ కి వచ్చిన వారు మన ఆడబిడ్డలు చేసిన వస్తువులను చూశారన్నారు,మహిళలే బస్సులు కొని ఆర్టీసీకి కిరాయి ఇచ్చేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు,ఇందిరమ్మని ఆదర్శంగా తీసుకుని సోనియమ్మ స్ఫూర్తితో ఆడబిడ్డలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేస్తామని భరోసా ఇచ్చారు,తెలంగాణ ఉద్యమంలో కీలకంగా ఉన్న యువతకు గత పదేళ్లుగా ఉద్యోగాలు లేవని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు,నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి కోసం చర్యలు తీసుకుంటున్నామని మీ అందరూ అండగా ఉంటే ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యమని చెప్పారు.

రాష్ట్రానికి రావాల్సిన నిధులు కోసం ప్రధాని మోడీని ఎన్ని సార్లు అయిన కలుస్తామని స్పష్టం చేశారు. చెరువు మీద అలిగితే మనకే వాసన వస్తుందని అన్నారు. నేను మీ కోసం పని చేస్తా కష్టపడుతానన్నారు,గత ప్రభుత్వ హయాంలో నిమ్జ్ అభివృద్ధి కుంటుపడిందని ముఖ్యమంత్రి ఆరోపించారు,ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిమ్జ్ భూ నిర్వాసితులకు నష్టపరిహారం పెంచాం, భూసేకరణను వేగవంతం చేశామని చెప్పుకొచ్చారు,త్వరలో హ్యుందాయ్ కార్ల తయారీ కంపెనీ ఇక్కడ పనులు ప్రారంభిస్తోందని చెప్పారు. నిమ్జ్ భూ నిర్వాసితులైన 5612 కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఆ కుటుంబాలకు భోజనాలు పెట్టి ఇండ్ల పట్టాలు ఇచ్చే బాధ్యత జగ్గారెడ్డికి అప్పగించారు.

జహీరాబాద్ అభివృద్ధి కోసం ప్రత్యేక సమీక్ష చేసి నిధులు మంజూరు చేస్తాం. ఎన్నికలు వచ్చినప్పుడే రాజకీయాలు%ౌ%ఆ తర్వాత అభివృద్ధి మన అజెండా సంజీవ రెడ్డి, సురేష్ షెట్కార్ నారాయణఖేడ్ కి రెండు కళ్ళలాంటి వారు. పటాన్ చెరు మినీ ఇండియా ప్రాంతం,బిహెచ్ఇఎల్, బిడిఎల్, నిమ్జ్ , ఇక్రిశాట్ ఇవన్నీ కాంగ్రెస్ హయాంలో వచ్చినవే.. సింగూరు నుంచి మంజీరా జలాలు హైదరాబాద్ దాహార్తిని తీరుస్తున్నాయి. సింగూరు ప్రాజెక్టును టూరిజం హబ్ గా మారుస్తాం, అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు,15 నెలల్లో తెలంగాణ కు 3 లక్షల కోట్ల పెట్టు బడుల్ని తెచ్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు,జహీరాబాద్ చెరుకు రైతులు సహకారం సంఘం గా ఏర్పడి ముందుకు వస్తే నిమ్జ్ లో స్థలం కేటాయించి చెరుకు కర్మాగారం ఏర్పాటుకు సహకారం అందిస్తామని చెప్పారు,ప్రతిపక్ష రాజకీయ నాయకులు అసెంబ్లీకి రావాలని మరోసారి సీఎం రేవంత్ రెడ్డి అన్నారు, ఏ రోజు తాను సీఎంగా అహంకారానికి పోలేదని చెప్పారు. ప్రతిపక్షాలు అండగా ఉంటే అద్భుతాలు చేస్తామని ప్రపంచంలో తెలంగాణని గొప్ప రాష్ట్రంగా తీర్చుదిద్దుతామని

ముఖ్యమంత్రి తెలిపారు.ఈ కార్యక్రమంలో మంత్రులు కొండా సురేఖ,దామోదర రాజనర్సింహ,ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ,ఎంపీ సురేష్ షెట్కర్,జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరం,ఎమ్మెల్యేలం,కార్పొరేషన్ చైర్మన్లు,ఉన్నతాధికారులు,పాల్గొన్నారు.

## తెలంగాణను ప్రశంసలతో ముంచిన మిస్ వరల్డ్ కాంటెస్టెంట్లు

### మహిళల భద్రత, సాధికారతకు ఆదర్శంగా నిలుస్తున్న తెలంగాణ

### "తెలంగాణ అభివృద్ధి, ఆత్మీయత, ఆత్మగౌరవానికి ప్రతీక" ం అంతర్జాతీయ అందాల కిరీటధారులు

హైదరాబాద్, మే 23, 2025: 72వ మిస్ వరల్డ్ ఫెస్టివల్‌లో భాగంగా హైదరాబాద్‌లో నిర్వహించిన "హెడ్-టు-హెడ్ చాలెంజ్" ఫినాలే సందర్భంగా, వివిధ ఖండాల నుంచి వచ్చిన అందాల కిరీటధారులు తెలంగాణ రాష్ట్రాన్ని ం ముఖ్యంగా హైదరాబాద్‌ను ం అభినందనలతో ముంచెత్తారు. ఈ పోటీ సందర్భంగా జడ్జీలు అడిగిన ప్రశ్నలకు తెలంగాణ సంస్కృతి, అభివృద్ధి, మహిళల సాధికారత, భద్రతకు సంబంధించి ఔశీత్‌వర్ఘుత్ం చేసిన వ్యాఖ్యలు ప్రపంచ దృష్టిని ఆకర్షించాయి.

మహిళల భద్రతపై అభినందనలు:

తెలంగాణ రాష్ట్రం మహిళల భద్రతను హక్కుగా గుర్తించి, తగిన చర్యలు తీసుకుంటుందన్న విషయాన్ని పలువురు స్పష్టం చేశారు. భద్రత అనేది ఒక హక్కు, దానిని అందించడంలో తెలంగాణ ముస్ముందు ఉందన్నారు. హైదరాబాద్ నగర వీధుల్లో మహిళలు రాత్రిపూట కూడా భయపడకుండా స్వేచ్ఛగా తిరగగలగడం ఆశ్చర్యాన్ని కలిగించిందని చెప్పారు. ఇది ఒక సురక్షిత నగరానికి ప్రతీక అని అభివర్ణించారు. పోలీస్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించి, అక్కడ షీ టీమ్స్, హాక్ ఐ, 24%ఇ%7 పర్యవేక్షణ వంటి సాంకేతిక భద్రతా వ్యవస్థలను పరిశీలించి మహిళల రక్షణ కోసం తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు వారికి విశేషంగా అక్కర్శించయని అన్నారు.

తెలంగాణను ప్రపంచానికి ఎలా పరిచయం చేస్తారు?

తెలంగాణ సాంకేతికత, వైద్య రంగాల్లో అభివృద్ధి చెందడమే కాకుండా, మహిళల హక్కులు, విద్య, సాధికారతకు కూడా అత్యున్నత ప్రాధాన్యతనిచ్చే రాష్ట్రంగా పలువురు వివరించారు. ఇది ప్రపంచానికి శక్తివంతమైన సందేశాన్ని అందిస్తున్నదని అభిప్రాయపడ్డారు.

తెలంగాణ ప్రజల ఆత్మీయత, ఆదరణ, ఆతిథ్య భావం ప్రత్యేకంగా నిలిచిందని అన్నారు. రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు స్ఫూర్తిదాయకంగా అనిపించాయని, 'బ్యూటీ విత్ పర్పస్' భావన ఇక్కడ జీవనశైలిల్లో కనిపించిందని చెప్పారు.తెలంగాణ అనుబంధాల తాటిపై నిలిచిన భూమి, స్నేహబంధాలకు నిలయం, సంస్కృతికి



ప్రతీకగా భావిస్తున్నామని చెప్పారు.72వ మిస్ వరల్డ్ కాంటెస్టెంట్ల కళ్లలో తెలంగాణ ఒక అభివృద్ధి చెందిన, మహిళలకు భద్రత కలిగిన, ఆత్మీయత నిండిన ప్రగతిశీల రాష్ట్రంగా నిలిచింది. వారు వ్యక్తం చేసిన అభిప్రాయాలు తెలంగాణ కీర్తి, అతిద్య, పురోగతిని అంతర్జాతీయంగా తెలియజేస్తున్నడంలో సందేహం లేదు.

## యుద్ధప్రాతిపదికన పాలేరు సాగర్ యూటీ పనులు

### ఎట్టి పరిస్థితుల్లోనూ జూలై 10లోగా నీటిని విడుదల చేయాల్సిందే

### పనులను ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి పొంగులేటి



హైదరాబాద్ :- ఖమ్మం జిల్లాలో సుమారు నాలుగు లక్షల ఎకరాలకు సాగునీటిని అందించే పాలేరులోని నాగార్జున సాగర్ ఎడమ ప్రధాన కాలువ అండర్ టన్నెల్ ( యూటీ) నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఎట్టిపరిస్థితుల్లోనూ వచ్చే జూలై 10వ తేదీనాటికి పూర్తిచేసి వానాకాలం సీజన్‌కు రైతాంగానికి నీటిని విడుదల చేయాలని ఆదేశించారు. శుక్రవారం ఆయన కూసుమంచి మండలం జుజ్జులరావుపేటలో జరుగుతున్న పాలేరు సాగర్ కాలువ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు

ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు సెప్టెంబర్‌లో పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి మండలం జుజ్జులరావు పేట సమీపంలో పాలేరు రిజర్వాయర్ దగ్గర ప్రధాన కాలువపై అండర్ టన్నెల్ ( యూటీ) కొట్టుకపోయిందన్నారు. రైతులకు ఇబ్బంది కలగకూడదన్న ఆలోచనతో అప్పట్లో తాత్కాలిక ఏర్పాట్లు చేసి సాగునీటిని అందించడం జరిగింది. శాశ్వత ప్రాతిపదికన రూ 14.20 కోట్లతో ఈ యూటీ కాలువ మరమ్మతులను ప్రారంభించడం జరిగిందని ఖమ్మం జిల్లాలో వ్యవసాయ రంగానికి జీవనాధారమైన ఈ కాలువ మరమ్మతులను పూర్తిచేసి సాగునీరు అందిస్తాం. దీనివలన ఖమ్మం జిల్లాలో సుమారు నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుండగా ఒక్క పాలేరు నియోజకవర్గంలో 1.33 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. వానాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని అత్యంత ప్రాధాన్యతా క్రమంలో అవసరమైతే రోజుకు రెండు షిఫ్ట్‌ల క్రమంలో పనిచేసి గడువులోగా నిర్మాణపనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

## ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లండి

### రాహుల్ గాంధీ ఆలోచనలు, కాంగ్రెస్ పార్టీ విధి విధానాలపై అవగాహన కల్పించండి

### యువజన కాంగ్రెస్ నాయకులకు మంత్రి శ్రీధర్ బాబు దిశా నిర్దేశం



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రజాబలం ప్రతినిధి దేశంలో భారతీయ జనతా పార్టీ(బీజేపీ) సాగిస్తున్న నియంతృత్వ పాలనకు చరమగీతం పాడేందుకు రాహుల్ గాంధీ ఆలోచనలు, కాంగ్రెస్ పార్టీ విధి విధానాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని యువజన కాంగ్రెస్ నాయకులకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సూచించారు. తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి ఆధ్వర్యంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర బాల వికాస కేంద్రంలో నిర్వహిస్తున్న "వైట్ టీ షర్ట్" శిక్షణా శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. అనంతరం యువజన కాంగ్రెస్ నాయకులకు దిశా నిర్దేశం చేశారు.

రాహుల్ గాంధీ అత్యంత ప్రతిష్టాత్మంగా చేపట్టిన "వైట్ టీ షర్ట్" ఉద్యమం చాలా గొప్పదన్నారు.

కరుణ, ఐక్యత,అహింస, సమానత్వం, అందరికీ పురోగతి లాంటి అయిదు మార్గదర్శకాలకు "వైట్ టీ షర్ట్" చిహ్నంగా నిలుస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి యువజన యువజన కాంగ్రెస్, కాంగ్రెస్ పార్టీకి వెన్నెముక అన్నారు.

దేశ రాజకీయాలను ప్రభావితం చేసే శక్తిగా యువజన కాంగ్రెస్ అవతరించిందన్నారు. ఆ స్ఫూర్తితో

కేంద్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు, రాహుల్ గాంధీని ప్రధానిగా చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా డీసీసీ ప్రెసిడెంట్ హరివర్ధన్ రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షులు వజ్రేష్ యాదవ్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఇంచార్జ్ సయ్యద్ ఖలీద్, జాతీయ యువజన కాంగ్రెస్ కార్యదర్శి శ్రవణ్ రావు, నాయకులు నితీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# దైవిక పాత్రలకు జీవంపోసిన నటుడు

టి.ఎస్. విజయ చందర్ తెలుగు నాటక, సినిమా, టెలివిజన్ రంగాల్లో విశిష్టతను సంపాదించుకున్న గొప్ప కళాకారుడు. నటుడు, దర్శకుడు, నిర్మాతగా ఆయన ప్రస్థానం ప్రతి దశలోను విలక్షణతను చాటింది. 1939 మే 24న ఆంధ్ర ప్రదేశ్‌లో జన్మించిన ఆయన, చిన్ననాటి నుంచే కళలకు ఆసక్తితో ఎదిగారు. కుటుంబ నేపథ్యం కూడా ఆయనకు స్ఫూర్తి దాయకమే. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు ఈయనకు తాత అవుతారు. విజయచందర్ తల్లి పుష్పావతి, ప్రకాశం పంతులు కూతురు. తండ్రి తెలిదేవర వెంకట్రావు హోమియోపతి వైద్యుడు. బ్యాడ్మింటన్ ఛాంపియన్ కూడా. అంతేగాక ప్రసిద్ధ గాయని టంగుటూరి సూర్యకుమారి కూడా ఆయనకు సమీప బంధువు. విజయచందర్ సినీ రంగంలోకి అడుగుపెట్టిన చిత్రం 'సుడి గుండాలు (1967), అదే సంవత్సరానికి ఉత్తమ తెలుగు ఫీచర్ ఫిల్మ్‌గా జాతీయ అవార్డు అందుకుంది. నటుడిగా మాత్రమే కాక, ఒక ఆలోచనాత్మక కళాకారుడిగా ఆయన చూపిన ప్రావీణ్యం తర్వాతి చిత్రాలలో స్పష్టంగా కనపడింది. 1978లో నిర్మించిన 'కరుణా మయుడు' చిత్రం ద్వారా ఆయనను తెలుగు ప్రేక్షకులు పూర్తిగా గుర్తించారు. యేసు క్రీస్తు పాత్రలో ఆయన హృద్య నటన, ఆత్మీయమైన భాష్యం ప్రేక్షకులను ఆధ్యాత్మికంగా ప్రభావితం చేసింది. ఈ చిత్రాన్ని ఆయన నిర్మాతగా నిర్మించారు. అది తెలుగుతోపాటు తమిళం, మలయాళంలో కూడా విడుదలై విజయవంతమైంది.ఆయన ప్రతిభను, పూర్వీకుల జీవితాల రూపకల్పన లో మనం గమనించ వచ్చు. 1982లో విడుదలైన 'ఆంధ్ర కేసరి' చిత్రంలో ఆయన టంగుటూరి ప్రకాశం పంతులు పాత్రను పోషించడం మామూలు విషయం కాదు. ఆ పాత్రకు ఆయన కలిగిన వ్యక్తిగత అనుబంధం, పరిశోధనాత్మకత, నటనలోని గంభీరత చిత్రాన్ని చారిత్రకంగా నిలిపాయి. ఈ చిత్రానికి రచయిత, దర్శకుడు, నిర్మాతగా కూడా ఆయన సేవలు అందించారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో రూపొందిన ఈ చిత్రం ప్రత్యేక జ్యూరీ పురస్కారం అందుకుంది.1986లో వచ్చిన 'శ్రీ షిర్డీ సాయిబాబా మహత్యం' చిత్రంలో ఆయన పోషించిన సాయిబాబా పాత్ర అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో ప్రదర్శించబడిన స్థాయికి చేరింది. ఆయన నటన భక్తిని రేకెత్తించేలా ఉండి, ప్రేక్షకులను ఆధ్యాత్మిక భావనల్లో తేలి యాడించింది. ఆయనకు "దైవిక పాత్రల పోషణలో నిపుణుడు" అనే పేరు ఈ చిత్రాల వల్లే వచ్చినదని చెప్పవచ్చు.టెలివిజన్ రంగంలోనూ ఆయన విశేష కృషి చేశారు. 1996 నుండి 1998 వరకు 'దయాసాగర్' అనే టీవీ సీరియల్‌లో యేసు క్రీస్తుగా ఆయన పోషించిన పాత్ర దేశ వ్యాప్తంగా ప్రసారమైంది. ఇది డీడీ నేషనల్‌లో ప్రదర్శితమై, వివిధ భారతీయ భాషలలో డబ్బింగ్ చేయబడింది. అది ఆయన ప్రభావాన్ని టెలివిజన్ దశలోనూ కొనసాగించిన ముద్రగా నిలిచింది.ఆయన కృషికి గుర్తింపుగా 'కరుణా మయుడు' చిత్రానికి ఉత్తమ తెలుగు చిత్రం నంది అవార్డు లభించగా, 'ఆంధ్ర కేసరి'కి ప్రత్యేక జ్యూరీ అవార్డు దక్కింది. అవార్డులు ఆయన నిష్ఠను, శ్రమను గుర్తించిన గుర్తింపులు మాత్రమే.నటుడిగా మాత్రమే కాకుండా, విజయచందర్ సమాజ సేవకుడి గానూ తనదైన ముద్ర వేశారు. 2007లో పాత సినీ కళాకారుల ప్రయోజనార్థం, మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ కోసం ఆయన భూమిని దానం చేశారు. ఇది ఆయన కళా సాన్నిధ్యాన్ని సమాజంతో మిళితం చేసిన ఉదాహరణ. విజయచందర్ జీవితం తెలుగు కళాజీవులకే కాకుండా, అన్ని రంగాల్లో ఉన్నతంగా ఆలోచించాలనుకునే వ్యక్తులకు స్ఫూర్తిదాయకం. ఆయన జీవన ప్రయాణం ఒక్క కళాకారుడిగా కాకుండా, సంస్కార ప్రదాతగా, చరిత్రకు వేదికగా నిలిచిన నటుడిగా నిలిచి పోతుంది. నటనకు అంకితమైన వ్యక్తిగా, పాత్రల లో జీవించిన కళాకారుడిగా విజయచందర్ తెలుగు సినిమా చరిత్రలో చిరస్థాయిగా నిలిచి ఉంటారు.

# వినూత్న కార్యక్రమాలతో పవన్



గుంటూరు, మే 23, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జనంలోకి వెళ్లాలంటే కొంత ఇబ్బందులు తప్పవు. ఆయన ఇతర రాజకీయ నేతలు తరహా కాదు. సినీ హీరో కావడంతో పాటు లక్షలాది మంది అభిమానులు ఉండటంతో పవన్ కల్యాణ్ అంత సులువుగా జనంలోకి వెళ్లలేరు. ఏదైనా బహిరంగ సభలు, రోడ్ షోలకు మాత్రమే పరిమితమవుతారు. పాదయాత్ర వంటివి చేయాలన్నా ఆయనకు భద్రతాపరమైన ఇబ్బందులు తలెత్తుతాయి. వాహనంపై ఉన్నప్పటికీ అభిమానులు పోలీసు వలయాన్ని ఛేదించుకుని మరీ వచ్చి రచ్చ చేయడం అనేకసార్లు చూశాం. అభిమానుల తాకిడిని తట్టుకోవడం కూడా పవన్ కల్యాణ్ కు కష్టంగా మారి జనంలోకి రావడం అంటే పవన్ భయపడిపోతున్నారు. పవన్ కల్యాణ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా బాధ్యతలను చేపట్టిన నాటి నుంచి అభివృద్ధి కార్యక్రమాలపైనే ఎక్కువ ఫోకస్ పెట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులను ప్రత్యేకంగా వినియోగించుకోవడమే కాకుండా, తనకున్న పలుకుబడితో నిధులు తీసుకు రావడంతో గ్రామీణ రహదారులు మాత్రమే కాకుండా గిరిజన ప్రాంతాల్లో దశాబ్దాల నుంచి రోడ్డు సౌకర్యం లేక అల్లాడుతున్న ఏజెన్సీ ఏరియాల్లో రోడ్ల నిర్మాణం చేపట్టారు. స్వయంగా గిరిజన ప్రాంతాలను దర్శించి వారితో చర్చించి సమస్యలను అడిగి తెలుసుకుని మరీ పరిష్కారం చేసే దిశగా పవన్ కల్యాణ్ అడగులు వేస్తున్నారు. ఒక్క గిరిజన ప్రాంతాలకు మాత్రమే నేరుగా పవన్ కల్యాణ్ జనంలోకి వెళుతున్నారు. పంచాయతీలకు నిధులు మంజూరు చేయించి పల్లె పండగ పేరుతో ఒక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ పంచాయతీ పరిధిలో ఉన్న సమస్యలను సర్పంచ్ తో పాటు గ్రామ కమిటీలు కూర్చుని పరిష్కరించుకునేందుకు వీలుగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పంచాయతీలకు ప్రభుత్వం చేత నిధులు విడుదల చేయించి విద్యుత్తు బకాయిలతో పాటు, రహదారులు, మంచినీటి సౌకర్యం వంటివి కల్పించేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడింది. గత వైసీపీ పాలనలో పంచాయతీలను నిర్వీర్యం చేయడంతో సర్పంచ్ లు అప్పుల పాలయ్యారు. దీంతో పవన్ కల్యాణ్ పట్టుబట్టి మరీ చంద్రబాబు నాయుడును ఒప్పించి నిధులను పంచాయతీలకు విడుదల చేయించి పల్లె పండగను నిర్వహించారు. మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మన ఊరు-మాటామంతీ పేరుతో ముఖాముఖి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకునే ప్రయత్నంలో భాగంగా పవన్ కల్యాణ్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పవన్ కల్యాణ్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. నేడు శ్రీకాకుళం జిల్లా రావివలస ప్రజలతో పవన్ కల్యాణ్ ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. మన ఊరు-మాటామంతీ కార్యక్రమం జరగనుంది. టెక్కలిలోని థియేటర్ ఇందుకు వేదిక కానుంది. ఈ కార్యక్రమంలో ప్రజలు పాల్గొని తమ సమస్యలను నివేదించవచ్చు. అక్కడికక్కడే సమస్యలన పరిష్కరించేలా పవన్ కల్యాణ్ ప్లాన్ చేశారు. పవన్ కల్యాణ్ ప్రజల్లోకి వెళ్లకుండా ప్రత్యామ్నాయ మార్గం ద్వారా సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టడం శుభపరిణామమని అంటున్నారు.

# టీడీపికి దూరంగా టాలీవుడ్

ఏలూరు, మే 23, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేశారు. రెండు సార్లు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనూ, రెండు సార్లు విభజిత ఏపీలోనూ ఆయన ముఖ్యమంత్రిగా బాధ్యతలను స్వీకరించారు. చంద్రబాబు రాజకీయాల్లోకి వచ్చి దాదాపు యాభై ఏళ్లు అవుతున్నప్పటికీ ఆయన కు తొలి నుంచిటాలీవుడ్ తో మంచి సంబంధాలున్నాయి. అసలు ఆ మాటకొస్తే తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు టాలీవుడ్ లో అగ్రస్థానంలో కొన్ని దశాబ్దాల పాటు వెలిగి చివరకు పార్టీ ని పెట్టి రాజకీయాల్లోకి వచ్చారు. దీంతో తెలుగుదేశం పార్టీకి, టాలీవుడ్ కు మధ్య సంబంధాలు దాదాపు నాలుగు దశాబ్దాల నుంచి కొనసాగుతూనే ఉన్నాయి. ఎన్టీఆర్ హయాం నుంచి ప్రారంభమైన ఈ సంప్రదాయాన్ని చంద్రబాబు కూడా కొనసాగించారు. చంద్రబాబు నాయుడు ఎప్పుడు ముఖ్యమంత్రి అయినా టాలీవుడ్ కు చెందిన వారిలో ఎవరో ఒకరు రాజ్యసభ లేదా పార్లమెంటు సభ్యులుగానో ఉండేవారు. ఎన్నికల ప్రచారంలోనూ టాలీవుడ్ నుంచి ఆయనకు సహకారం అందేది. చంద్రబాబు అంటే టాలీవుడ్ కు ప్రత్యేక అభిమానం ఉంది. అదే ఆయనను టాలీవుడ్ కు దగ్గర చేసింది. ఎన్నికల ప్రచారంలో దశాబ్దాల క్రితం సినిమాల్లో యాడ్స్ తో పాటు పాటలు వంటివి కూడా టాలీవుడ్ నుంచి వచ్చేవి. దర్శకులు, నిర్మాతలు, నటులు ఇలా 24 ఫ్రేమ్స్ నుంచి ఆయనకు వెన్నంటే ఉండేవారు. అలాగే ఆయన ఎప్పుడు అధికారంలోకి వచ్చినా టాలీవుడ్ నుంచి వచ్చి అందరూ కలిసేవారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కలసి అభినందనలుచెప్పి వెళ్లేవారు.. అంతేకాదు చంద్రబాబు కూడా వివిధ నామినేటెడ్ పోస్టుల్లో టాలీవుడ్ కుచెందిన వారిని నియమించేవారు. 2014 లో అధికారంలోకి వచ్చినప్పుడు కూడా ఎస్వీబీసీ ఛానల్ కు ఛైర్మన్ గా దర్శకేంద్రుడు రాఘవేంద్ర రావును నియమించేవారు. నాడు మురళీ మోహన్ ఎంపీగా ఉండటంతో ఆయన అంతా తానే అయి టాలీవుడ్ ను చంద్రబాబు చెంతకు చేర్చేవారు. అలాగే రాజేంద్ర ప్రసాద్ వంటి నటులు కూడా వచ్చి చంద్రబాబును కలసి తమ సమస్యలను విన్నవించుకునే వారు. అలాంటిది కూటమి ప్రభుత్వం 2024లో అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం టాలీవుడ్ నుంచి చంద్రబాబు వద్దకు వచ్చిన వారు తక్కువేనని చెప్పాలి. హైదరాబాద్ కు వచ్చినప్పుడు కలవడమే తప్ప ప్రత్యేకంగా అమరావతికి వచ్చి కలిసిన వారు ఎవరూ లేరు. దీనికి ప్రధాన కారణం జనసేన అధినేత పవన్ కల్యాణ్. టాలీవుడ్ ను శాసిస్తున్న మెగా కుటుంబానికి చెందిన పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎంగా ఉండటం, సినిమాటోగ్రఫీ మంత్రిగా జనసేన ఎమ్మెల్యే కందుల దుర్గేశ్ కూడా ఉండటంతో చంద్రబాబు ఇక తనంతట తానే టాలీవుడ్ కు దూరమయినట్లు అంటున్నారు. పవన్ కల్యాణ్ అంటేనే టాలీవుడ్ కు చెందిన వారు కలుస్తారు. ఆయనకు సినీరంగంలో ఉన్న పరిచయాలతో ఆ పరిశ్రమలో ఉన్న సమస్యలు కూడా తెలుసు. అందుకే ఆ విషయాల్లో తాను జోక్యం చేసుకోవడం అనవసరమని భావించి చంద్రబాబు టాలీవుడ్ కు దూరంగా ఉంటున్నారని తెలిసింది. ఏ నిర్ణయం తీసుకున్నా పవన్ కల్యాణ్ హర్ట్ అవుతారేమోనని భావించి చంద్రబాబు తెలుగు చలన చిత్ర పరిశ్రమ గురించి పెద్దగా పట్టించుకోవడం లేదు. నిజంగా నలభై ఏళ్ల తర్వాత చంద్రబాబు టాలీవుడ్ కు దూరమయ్యారా? అన్న టాక్ మాత్రం చిత్ర పరిశ్రమలో బలంగా వినిపిస్తుంది.

# కరోనా ఆంక్షలు...

విజయవాడ, మే 23, దేశంలో కోవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. దక్షిణాది రాష్ట్రాల్లో కోవిడ్ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో ఏపీలో కోవిడ్ నియంత్రణ కోసం చేపట్టాల్సిన చర్యలపై మార్గదర్శకాలను వైద్య ఆరోగ్య శాఖ జారీ చేసింది.

కోవిడ్ కేసులు పెద్ద సంఖ్యలో నమోదవుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. దక్షిణాది రాష్ట్రాల్లో కోవిడ్ కేసులు నమోదు అవుతుండటంతో ముందస్తు చర్యలు చేపట్టింది.దేశంలో మళ్లీ కోవిడ్ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో ఆరోగ్య శాఖ ప్రజలకు పలు సూచనలు జారీ చేసింది. ఆరోగ్య శాఖ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ప్రార్థన సమావేశాలు, సామాజిక సమావేశాలు, పార్టీలు, బహిరంగ కార్యక్రమాలు వంటి అన్ని సామూహిక సమావేశాలను తక్షణం నిలిపి వేయాలని పేర్కొన్నారు.

రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్‌లు, విమానాశ్రయాలలో అన్ని ఊూఎఎఆ-19 ప్రవర్తన నియమావళి పాటించాలని స్పష్టం చేశారు.

వృద్ధులు (60 ఏళ్లు పైబడిన వారు) గర్భిణీ స్త్రీలను ఖచ్చితంగా ఇంటి లోపలే ఉండాలని సూచించారు.

మంచి పరిశుభ్రతను పాటించాలని-క్రమం తప్పకుండా చేతులు కడుక్కోవడం, దగ్గు/తుమ్ములు వచ్చినప్పుడు నోటిని కప్పి, పదేపదే ముఖాన్ని తాకడం వంటి పనులు చేయొద్దని సూచించారు.

ప్రమాదకర ప్రాంతాలలో మాస్క్‌లు ధరించాలని, రద్దీ ప్రదేశాలు, తక్కువ గాలి ప్రసరణ ఉన్న ప్రదేశంలో ఉంటే, మాస్క్ ధరించడం ద్వారా వైరస్ వ్యాప్తిని తగ్గించడంలో సహాయ పడుతుందని సూచించారు.

కోవిడ్ సంబంధిత లక్షణాలు ఉంటే వెంటనే పరీక్షించుకోవాలని-ఊూఎఎఆ-19 కేసులను ముందుగానే గుర్తించడంలో నిర్ధారణ పరీక్ష కీలకంగా ఉంటుందన్నారు.

కోవిడ్ ప్రభావిత దేశాలకు ప్రయాణించిన వ్యక్తికి పరీక్షలు చేయించుకోవాలని, సాధారణ లక్షణాలలో లక్షణాలు వ్యక్తిని బట్టి మారుతూ ఉంటాయని తేలికపాటి నుండి మితమైన లక్షణాలలో జ్వరం, చలి, దగ్గు, అలసట, గొంతు నొప్పి, రుచి లేదా వాసన కోల్పోవడం, తలనొప్పి, కండరాలు లేదా శరీర నొప్పులు, ముక్కు కారటం లేదా ముక్కు దిబ్బడ, వికారం, వాంతులు లేదా విరేచనాలు ఉంటాయి.

ఇలాంటి లక్షణాలు గమనించినట్లయితే నిర్ధారణ మరియు చికిత్స కోసం సమీపంలోని ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించాలని సూచించారు.

అనారోగ్యంగా ఉంటే ఇంట్లోనే ఉండాలని ఇతరులను సంప్రదించకుండా ఉండటం ద్వారా ఇతరులను కోవిడ్ బారిన పడకుండా కాపాడొచ్చని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు.

ఆరోగ్య శాఖ ద్వారా వ్యాధి నిర్ధారణ పరీక్షలతో 24/7 ల్యాబ్‌లతో మాస్క్, ఖఖఇ కిట్, ట్రిపుల్ లేయర్ మాస్క్‌లను తగినంత పరిమాణంలో ఉంచుకోవాలని సూచించారు.

# డీఎస్సీలో ఒక్కో పోస్టుకు 25 మంది పోటీ

విజయవాడ, మే 23,డీఎస్సీ పరీక్షా కేంద్రాల ఏర్పాటుపై కసరత్తు జరుగుతోంది. గడువుకంటే ముందే పరీక్షలు పూర్తి చేసేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. రోజుకి 40 నుంచి 50 వేల మందికి రెండు విడతల్లో పరీక్షలు నిర్వహించేలా ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే ఐయాన్ కేంద్రాలు ఎంపిక పూర్తయ్యింది.మెగా డీఎస్సీ-2025 పరీక్షల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మే 15వ తేదీతో ఆన్‌లైన్ అప్లికేషన్ల నమోదు గడువు పూర్తయిన సంగతి తెలిసిందే. ఇప్పటికే మొత్తం ఎంత మంది అభ్యర్థులు పరీక్షలు రాయబోతున్నారన్న డేటా అధికారుల వద్ద ఉంది. దీంతో పరీక్ష కేంద్రాల ఎంపికపై దృష్టి సారించారు. రోజుకి సరాసరి 40 నుంచి 50 వేల మందికి ఉదయం, మధ్యాహ్నం రెండు షిఫ్టుల్లో పరీక్షలు నిర్వహించేలా ప్లాన్ చేస్తున్నారు. ఆ మేరకు కేంద్రాలను ఎంపిక చేస్తున్నారు.అధికారిక సమాచారం మేరకు.. ఇప్పటి వరకు అన్ని రకాల పరీక్ష కేంద్రాలు నిర్వహిస్తున్న టీసీఎస్ అయాన్ వారితో అధికారులు సంప్రదింపులు జరిపారు. జూన్ 6 తేదీ నుంచి జరగనున్న డీఎస్సీ పరీక్షలకు తమ కేంద్రాలను ఇచ్చేందుకు ఈ సంస్థ అంగీకరించింది. ఈ కేంద్రాలతోపాటు.. రాష్ట్రంలోని ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంజినీరింగ్ కళాశాలల్లో కూడా పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే వారితోకూడా సంప్రదింపులు జరిపారని తెలిసింది.డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసిన నాటి నుంచి ఎలాంటి డీవియేషన్స్, షెడ్యూల్ మార్పులు లేకుండా.. అధికారులు ముందుకెళుతున్నారు. వారి స్పీడ్ చూస్తుంటే.. పరీక్షల కోసం ఇచ్చిన 30 రోజుల షెడ్యూల్ కంటే ముందే పూర్తిచేసేలా ఉన్నారు. ఇప్పటికే టీసీఎస్ అయాన్ కేంద్రాలు ఎంపిక చేయగా.. వాటి సామర్థ్యం రోజుకి సరాసరి 20 వేల మందికి రెండు విడతల్లో పరీక్షలు నిర్వహించగలరు. వీటితోపాటు ఇంజినీరింగ్ కళాశాలలు అందుబాటులోకి వస్తే.. మరో 20 నుంచి 30 వేల మందికి ఒకేరోజు పరీక్షలు జరిపే వెసులుబాటు ఉంటుంది. ఈ లెక్కన రోజుకి 40 వేల మంది చొప్పున చూసుకున్నా.. గరిష్టంగా 20 రోజులు కూడా పరీక్షల నిర్వహణకు ఎక్కువే అని అధికారులు చెబుతున్నారు.ఎస్సీ వర్గీకరణ ఈ డీఎస్సీ నోటిఫికేషన్ నుంచే అమలు చేస్తున్నారు. ఆ మేరకు పోస్టులను ప్రకటించగా.. ఎంత మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు అన్నది కూడా అధికారులు తెలియజేశారు. ఎస్సీ జీఆర్ 1, జీఆర్ 2, జీఆర్ 3 కింద మూడు కేటగిరీల్లో వరుసగా.. 1,848, 45,419, 61,905 మంది అభ్యర్థులు దరఖాస్తులు చేశారు. మొత్తం 16,347 ఉద్యోగాలకు 3,35,401 మంది అభ్యర్థులు వివిధ పోస్టులకు కలిపి 5,77,417 దరఖాస్తులను నమోదు చేశారు.ఒక్కో పోస్టుకు సరాసరి 35 మంది పోటీ పడనున్నారు. ఆన్‌లైన్ అప్లికేషన్ల నమోదులో మహిళలు ముందంజలో ఉన్నారు. దాదాపు 2,03,647 మంది మహిళా అభ్యర్థులు, 1,31,754 మంది పురుషుల నుంచి దరఖాస్తులు వచ్చినట్లు ఎస్సీఆర్టీ డైరెక్టర్, డీఎస్సీ కన్వీనర్ కృష్ణారెడ్డి వెల్లడించారు. ఈ నెల 30వ తేదీ నాటికి హాల్‌టికెట్లు విడుదల చేస్తామని ఆయన చెప్పారు.డీఎస్సీ పోస్టులు అధికంగా ఉన్న కర్నూలు జిల్లాలకు సంబంధించి అభ్యర్థుల నుంచి భారీగా దరఖాస్తులు నమోదయ్యాయి. మొత్తం 2678 పోస్టులు ఉండగా.. 39,997 మంది అభ్యర్థుల నుంచి మొత్తం 73,605 అప్లికేషన్లు వచ్చాయి. నెల్లూరు జిల్లాలో మొత్తం పోస్టులు 673 ఉండగా... 15,993 మంది అభ్యర్థుల నుంచి 28,772 అప్లికేషన్లు వచ్చాయి. ఇక్కడే అత్యల్పంగా దరఖాస్తులు వచ్చాయి. ఇతర రాష్ట్రాల నుంచి 7,159 మంది అభ్యర్థుల నుంచి 10,143 అప్లికేషన్లు వచ్చాయి.

# అటెన్షన్ లో కేంద్రమంత్రులు

న్యూఢిల్లీ, మే 23, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఢిల్లీకి వస్తున్నారంటే కేంద్ర మంత్రుల్లో గుండె దడ మొదలవుతుంది. ఆయన ఫైళ్లు పట్టుకుని మరీ వచ్చి రాష్ట్రానికి సంబంధించిన నిధులు, ప్రాజెక్టుల కోసం వస్తారు. అందుకే చంద్రబాబు ఢిల్లీ టూర్ అంటే కేంద్ర మంత్రులు ఆయన ఏ ప్రతిపాదనలు తీసుకు వస్తారోనన్న ఉత్కంఠ వారిలో నెలకొంటుందట. ఏ ముఖ్యమంత్రి కూడా ఢిల్లీకి ఇన్నిసార్లు వచ్చి తమ రాష్ట్రానికి సంబంధించిన ప్రాజెక్టులు, నిధుల కోసం ప్రయత్నించడం లేదని, కానీ చంద్రబాబు మాత్రం నెలలో రెండు సార్లు ఢిల్లీకి వచ్చి తమను కలసి వినతులను సమర్పించి తమ పనులను సాధించుకు వెళుతున్నారని కేంద్ర మంత్రులే అనుకుంటున్నారట. చంద్రబాబు నాయుడు నేడు ఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నారు. మూడు రోజుల పాటు ఢిల్లీలోనే చంద్రబాబు ఉండనున్నారు. నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీకి బయలుదేరి వెళతారు. రేపు కేంద్ర మంత్రులను చంద్రబాబు కలవనున్నారు.కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తో పాటు ఏడుగురు కేంద్ర మంత్రులతో శుక్రవారం భేటీ కానున్నారు. రాష్ట్రానికి రావాల్సిన ప్రాజెక్టులు, నిధులపై చర్చించనున్నారు. దీంతో చంద్రబాబు వస్తున్నారని, అపాయింట్ మెంట్ కావాలని అడిగిన వెంటనే వారు పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టు వివరాలను తెప్పించుకునే పనిలో ఉన్నారట.ముఖ్యంగా ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ల మద్దతు పైనే ఆధారపడి ఉంది. వీరిద్దరూ మోదీ కంటే ముందు నుంచి రాజకీయాల్లో ఉన్నవారు. రాజకీయ అనుభవం ఉన్న నేతలు మాత్రమే కాకుండా తమకు అవసరమైన వాటిని పట్టుబట్టి సాధించుకోవడంలో దిట్టలని పేరుపొందారు. ఇద్దరి నేతల అవసరాలు కూడా కేంద్రానికి ఉండటంతో అడిగిన వెంటనే అపాయింట్ మెంట్లు కూడా ఇచ్చేస్తున్నారు. అందులోనూ ఏపీ పరిస్థితి వేరు. అనేక హామీలు ఇచ్చి 2024 లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. రాష్ట్రంలో, కేంద్ర ప్రభుత్వంలో రెండు పార్టీలు కలసి ఉన్నాయి..అయినా ప్రజా సమస్యల పరిష్కారం ఇలా చేయొచ్చుగా సామరస్యంగానే చెప్పి... ఈ నేపథ్యంలో చంద్రబాబు తీసుకు వచ్చే ప్రతిపాదనలతో పాటు నిధుల విషయంలో కూడా చూసీచూడనట్లు వ్యవహరించాల్సి ఉంటుంది. చంద్రబాబు కూడా ఒక పట్టాన వదిలి పెట్టే రకం కాదు. ఆయన గత పర్యటనలో తనకు ఇచ్చిన హామీలను ఇంకా పెండింగ్ లో ఉండటాన్ని కూడా ప్రస్తావించి కేంద్ర మంత్రులను ఇరకాటంలో పడేస్తారు. అంతే కాదు సామరస్యంగా, సానుకూలంగా మాట్లాడుతూనే రాష్ట్ర ప్రయోజనాలకు అవసరమైన ప్రాజెక్టులను, నిధులను తీసుకెళ్లడంలో చంద్రబాబు నేర్పరి అని హస్తినలో టాక్. అందుకే చంద్రబాబు హస్తిన ప్రయాణం అంటే టీడీపీ పార్లమెంటు సభ్యుల హడావిడి అటుంచితే.. కేంద్ర మంత్రులు మాత్రం హై అటెన్షన్ లో ఉండాల్సిందేనట.

## సంగారెడ్డి జిల్లాలో బీభత్సం సృష్టించిన వర్షం

సంగారెడ్డి జిల్లాలో భారీ వర్షం బీభత్సం సృష్టించింది. గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి నిజాంపేట- బీదర్ హైవేపై వరద నీరు భారీగా నిలిచి పోయింది. వరద నీటిని గమనించకుండా వెళ్ళిన ఒక కారు నీటిలో చిక్కుకుంది. వరద నీరు తక్కువగా ఉండటంతో ప్రమాదం తప్పింది. స్థానికులు కారును నీటిలో నుంచి బయటకు తీసారు.

## వర్షపు నీటిలో వరి ధాన్యం రైతులు ఆగమాగం

జయశంకర్ భూపాలపల్లి గణపురం,భూపాలపల్లి మండలాలకు చెందిన మొరంచపల్లి,లక్ష్మారెడ్డి పల్లె గ్రామాల్లో రాత్రి కురిసిన అకాల వర్షానికి ఐకేపీ కేంద్రంలో ధాన్యం తడిసిన ముద్దైంది. కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోలులో జాప్యం జరగడంతో రైతులు కొన్ని రోజులుగా ధాన్యం కొనుగోలులేక పడిగాపులు పడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేసారు.తడిసిన ధాన్యాన్ని వెంటనే ప్రభుత్వం తరుగు లేకుండా వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని వారు వేడుకుంటున్నారు.

# నోరు తెరుస్తున్న సీనియర్లు...

కాకినాడ, మే 23, తెలుగుదేశం పార్టీలో అక్కడక్కడ అసంతృప్తులు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా మంత్రి పదవులు ఆశించి భంగపడ్డ సీనియర్ ఎమ్మెల్యేలు నోరు తెరుస్తున్నారు. తమ మనసులో ఉన్న మాటను బయట పెడుతున్నారు. ఈనెల 27 నుంచి మూడు రోజుల పాటు తెలుగుదేశం పార్టీ మహానాడు కడపలో నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అయితే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో మినీ మహానాడులు నిర్వహించాలని పార్టీ హైకమాండ్ ఆదేశించింది. ఈ తరుణంలో తూర్పుగోదావరి జిల్లా టిడిపి మినీ మహానాడులో ఆ పార్టీ నేతలు సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా జనసేనతో వస్తున్న సమస్యలను ప్రస్తావించారు. ప్రధానంగా పార్టీ ముఖ్య నేత జ్యోతుల నెహ్రూ చేసిన కామెంట్స్ ఇప్పుడు సంచలనంగా మారాయి. జనసేనకు అగ్ర తాంబూలం.. తూర్పుగోదావరి జనసేనకు పట్టున్న జిల్లా. ఆపై పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. డిప్యూటీ సీఎం గా సైతం ఉన్నారు. అందుకే అక్కడ జనసేనకు ఎనలేని ప్రాధాన్యం దక్కుతోంది. నామినేటెడ్ పదవుల్లో సైతం పెద్దపీట వేస్తున్నారు. జనసేనతో పోల్చుకుంటే టిడిపికి అక్కడ అవకాశాలు తగ్గాయి. దీనిని అక్కడ టిడిపి శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి. ముఖ్యంగా ద్వితీయ శ్రేణి నాయకత్వం తీవ్ర అసంతృప్తితో ఉంది. వారు నేరుగా ఎమ్మెల్యేల వద్ద తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

ఈ క్రమంలో ఎమ్మెల్యేలు సైతం కలవరపాటుకు గురవుతున్నారు. ఈ క్రమంలో తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించిన మహానాడు కాకినాడలో జరిగింది.

జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అయితే తన మనసులో ఉన్న ఆవేదనను బయటపెట్టారు. కాకినాడ జిల్లాలో పదవులు ఏ పార్టీకి వెళ్లాయో ఆలోచించాలని సూచించారు. మెజారిటీ ఉన్న తెలుగుదేశం పార్టీ పరిస్థితి ఏంటో ఆలోచించాలని వ్యాఖ్యానించారు. ఇటీవల జనసేనకు చెందిన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబుకు రెండు పదవులు ఇచ్చారు. పేరు పెట్టకుండా దానిని ప్రస్తావిస్తూ ఒక వ్యక్తికి రెండు పదవులు అవసరమా అని ప్రశ్నించారు. పార్టీ నిర్ణయాల వల్ల టిడిపి నిర్వీర్యం అయిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ఎన్నాళ్ళు ఉంటుంది.. పార్టీ ఆవిర్భావం తర్వాత ఎన్ని పార్టీలతో పొత్తు పెట్టుకోలేదని చెప్పుకొచ్చారు.

ఎన్నిసార్లు బయటకు రాలేదు అంటూ వ్యాఖ్యానించారు. టిడిపి తో పొత్తు వల్ల కమ్యూనిస్టు పార్టీలు నిర్వీర్యం అయిపోయాయని సంచలన వ్యాఖ్యలు చేశారు. అదే పరిస్థితి టిడిపికి రాకుండా చూడాలని జ్యోతుల నెహ్రూ వ్యాఖ్యానించారు. అయితే గత కొద్దిరోజులుగా జ్యోతుల నెహ్రూ పార్టీ పై అసంతృప్తి వ్యక్తం చేస్తూనే ఉన్నారు.

అందులో భాగంగానే ఈ కామెంట్స్ చేసి ఉంటారన్న అనుమానాలు ఉన్నాయి. ఇంకోవైపు కాకినాడ టిడిపి అధ్యక్షుడు జ్యోతుల నవీన్ చేసిన కామెంట్ సైతం సంచలనంగా మారాయి. కాకినాడ రూరల్ నియోజకవర్గానికి టిడిపి ఇన్చార్జ్ ప్రకటించక పోవడాన్ని తప్పుపట్టారు. ఆ నియోజకవర్గంలో జనసేనకు భారీ మెజారిటీ లభించడం వెనుక టిడిపి కార్యకర్తలు ఉన్నారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. కార్యకర్తలను కాపాడుకో లేకపోతే ఇబ్బందికర పరిస్థితులు వస్తాయని కూడా వ్యాఖ్యానించారు.

అయితే జనసేన విషయంలో సలహాలు ఇస్తూనే టిడిపి నేతలు సంచలన వ్యాఖ్యలు చేస్తుండడం కూటమిలో విభేదాలకు కారణమవుతోంది.

# భూమా...గీతా దాటేస్తోందా...

కర్నూలు, మే 23 ఏపీలో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది అవుతోంది. సీఎం చంద్రబాబు ఎప్పటికప్పుడు ఎమ్మెల్యేలకు దిశా నిర్దేశం చేస్తున్నారు. క్రమశిక్షణతో ఉండాలని సూచిస్తున్నారు.వివాదాస్పద నియోజకవర్గాలపై టిడిపి నాయకత్వం దృష్టిపెట్టిందా? అక్కడ ఎమ్మెల్యేలతో నష్టం జరుగుతోందని గుర్తించిందా? అందుకే దిద్దుబాటు చర్యలకు దిగనుందా? వారి స్థానంలో ఇంచార్జ్ లకు బాధ్యతలు అప్పగించనుందా? అంటే అవును అనే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా పార్టీకి తీవ్ర నష్టం జరుగుతున్న నియోజకవర్గాలపై టీడీపీ హై కమాండ్ దృష్టి పెట్టినట్లు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా 11 అసెంబ్లీ నియోజకవర్గాలలో కొత్త ఇన్చార్జిలను నియమించడానికి కూడా ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఇందులో ఎక్కువగా రిజర్వుడ్ నియోజకవర్గాలు ఉండడం విశేషం.ఏపీలో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది అవుతోంది. సీఎం చంద్రబాబు ఎప్పటికప్పుడు ఎమ్మెల్యేలకు దిశా నిర్దేశం చేస్తున్నారు. క్రమశిక్షణతో ఉండాలని సూచిస్తున్నారు. అయినా సరే కొందరు ఎమ్మెల్యేల తీరులో మార్పు రావడం లేదు. ఈ క్రమంలోనే కఠిన చర్యలకు దిగుతున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా తిరువూరు, రైల్వే కోడూరు, రాజంపేట, సింగనమల, ఆళ్లగడ్డ నియోజకవర్గాలు ఈ జాబితాలో ఉన్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఈ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు తరచు వివాదాల్లో చిక్కుకోవడం పార్టీకి మైనస్ గా మారింది. అందుకే చాలాసార్లు హెచ్చరించినా.. ఫలితం లేకపోవడంతో వారి స్థానంలో ఇన్చార్జిలను తెస్తారని తెలుస్తోంది. అదే జరిగితే విభేదాలు మరింత ముదరడం ఖాయం.నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలోఎమ్మెల్యే అఖిల ప్రియ పరిస్థితి మరింత వివాదంగా మారుతోంది. ఇక్కడ సొంత పార్టీ శ్రేణులే ఆమె తీరును వ్యతిరేకిస్తున్నారు. అందుకే సీఎం చంద్రబాబు తో పాటు మంత్రి లోకేష్ ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఇక్కడ టిడిపి సమన్వయకర్తగా చింతకుంట శ్రీనివాసరెడ్డి నియమించడానికి నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. శ్రీనివాస్ రెడ్డికి రాజకీయ నేపథ్యం ఉంది. ఈయన తాత సిపి తిమ్మారెడ్డి గతంలో ఎమ్మెల్యేగా పనిచేశారు. ఎమ్మెల్యే అఖిలప్రియ కు సమీప బంధువు కూడా. అఖిల ప్రియ తీరు రోజురోజుకు వివాదంగా మారడంతో.. ప్రత్యామ్నాయ నాయకత్వాన్ని చూసుకోవాలని టిడిపి హై కమాండ్ ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. అందులో భాగంగా శ్రీనివాస్ రెడ్డిని ఇన్చార్జిగా నియమిస్తారని సమాచారం. శ్రీనివాసరెడ్డిరియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటారు. హైదరాబాద్ తో పాటు రాజమండ్రిలో రియల్ ఎస్టేట్ వ్యాపారంలో కొనసాగుతున్నారు. ఇటీవల కాలంలో చికెన్ సెంటర్ ల నుంచి కూడా అఖిలప్రియ అనుచరులు కమీషన్లు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు టిడిపి ప్రతిష్టను మరింత ఇబ్బందుల్లో పెట్టాయి. స్థానిక పార్టీ శ్రేణులు సైతం అఖిలప్రియ తీరుపై హై కమాండ్కు ఎప్పటికప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారు. ఈ క్రమంలో టిడిపి పెద్దలు అక్కడ నాయకత్వం మార్పుతోనే వ్యతిరేకత తగ్గించుకోవాలని ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. అందుకే శ్రీనివాస్ రెడ్డికి ఆళ్లగడ్డ నియోజకవర్గం అప్పగిస్తే ఎలా ఉంటుందన్న ఆలోచన చేస్తున్నట్లు సమాచారం.

# నందిగం భార్య ఆడియో వైరల్

గుంటూరు, మే 23, ఆలూ లేదు చూలు లేదు కొడుకు పేరు సోమలింగం అన్నట్లు ఉంది ఏపీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతల పరిస్థితి. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది అవుతోంది. ఇంకా కూటమికి నాలుగేళ్ల పదవీకాలం ఉంది. అయితే 2029 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేది తామేనంటూ వైయస్సార్ కాంగ్రెస్ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. మరికొందరైతే పలానా పదవి తమదేనంటూ చెప్పుకొస్తున్నారు. మరోవైపు నేతల భార్యలు సైతం పెద్ద పెద్ద పదవులు తమ వేనంటూ బాహాటంగా చెబుతున్నారు. అసలు రాజకీయాలతో సంబంధం లేని వారు సైతం ఇటువంటి వ్యాఖ్యలు చేస్తుండడం విశేషం. అయితే తాజాగా మాజీ ఎంపీ నందిగాం సురేష్ భార్య బేబీ లత అయితే.. తనను హోం మంత్రి అంటూ అంతా పిలుస్తున్నారని చెప్పుకొస్తున్నారు. ఆమెకు సంబంధించి ఓ ఆడియో సంభాషణ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తీవ్ర చర్చకు దారితీస్తోంది.బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్ ఇటీవల అరెస్ట్ అయిన సంగతి తెలిసిందే. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయనను ఓ హత్య కేసులో అరెస్టు చేశారు. సుమారు మూడు నెలల పాటు ఆయన గుంటూరు జైల్లోనే గడిపారు. మొన్న ఆ మధ్యన బెయిల్ పై విడుదలయ్యారు. అయితే ఇటీవల మరో కేసులో అరెస్టయ్యారు. అయితే సురేష్ ఎంపీగా ఉండగా ఆయన భార్య బేబీ లత ఎన్నడూ బయటకు రాలేదు. ఆయన అరెస్ట్ అయిన తర్వాత తరచూ జైలుకు రావడం, బెయిల్ ప్రయత్నాలు చేయడం వంటివి చేస్తూ వస్తున్నారు. అయితే ఆమె ఓ మహిళ న్యాయవాదితో చేసిన సంభాషణ ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వచ్చే ఎన్నికల్లో తప్పకుండా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని.. మీరు హోం మంత్రి అవుతారని ఆ న్యాయవాది చెప్పిన ఆడియో రాజాగా వైరల్ అవుతోంది. అయితే మీరు ఒక్కరే కాదు చాలామంది అలానే అంటున్నారని.. అలా అనడం చాలా ఆనందంగా ఉందని బేబీ లత బదులు ఇవ్వడం విశేషం.మాజీ ఎంపీ సురేష్ తరపున ఆయన కేసులను వాదిస్తున్న ఓ మహిళా న్యాయవాది ఇటీవల ఆయన భార్య బేబీ లతకు ఫోన్ చేశారట. ఈ సందర్భంగా వారి మాటల మధ్యలో ఈసారి సురేష్ బదులుగా బేబీ లతకు ఎమ్మెల్యే టికెట్ ఇస్తారని.. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత రాష్ట్ర హోం మంత్రి అవుతారంటూ ఆ న్యాయవాది చెప్పినట్లు ఆ ఆడియో లో ఉంది. అదే సమయంలో తాను సురేష్ తో ములాకత్ అయ్యేందుకు జైలుకు వెళ్ళగా.. అక్కడ గతంలో తనతో దురుసుగా వ్యవహరించిన ఓ సి ఐ కూడా ఇదే మాదిరిగా అన్నారని బేబీ లతా చెప్పుకొచ్చారు. మీరు కాబోయే హోం మంత్రి.. మమ్మల్ని గుర్తుపెట్టుకోండి అంటూ ఆ సీఐ తనతో చెప్పినట్లు బేబీ లత ఆడియోలో పేర్కొన్నారు. అయితే ఎన్నికలకు ఇంకా నాలుగేళ్ల వ్యవధి ఉంది. అప్పుడే పదవుల కోసం కలలు కంటున్నారంటూ సోషల్ మీడియాలో సెటైర్లు పడుతున్నాయి. అయితే ఈ ఆడియో పై బేబీ లత కానీ.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కానీ ఇంతవరకు స్పందించలేదు.

## పార్టీ కార్యకర్తలకు అండగా వుంటాం

కాకినాడ కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని.. మున్సిపల్ శాఖ, కాకినాడ జిల్లా ఇన్చార్జి మంత్రి పి. నారాయణ భరోసా ఇచ్చారు. కాకినాడలోని గోదావరి కళా క్షేత్రంలో తెలుగుదేశం పార్టీ కాకినాడ జిల్లా మహానాడు నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ అధ్యక్షతన జరిగిన సభకు మంత్రి నారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైకాపా పాలనలో కార్యకర్తలు కేసులు, అరెస్టులను ఎదుర్కొని పార్టీకి అండగా నిలబడ్డారన్నారు. మాజీ సీఎం జగన్ 10 లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచారన్నారు దేశంలో అందరికంటే ఎక్కువగా పింఛన్లు ఇస్తున్నామని, వచ్చేనెల నుంచి తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలు ప్రారంభిస్తున్నామని తెలిపారు.. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు సానా సతీష్, ఎమ్మెల్యేలు చినరాజప్ప, కొండబాబు,జ్యోతుల నెహ్రూ, సత్య ప్రభ, జిల్లాలోని ముఖ్యమైన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు...

## తిరుమలలో నమాజ్ చేయించింది వైకాపా నేతలే

తిరుమలలో నమాజ్ కలకలంపై టీటీడీ పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్ స్పందించారు. తిరుమలలో నమాజ్ చేయించింది వైసీపీ నాయకులు. ఉద్దేశపూర్వకంగా ఇలాంటి ఘటనలకు పాల్పడటం హేయమైన చర్య అని విమర్శించారు. ఈ ఘటనపై క్రిమినల్ కేసులు నమోదు చేయబోతున్నాం. స్వామి వారికి రక్షణ లేదు అనే విధంగా భక్తులలో అభద్రతా భావాన్ని వ్యక్తపరిచేల వైసీపీ కుటిల రాజకీయం చేస్తోంది. రాజకీయంగా ఎదుర్కోవాలి? స్వామి వారిని అడ్డుపెట్టుకొని ఇలాంటి రాజకీయం చేయడం హేయమైన చర్య . భక్తులను అయోమయంలోకి తీసుకెళ్లే విధంగా వైసీపీ కుట్రలు చేస్తోందని అన్నారు.

# అలా మారిపోతున్నారేంట్రా...

విశాఖపట్టణం, మే 23, ఏపీలో వైసీపీకి వరుసగా అన్నీ ఎదురు దెబ్బలే తగులుతున్నాయి. సార్వత్రిక ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత ఫ్యాన్ పార్టీకి అన్నీ కష్టాలే ఎదురవుతున్నాయన్న టాక్ విన్పిస్తోంది. ఎన్నికల్లో ఓటమి తర్వాత వైసీపీకి ఇప్పటికే చాలా మంది సీనియర్లు గుడ్ బై చెప్పారు. మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు..ఇలా వరుసపెట్టి నేతలు కూటమి పార్టీల్లోకి క్యూ కట్టారు. మరికొంతమంది కూడా పార్టీకి గుడ్ బై చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారట.ఇలా పార్టీ నుంచి నేతలంతా జారుకుంటుంటే అటు కార్పొరేషన్లు, మున్సిపాలిటీలను సైతం కూటమి దక్కించుకుంటుంది. ఇప్పటికే మెజార్టీ కార్పొరేషన్లను దక్కించుకున్న కూటమి?తాజాగా మున్సిపాలిటీలను కూడా తన ఖాతాలో వేసుకుంటూ వైసీపీకి వరుస షాకులిస్తోంది. దీంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ఆపార్టీకి అన్నీ ఎదురుదెబ్బలే తగుతున్నాయి. మున్సిపాలిటీలు చేజారకుండా వైసీపీ ఎన్ని ప్రయత్నాలు చేసినా..సైకిల్ దెబ్బకు ఆపార్టీ మున్సిపాలిటీలన్నీ కూటమి వశం అవుతున్నాయి.ఇప్పటికే మెజార్టీ మున్సిపాలిటీలను తన ఖాతాలో వేసుకున్న కూటమి..తాజాగా కదిరి మున్సిపాలిటీని కూడా టీడీపీ కైవసం చేసుకుంది. ఛైర్‌పర్సన్‌గా దిల్షా దున్నీషా ఎన్నికకాగా..వైస్ చైర్మన్లుగా సుధారాణి, రాజశేఖర్ ఆచారి సైతం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అయితే ఈ ఎన్నికను వైసీపీ బహిష్కరించింది. కదిరి మున్సిపాలిటీలో మొత్తం 36 మంది కౌన్సిలర్లు ఉండగా..వైసీపీకి చెందిన 11 మంది కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. దీంతో 25 మంది మద్దతులో దిల్ షాదున్నీసా చైర్ పర్సన్ గా ఎన్నికయ్యారు. గాండ్లపేట ఎంపీపీగా గజ్జెల సోముశేఖర్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మొత్తం ఏడుగురు ఎంపీటీసీల్లో నలుగురు టీడీపీ సభ్యులు హాజరుకాగా?ముగ్గురు వైసీపీ సభ్యులు రాలేదు.ఇదిలా ఉంటే మరోవైపు విజయనగరం జిల్లా బొబ్బిలి మున్సిపల్ ఛైర్మన్‌గా టీడీపీకి చెందిన శరత్‌బాబు ఎన్నికయ్యారు. గత నెల 29న ఛైర్మన్ మురళీకృష్ణారావుపై అవిశ్వాసం ప్రవేశపెట్టగా..అవిశ్వాస ఓటింగ్‌లో టీడీపీ గెలిచింది. దీంతో మురళీకృష్ణారావు ఛైర్మన్ పదవి కోల్పోయారు. మొత్తం 20 మంది సభ్యుల మద్దతుతో బొబ్బిలి మున్సిపాలిటీ కూటమి ఖాతాలోకి చేరింది.ఇక తిరువూరు నగర పంచాయతీ ఛైర్మన్ ఎన్నిక వాయిదాపడింది..కోరం లేకపోవడంతో వచ్చే మంగళవారానికి ఎన్నికను వాయిదా వేశారు. మొత్తం 20 మందికి గాను ఏడుగురు మాత్రమే హాజరుకావడంతో వాయిదా వేస్తూ ఎన్నికల అధికారి నిర్ణయం తీసుకున్నారు. అలాగే శ్రీసత్యసాయిజిల్లా రామగిరి ఎంపీపీ ఎన్నిక మూడోసారి వాయిదా పడింది. వైసీపీ ఎంపీటీసీ సభ్యులు సమావేశానికి గైర్హాజరుకావడంతో ఎన్నిక వాయిదా పడింది. గతంలో కోరంలేక ఎంపీపీ ఎన్నిక రెండుసార్లు వాయిదా పడింది.ఏపీలో గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఆపార్టీ మున్సిపల్ పీఠాలను దాదాపుగా దక్కించుకుంది. అయితే వీటిని ఫ్యాన్ పార్టీ నుంచి లాగేసుకునేందుకు కూటమి విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. తొలుత ఈ ప్రయత్నాలన్నీ విఫలమైనా?ప్రస్తుతం వైసీపీ మున్సిపాలిటీలన్నీ కూటమి ఖాతాలో వచ్చి పడుతున్నాయి. ఆయా కార్పొరేషన్లలో సైతం విపక్ష పార్టీ పని అయిపోయిందన్న టాక్ ఏపీ రాజకీయవర్గాల్లో విన్పిస్తోంది.ఫ్యాన్ పార్టీ పాగా వేసిన కీలక స్థానాలన్నింటిని కూటమి కూకటివేళ్లతో సహా పెకిలిస్తోంది. వైసీపీ కంచుకోటలను ఆ మూడు పార్టీలు బద్దలు కొడుతుండడంతో ఏపీలో ఇప్పటికే మెజార్టీ మేయర్ పీఠాలన్నీ కూటమి ఖాతాలోకి వెళ్లాయి. రాష్ట్రంలో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు తమకు ఎలాంటి అధికారాలు లేకుండా చేశారని ఆ పార్టీ కార్పొరేటర్లు అంటున్నారట. ఆయా మున్సిపాలిటీల్లో ఛైర్మన్లు, కార్పొరేషన్లలో మేయర్లు వైసీపీకి అనుకూలంగా పనిచేశారే తప్ప ప్రజాప్రతినిధులుగా పనిచేయలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.వైసీపీ అధికారం కోల్పోవడంతో వైసీపీ మేయర్లంతా ఉత్సవ విగ్రహాల్లా మిగిలిపోయారట. అప్పటికే అసంతృప్తితో ఉన్న కార్పొరేటర్లను కూటమి పార్టీలు ఆహ్వానించాయి. దీంతో ఎవరి అవసరం కోసం వారు ఆయా పార్టీల్లో చేరిపోయారు. మెజార్టీ పెరిగిన కూటమి పార్టీలు ఆయా కార్పొరేషన్లలో మేయర్లపై అవిశ్వాసం పెట్టించారు.వైసీపీ ఓడిపోవడంతో ప్రధాన మున్సిపల్ కార్పొరేషన్లన్నీ కూటమి పార్టీల చేతుల్లోకి వెళ్లిపోయాయి. మొత్తానికి సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ చిత్తుగా ఓడిపోవడంతో ఏ జిల్లాలోనూ కనీస మెజార్టీ లేకపోవడంతో కూటమికి అన్ని విధాలుగా పైచేయి లభించినట్లు అయిందన్న టాక్ విన్పిస్తోంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతే రహదారులు, మంచినీటి సమస్య, డ్రైనేజి ఇతర మౌలిక సదుపాయాలు వంటి సమస్యలన్నింటినీ పరిష్కరించే ప్రయత్నం చేయడంతో ప్రజల్లో సానుకూలత పెరిగిందని టాక్.

# వివాదంగా మారిన ఎంపిల పేర్ల ప్రకటన

పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారతదేశం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ కు ప్రపంచ దేశాల నుంచి గట్టి మద్దతు లభించింది. చైనా, టర్కీ వంటి కొన్ని దేశాలు పాకిస్థాన్ కు మద్దతు పలికినా, మెజారిటీ దేశాలు మన దేశానికి సంపూర్ణ మద్దతునిచ్చాయి. మద్దతు ఇవ్వడమే కాదు పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్ లోని ఉగ్ర స్థావరాలపై జరిపిన దాడులను సమర్థించాయి. ఈ నేపథ్యంలో ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్నపాకిస్థాన్ ఉగ్ర రూపాన్ని ప్రపంచం ముందు ఉంచేందుకు.. తద్వారా అంతర్జాతీయంగా పాకిస్థాన్ ను ఏకాకిని చేపేందుకు,ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం దౌత్య వ్యూహాన్ని సిద్దం చేసింది. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదుల అమానుష ఉగ్ర దాడుల చరిత్రను, ఉగ్ర కుట్రల్ని ప్రపంచ దేశాలకు విశదీకరించేందుకు.. మరీ ముఖ్యంగా 26 మంది అమాయక పర్యాటకులను, అత్యంత కిరాతకంగా హతమార్చిన సంఘటన నేపథ్యంగా మన దేశం చేపటిన ఆపరేషన్ సిందూర్ పూర్వపరాలను వివరించేందుకు పార్లమెంట్ సభ్యుల ప్రతినిధి బృందాలను వివిధ దేశాలకు పంపాలని మోదీ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందు కోసం ఏడు అఖిలపక్ష బృందాలను ఏర్పాటు చేసింది.ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ, భారత్‌లో ఉగ్రమూకల చర్యలకు ఊతంగా వున్న పాకిస్థాన్ ధోరణిని ప్రపంచ దేశాలకు వివరించాలని మోదీ ప్రభుత్వం తలపెట్టింది. అఖలపక్ష ఎంపీలతో ఏర్పాటు చేసిన ఏంపీల బృందాలు వివిధ దేశాల్లో పర్యటించనున్నాయి. బుధవారం ఇం దులో రెండు బృందాల పర్యటన మొదలైంది. పహల్గాంలో ఉగ్రవాదులు ఆమాయకులైన టూరిస్టులు 26 మందిని పొట్టనపెట్టుకోవడం, దానికి ప్రతిగా 'ఆపరేషన్ సిందూర్'తో భారత సైన్యం పాకిస్థాన్‌లో ఎంపిక చేసుకున్న ఉగ్రవాదుల శిబిరాలను ధ్వంసం చేయడం జరిగింది. పాకిస్థాన్‌తో గతంలో జరిగిన సింధూ జలాల ఒప్పందం రద్దు మొదలు వాణిజ్యం, ఇతర అంశాలపై భారత్ అన్ని విధాలుగా ఆ దేశంతో సంబంధాలను తెగదెంపులు చేసుకున్నది. 'ఆపరేషన్ సిందూర్' మింగుడు పడని పాకిస్థాన్ ఏకంగా భారత సరిహద్దుల రాష్ట్రాల్లోని మిలిటరీ స్థావరాలను, నివాస ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని క్షిపణులు, డ్రోన్లతో దాడులకు తెగబడింది.తమ దగ్గరున్న అణ్వాయుధాలతోనూ భారత్‌పై దాడి చేస్తామని కూడా పాకిస్థాన్‌లోని కొందరు రాజకీయ నాయకులు ప్రగల్భాలు పలికారు. ఉగ్రవాదులకు తావుగా వున్న పాకిస్థాన్, కశ్మీర్ సమస్యను బూచిగా చూపి ఉగ్రసంస్థలను భారత్ భూభాగంలోకి ప్రయోగించడం కొత్తేమి కాదు. కాని దృఢ సంకల్పంతో భారత్, పాకిస్థాన్‌కు ఈసారి బుద్ధిచెప్పిన తీరు ను ప్రపంచ దేశాలు మౌనంగానే ఆమోదించాయని చెప్పవచ్చు. రెండు దే శాల మధ్య ఉద్రిక్తతలు పెరిగి, అది యుద్ధంగా పరిణమించకూడదనే పలు దేశాలు హితవు పలికాయి. ప్రపంచ దేశాలకు ఉగ్రదాడులపై భారత్ వైఖరి ఎలా వుండబోతున్నది, పాక్ ప్రదర్శిస్తున్న వైఖరి ఏమిటనేది వివరించాలని మోదీ ప్రభుత్వం సంకల్పించింది. ఉగ్రతండాలను భారత్‌లో దాడులకు ఉసిగొల్పడం, భారత్ ప్రతిగా దాడులు చేస్తే అ ణ్వాయుధాలను బూచి చూపడం ఇకపై చెల్లదనేది భారత్ స్పష్టం చేస్తున్నది. అణ్వాయుధాలను చూపి బ్లాక్‌మెయిల్ చేసే ధోరణి విడనాడకపోతే పాకిస్థాన్ సైన్యం భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందనేది భారత్ ఈ సందర్భంలో ప్రపంచ దేశాలకు స్పష్టం చేయనున్నది.ఇందుకు సంబధించి కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ప్రధన పార్టీలకు లేఖలు రాశారు. ప్రపంచ దేశాలకు భారత వాణిని బలంగా వినిపించే ఎంపీల పేర్లను పంపాలని కోరారు. అందుకు సమాధానంగా కాంగ్రెస్ పార్టీ, నలుగురు ఎంపీల పేర్లను పంపింది. అయితే.. ఆ పేర్లలో ఐక్య రాజ్య సమితి కీలక బాధ్యతలు నిర్వహించిన అనుభవంతో పాటుగా,విదేశీ వ్యవహార స్థాయి సంఘం చైర్మన్ గా ఉన్న సీనియర్ ఎంపీ శశిథరూర్ పేరు లేదు. మాజీ మంత్రి ఆనంద్ శర్మ, లోక్ సభలో కాంగ్రెస్ పార్టీ ఉప నాయకుడు గౌరవ్ గొగోయ్, మరో ఇదరు ఎంపీలు సయ్యద్ నసీర్ హుస్సేన్, రాజా బ్రార్ పేర్లను కాంగ్రెస్ పార్టీ పంపింది. అయితే, ప్రభుత్వం విడుదలచేసిన జాబితాలో కాంగ్రెస్ నుంచి శశిథరూర్ పేరు ఉండటం అందర్నీ ఆశ్చర్యపరిచింది. కాంగ్రెస్ పంపిన జాబితాలో శశిథరూర్ పేరు లేకపోయినా ఆయన పేరును కేంద్రం ప్రకటించడం, వివాదంగా మారింది. మరో వంక. శశిథరూర్ అఖిలపక్ష బృందానికి నాయకత్వం నడిపించే అవకాశం దక్కడం ఆనందంగా ఉందన్నారు. పహల్గాం దాడి నుంచి ఇటీవల చోటుచేసుకున్న కార్యకలాపాలపై భారత వైఖరిని ప్రపంచ దేశాల ముందు చెప్పేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ఆయన స్పష్టం చేశారు. దేశానికి తన సేవలు అవసరమైనప్పుడు తప్పకుండా అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు.సింధూ జలాలు పాకిస్థాన్‌కు వెళ్లకుంగా కట్టడి చేయాలన్న నిర్ణయంలోనూ మార్పు ఉండదని ప్రపంచ దేశాలకు స్పష్టంగా చెప్పాలని భారత విదేశాంగ కార్యదర్శి విక్రం మిస్రీ తాజాగా ఎంపీల ప్రతినిధి బృందానికి దిశానిర్దేశం చేశారు. 'ఆపరేషన్ సిందూర్' అనంతరం రెండు దేశాల మధ్య కాల్పుల విరమణకు అమెరికా మధ్యవర్తిత్యం నెరపిందా? అందుకు అవును అని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పలుమార్లు చేసిన ప్రకటనను భారత ప్రభుత్వం పూర్వపక్షం చేస్తున్నా, కాంగ్రెస్ పార్టీ ఈ విషయంలో స్పష్టమైన ప్రకటనను అశిస్తున్నది. పార్టీ ఎంపీ శశిథరూర్‌ను ఎంపీల బృందంలో కేంద్ర ప్రభుత్వం చేర్చుకోవడం.. తమ అభిమతాన్ని కాదని రాజకీయం చేయడమేనని అ పార్టీ బీజేపీపై గుర్రుగా వుంది. ప్రపంచ దేశాల్లో ఈ ఏంపీల బృందం పర్యటించి ఏం సాధిస్తుందని పెదవి విరుస్తున్న పార్టీలూ ఉన్నాయి. ప్రతినిధి బృం దంలో ఎంపీలు ఎవరనేది, ఆయా పార్టీల ప్రాతినిధ్యం అడగాలని.. కేంద్ర మే ఎలా పేర్లు ప్రకటిస్తుందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ముందు ఆగ్రహం వ్యక్తం చేసినా.. ఆ తర్వాత ఆమె మెత్తబడ్డారు.

## సంబరాల్లో పోలీసులు

చింతూరు మావోయిస్టులను ఎన్ కౌంటర్ లో మట్టుపెట్టిన పోలీసులు సంబరాలు చేసుకున్నారు. ఛత్తీస్గఢ్లో జరిగిన భారీ ఎన్ కౌంటర్లో మావోయిస్టు సుప్రీం లీడర్ నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు సహా 27 మంది మావోయిస్టులు హతమైన సంగతి తెలిసిందే. వారిని చంపిన అనంతరం మృతదేహాల ముందు డీఆర్జీ (డిస్ట్రిక్ రిజర్వ్ గార్డ్) బలగాలు సంబరాలు చేసుకున్నాయి. బస్తర్ ఏరియాలో మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా డీఆర్జీ పని చేస్తోంది. ఉమ్మడి ఏపీలో గ్రేహౌండ్స్ తరహాలో ఛత్తీస్గఢ్ సర్కారు 2008లో దీన్ని ఏర్పాటు చేసింది. ఈ జరిగిన విషయంపై పౌరహక్కుల సంఘం నాయకులు మానవత్వం మరిచి పోలీసులు సంబరాలు చేసుకోవడంపై పలు విమర్శలు గుప్పించారు.

## ఏసీబీ వలలో తూనికలు కొలతల శాఖా అధికారి

శ్రీకాకుళం జిల్లా పలాసలో తూనిక లు కొలతలు శాఖ కార్యాలయంలో ఏసీబీ అధికారులు దాడులు నిర్వ హించారు.ఈ దాడుల్లో ఇన్స్పెక్టర్ శ్రీధర్ పలువురు వ్యాపారుల నుంచి 1.78 లక్షలు లంచం తీసుకుంటుం డగా రెడ్ హ్యాండెడ్ గా శ్రీకాకుళం ఏసీబీ డిఎస్పి రమణమూర్తికి పట్టుబడ్డారు. ఘటనపై కేసు నమోదు చేసి ఏసీబీ కోర్టులో శ్రీధర్ ను ప్రవేశ పెడుతున్నట్లు డి.ఎస్.పి మీడియాతో తెలిపారు.

# గంటా శ్రీనివాస్ కొడుకు తెలిసి తెలియనతనమా...

విశాఖపట్టణం, మే 23 జోహార్ ఎన్టీఆర్, అంటూ అదే ఫ్లో లో బతికి ఉన్న వాళ్లకు జోహార్ చెప్పేశారు? ఓ యువనేత. రాజకీయాల్లో ఓటమి తెలియని మాజీ మంత్రి గంటా శ్రీనివాస్ కొడుకు నోటి నుండి వచ్చిన పలుకులివి. తండ్రి ఏమో రాజకీయాల్ని శాసించే స్థాయికి ఎదిగి ఓటమి తెలియని నాయకుడిగా ముద్ర వేయించుకుంటే రాజకీయ ఆరంగేట్రానికి సిద్ధంగా ఉన్న కొడుకు రవితేజ తన తెలిసీ తెలియనితనంతో అందరిలో నవ్వులపాలవుతున్నారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ముఖ్యంగా ఉమ్మడి విశాఖ జిల్లా రాజకీయాల్లో ఓటమి తెలియని నాయకుడు ఎవరు అంటే ఠక్కున గుర్తొచ్చే పేరు మాజీ మంత్రి ప్రస్తుత భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు... ఓటమి ఎరగని రాజకీయ నాయకుడిగా పేరున్న గంటా శ్రీనివాసరావు 4 సార్లు ఎమ్మెల్యేగా ఒకసారి ఎంపీగా గెలిచి తన రాజకీయ ప్రయాణంలో ఓటమిని దరిదాపులకు రాకుండా జాగ్రత్త పడుతూ వస్తున్నారు. టీడీపీ నుంచి పీఆర్పీకి, అక్కడ నుంచి కాంగ్రెస్‌కి తర్వాత తిరిగి టీడీపీకి వచ్చిన గంటా శ్రీనివాస్ తన ఇమేజ్‌కి ఎక్కడా డ్యామేజ్ అవ్వకుండా పాతికేళ్ల రాజకీయ జీవితంలో ఓ మెట్టు పైకి ఎదుగుతూనే వచ్చారు. అలాంటి మాజీ మంత్రికి ఇప్పుడు కొడుకు రూపంలో కొత్త తలనొప్పి మొదలైందంట. రాజకీయ నాయకుల్లో అత్యధికులు కచ్చితంగా రాజకీయ వారసత్వాన్ని తెరమీదకి తీసుకొచ్చి తమ బిడ్డల్ని గ్రాండ్ లాంచ్ చేస్తారు. అలాగే గంటా శ్రీనివాస్ తన కొడుకు రవితేజని రాజకీయాల్లో గ్రాండ్‌గా లాంచింగ్ చేయడానికి ప్లాన్ చేశారు. 2024లో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక భీమిలి నుండి గెలిచిన ఆయన భీమిలి నియోజకవర్గం పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాల్లో తనతో పాటు తన కొడుకును కూడా ముందు పెట్టి నడిపిస్తున్నారు. గత సంవత్సర కాలంగా భీమిలి నియోజకవర్గంలో జరిగే అధికారిక కార్యక్రమాల్లో గంటా కొడుకు రవితేజ అన్ని తానై ముందుండి నడిపిస్తున్నారు. ఇప్పటివరకు అన్ని ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాల నిర్వహణలో ముందు ఉండి పనులు చేస్తున్న రవితేజ పెద్దగా ప్రసంగాలు చేయలేదు. స్టేజీ మీద మాట్లాడితే ఒక్క నిమిషానికి మించి ఏ రోజు మాట్లాడింది లేదు. అలాంటి గంటా రవితేజ తాజాగా భీమిలి నియోజకవర్గంలో జరిగిన మినీ మహానాడులో తన తండ్రితో పాటు నియోజకవర్గంలోని కీలకమైన రాజకీయ నాయకుల సమక్షంలో క్యాడర్‌ని ఉత్సాహపరచడానికి మాట్లాడుతూ నోరు జారి జోహార్ సీఎం సార్, జోహార్ లోకేష్ అన్నయ్య అంటూ నినాదాలు చేశారు. రవితేజ తెలిసీ తెలియక కనబర్చిన అత్యుత్సాహాన్ని కేడర్ మొత్తం ఫాలో అయింది. చేసిన తప్పును గుర్తించి సరిదిద్దుకునే లోపే జరగాల్సిన డ్యామేజ్ మొత్తం జరిగిపోయింది. రవితేజ మినీ మహానాడు స్టేజి మీద మాట్లాడిన ఈ మాటలు సోషల్ మీడియాలో చెక్కర్లు కొడుతున్నాయి. బ్రతికున్న వాళ్లకు జోహార్లు ఏంటయ్యా అంటూ నెటిజన్లు కామెంట్స్ చేస్తూ ట్రోల్ చేస్తున్నారు. ఆ వ్యాఖ్యలతో గంటా వారసుడు నవ్వులపాలు అవుతున్నా... ఇంతకాలం ఆయన ఎవరో తెలియని వారికి కూడా పరిచయమవుతున్నారంట. గంటా రవితేజ తెలియని వారు ఉండరు అనే అంతగా సోషల్ మీడియాలో పాపులర్ అవుతున్నారు. గంటా శ్రీనివాస్ తన కొడుకుని సినిమా ఇండస్ట్రీలో హీరోగా నిలబెట్టి కొత్త ఇమేజ్ క్రియేట్ చేయాలనుకున్నారు. స్టార్ డైరెక్టర్ జయంత్ సి పరాన్జీతో పవర్ ఫుల్ పోలీస్ క్యారెక్టర్‌తో జై దేవ్ అనే మూవీతో గంట రవితేజను లాంచ్ కూడా చేశారు. జయదేవ్ సినిమా డిజాస్టర్ కావడంతో గంటా రవితేజ తనకి సినిమాలు సరిపడవు అనుకున్నారో ఏమో? మొదటి సినిమాతోనే సినిమా ఇండస్ట్రీకి గుడ్‌బై చెప్పేసి తండ్రి రాజకీయ వారసుడిగా ఓనమాలు నేర్చుకోవడం మొదలుపెట్టారు. టీడీపీ అధికారంలో ఉన్న ప్రస్తుత తరుణంలో జరుగుతున్న మినీ మహానాడు తన ఆ రాజకీయ ఆరంగేట్రానికి సరైన సమయం అని భావించిన రవితేజకు తొలి పొలిటికల్ ప్రసంగంలోనే చుక్కెదురవ్వడంతో.. ఆయన భవిష్యత్తు రాజకీయం ఎలా ఉండబోతుందన్న సందేహాలు మొదలయ్యాయి. 2024 ఎన్నికల బరిలో తన వారసుడ్ని ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలబెట్టి గెలిపించాలని గంట శ్రీనివాస్ ప్రయత్నం చేసినట్లు జోరుగా ప్రచారం సాగింది. చంద్రబాబు దగ్గర కూడా తన కొడుకుకి సీటు ఇవ్వాలని గంటా కోరినట్లు అప్పట్లో టాక్ నడిచింది. 2024 ఎన్నికల్లో ప్రతి సీటు టీడీపీకి కీలకం కావడంతో చంద్రబాబు నిరాకరించడంతో గంట తానే స్వయంగా భీమిలి బరిలోకి దిగి విజయం సాధించారు. ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత కచ్చితంగా గంట శ్రీనివాస్ కు మంత్రి పదవి వస్తుందని అందరూ భావించారు. అయితే ఎవరు ఊహించని విధంగా చంద్రబాబు మంత్రి వర్గాన్ని ఏర్పాటు చేసుకోవడంతో ఆయనకు నిరాశే మిగిలింది. మంత్రి పదవి రాకపోవడంతో నియోజకవర్గ మీద కొంత ఫోకస్ తగ్గించిన గంటా తన వారసుడ్ని ప్రమోట్ చేసుకునే పనిలో పడ్డారంట. రవితేజను భీమిలి నియోజకవర్గంలో బలమైన నేతగా తయారు చేయడానికి ఇదే సరైన సమయం అని భావిస్తున్న మాజీ మంత్రి పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాల్లో కుమారుడ్ని ముందు పెట్టి నడిపిస్తున్నారంట. తీరా చూస్తే రవితేజ మినీ మహానాడు స్పీచ్‌తో అందరికీ కామెడీగా మారిపోయారు. మరి సినిమాల్లో ఫ్లాప్ అయిన ఆయన పొలిటికల్ స్క్రీన్‌పై ఏ మాత్రం రాణిస్తారో చూడాలి.

# పాపం..భైరవం...

హైదరాబాద్, మే 23, సినీ ఇండస్ట్రీ లోకి వచ్చే వాళ్ళు జాగ్రత్తగా ఉండాలి, ఆచి తూచి మాట్లాడాలి, పొరపాటున ఏ చిన్న తప్పు చేసినా సోషల్ మీడియా లో ఆయా హీరోల అభిమానుల దాటికి తట్టుకోలేరు, ఇండస్ట్రీ ని వదిలి పారిపోవాల్సి వస్తుంది. అలాంటి పరిస్థితి ఇప్పుడు 'భైరవం' మూవీ డైరెక్టర్ విజయ్ కనకమేడలకు పట్టనుందా? అంటే అవుననే అంటున్నారు విశ్లేషకులు. పాపం ముగ్గురు హీరోలు. చాలా కాలం తర్వాత వెండితెర మీద కనిపించబోతున్నారు. ఎలాంటి ఈగోలకు పోకుండా మనోజ్, బెల్లంకొండ శ్రీనివాస్, నారా రోహిత్ ఈ చిత్రం లో కలిసి నటించారు. సినిమా చాలా బాగా వచ్చింది అనే టాక్ కూడా ఉంది. కానీ డైరెక్టర్ విజయ్ నోటి దూల కారణం గా ఇప్పటికే వైసీపీ ఫ్యాన్స్ కి దొరికిపోయాడు. వాళ్ళు ఇతను బయట కనిపిస్తే కొట్టేసేలా ఉన్నారు మొన్న జరిగిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో ఆయన వైసీపీ ని ఉద్దేశించి కామెంట్స్ చేసాడు. భైరవం ట్రైలర్ లోని డైలాగ్ ని గుర్తు చేస్తూ 'ధర్మం కోసం దేవుడు ఎదో ఒక రూపం లో వస్తుంటాడు..గత ఏడాది ఎన్నికల సమయం లో అదే జరిగింది' అంటూ కామెంట్ చేసాడు. దీనికి వైసీపీ అభిమానులు ట్రిగ్గర్ అయ్యారు. గత మూడు రోజుల నుండి 'బాయ్ కాట్ భైరవం' ట్రెండ్ ని సోషల్ మీడియా లో చేస్తున్నారు. ఇప్పుడు మెగా ఫ్యాన్స్ కూడా విజయ్ పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతున్నారు. ఎందుకంటే 2011 వ సంవత్సరం లో ఫేస్ బుక్ లో విజయ్ చిరంజీవి, రామ్ చరణ్ కలిసి ఉన్న మార్ఫింగ్ ఫోటో ని అప్లోడ్ చేసి మెగా ఫ్యామిలీ ని ఎగతాళి చేసాడు. చాలా సంవత్సరాల తర్వాత ఆ పోస్ట్ బయటపడింది. దీంతో నువ్వు ఇలాంటోడివా అని మెగా ఫ్యాన్స్ విజయ్ పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. వెంటనే క్షమాపణలు చెప్పాలని పెద్ద ఎత్తున డిమాండ్ చేసాడు. అభిమానుల దెబ్బకు డైరెక్టర్ దిగొచ్చాడు. వెంటనే ట్విట్టర్ లో స్పందిస్తూ 'మెగా అభిమానులకు గుడ్ ఈవెనింగ్..మెగా ఫ్యాన్స్ భైరవం చిత్రం ని బాయ్ కాట్ చేస్తామంటూ ట్విట్టర్ లో ట్రెండింగ్ చేస్తున్న విషయం నా దృష్టికి వచ్చింది. కారణం ఫేస్ బుక్ లో నా అకౌంట్ నుండి ఎప్పుడో 2011 వ సంవత్సరం లో చిరంజీవి, రామ్ చరణ్ గారికి సంబంధించి ఒక మార్ఫింగ్ ఫోటో పడింది. అది నిజానికి నేను వెయ్యలేదు. అప్పట్లో నా అకౌంట్ హ్యాక్ అయ్యింది. అయినప్పటికీ నా అకౌంట్ నుండి పడింది కాబట్టి బాధ్యత తీసుకొని క్షమాపణలు చెప్తున్నాను. నేను కూడా చిరంజీవి, పవన్ కళ్యాణ్ గార్ల సినిమాలను చూసే ఇండస్ట్రీ కి వచ్చాను. పవన్ కళ్యాణ్ గారి గబ్బర్ సింగ్ కి నేను పని చేసాను. ఆయనే నన్ను సాయి ధరమ్ తేజ్ కి పరిచయం చేసి ఇతనితో సినిమాలు చేసుకో అన్నాడు. నన్ను అంత ప్రోత్సహించిన మనుషులపై నేనెలా విషం కక్కుతాను?' అంటూ ఆయన కామెంట్స్ చేసాడు.

# అడగడుగునా ఉల్లంఘనలే..

హైదరాబాద్, మే 23, హైదరాబాద్ లోని పాతబస్తీ గుల్బర్ హౌ స్ ఏసీ కంప్రెసర్ పేలిన ఘటనలో సుమారు 17 మంది అమాయకులు అగ్ని ప్రమాదం లో మృతి చెందిన విషయం తెలిసిందే. దాం తోపాటు మైనార్దేవపల్లి చర్లపల్లి వంటి
ప్రదేశాల్లోనూ వరుసగా అగ్ని ప్రమాదాలు సంభవించిన విషయం తెలిసిందే. నేపథ్యం లో నాగర్ కర్నూల్ జిల్లాలోని పట్టణ కేంద్రా ల్లో ప్రైవేటు పాఠశాలలు, ఆసుపత్రులు ఇత ర కమర్షియల్ కాంప్లెక్స్ లో ఫైర్ సేఫ్టీ నిబంధనలను పాటించకపోవడంతో ఎప్పుడు ఎ లాంటి ప్రమాదం సంభవిస్తుందో అన్న భ యాందోళన వ్యక్తం అవుతుంది. ఆయా ము న్సిపాలిటీలలో నూతనంగా నిర్మితమవుతున్న భారీ అంతస్తులు సెట్ బ్యాక్, ఫైర్ సేఫ్టీ నిబంధనలు ఏవి పాటించక పో యినా వాటికి అనుమతులు ఎలా వ స్తున్నాయన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఆయా అంతస్తుల నిర్మాణం లోనూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్, ఫర్నిచ ర్, డోర్ కర్టెన్స్, మైక్రోవేవ్స్, ప్రమాదకరమైన కెమికల్స్, ప్లాస్టిక్ వంటి వినియోగం భారీగా పెరిగిందని అనుకోని ప్రమాదం జరిగితే వెదజల్లే దుర్వాసనతో అత్యంత ప్రమా దం సంభవిస్తుందని నిపుణులు చెప్తున్నారు.

నాగర్ కర్నూల్ జిల్లాలోని ప్రధాన పట్టణ కేంద్రాల్లో కమర్షియల్ కాంప్లెక్స్ ల ని ర్మాణం రోజురోజుకు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. చూపరులను ఆకట్టుకునేలా ఫర్ని చర్ కర్టన్స్, ఏసీ రిఫ్రిజిరేటర్, వాషింగ్ మిష న్స్ ఇతర ప్రమాదకర స్థాయిలో మంటలు అంటుకునే విధమైన డెకరేషన్లు సామాగ్రి ఏర్పాటు చేసుకుంటున్నారు. ఎండల తీవ్రత, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వంటి ఏదై నా అనుకోని పరిస్థితుల్లో అగ్ని ప్రమాదం సంభవిస్తే అక్కడికి వచ్చే ప్రజలను కాపాడుకునేలా అగ్నిమాపక శాఖ విధించే నిబంధన లు మాత్రం పాటించడం లేదు. అనుమతులు పొందే క్రమంలోనే అగ్నిమాపక శాఖ నుండి ఎన్ఓసి ఉంటేనే అనుమతులిస్తామ ని చెప్పాల్సింది పోయి అందుకు తగిన ము డుపులిస్తే చాలు అనుమతులు ఇట్టే అందుతున్నాయనిఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంగా మారడంతో క్రమంగా ప్రైవేట్ పాఠశాలలు, కళా శాలలు, ఆస్పత్రులు, ఇతర షాపింగ్ కాంప్లె క్స్, రైస్ మిలల్స్, కాటన్ మిల్స్, రెసిడెన్షియల్ నిర్మాణాలు వేల సంఖ్యలో పుట్టుకొచ్చాయి. కానీ కేవలం 20 వాటికి మాత్రమే ఫైర్ సేఫ్టీ అనుమతులు పొందడం విశేషం. మరో పదకొండు వాటికి రెన్యువల్ కూడా చేయాల్సి ఉంది. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం పట్ల సర్వత్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఆకాశాన్ని తాకే బిల్డింగులు ఇరుకు ఇరుకుగా ఎన్నో హంగులతో నిర్మాణం చేస్తున్నప్పటికీ సంబంధిత ఫైర్ సేఫ్టీ నిబంధనలు మాత్రం పాటించకపోవడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవి స్తుందో అన్న భయం అందరినీ వెంటాడుతుంది. జిప్లస్ ఫోర్ 15 మీటర్ల వరకు కమ ర్షియల్ కాంప్లెక్స్, జి ప్లస్ 5 రెసిడెన్షియల్ కాంప్లెక్స్ 18 మీటర్ల నిర్మాణం కోసం ఫైర్ సే ఫ్టీ అధికారులు అనుమతులు తప్పనిసరి. కానీ నాగర్ కర్నూల్ జిల్లాలోని కొల్లాపూర్, కల్వకుర్తి, అచ్చంపేట, నాగర్ కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలో సుమారు ఆకాశాన్ని తాకే అంతస్తులు అక్రమంగా నిర్మితం అవుతున్నాయి. వాటితోపాటు జనావాసాల్లో కొన్ని దుకాణదారులు కూడా ఫైర్ సేఫ్టీ నిబంధనలను తుంగలో తొక్కి విషపూరితమైన పొగ కమ్ముకునే రసాయనాలు ఇతర వ్యర్థాలు బట్టలు చెప్పులు ఇతర దుకాణాలు ఫైర్ సేఫ్టీ నిబంధనలను పాటించడం లేదని ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో నాగర్ క ర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్, కల్వకుర్తిలో ప్రభు త్వ అమ్రాబాద్ ఫైర్ స్టేషన్ ఆఫీస్ ఔట్సోర్సింగ్ పద్ధతిన ఉన్నాయి. ఒక్కో స్టేషన్లో ఫైర్ స్టేషన్ ఆఫీసర్ తో పాటు ముగ్గురు డ్రైవర్లు ఇద్దరు జంధార్ లు, మరో 10 మంది జవాన్లు చొప్పున 15 మంది ఫైర్ సిబ్బంది పనిచేస్తున్నారు. వీటిల్లో వాటర్ టెండర్ వాహనాలతో పాటు నాగర్ కర్నూల్ ఫైర్ స్టేషన్ కార్యాలయంలో అంబులెన్స్ ఫోర్స్ వాహనం, వరదల్లో చిక్కుకున్న వారిని కాపాడేందుకు బోటు కూడా అందుబాటులో ఉంది. ఏదైనా అంతస్తు నిర్మాణం జరిగే క్రమంలోనే మున్సిపల్ అధికారు లు ఫైర్ సేఫ్టీ ఎన్ఓసి తప్పనిసరి కోరాలి అప్పుడే యాజమాన్యాలు ఫైర్ సేఫ్టీ నిబంధనలను అనుమతు లను పొందే అవకాశం ఉంది. జనం రద్దీగా ఉండే ప్రదే శాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, ప్రైవేటు ఆసుపత్రులు, పాఠశాలల్లో ఫైర్ సేఫ్టీ నిబంధన లు తప్పకుండా పాటించాలని సూచిస్తున్నాం. ప్రమాదం జరిగితే సురక్షితంగా బయటపడే మార్గాలను ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

# జ్యోతి మల్హోత్రా... సిరాజ్... డబ్బులు ఎక్కడ నుంచి వస్తున్నాయి..

హైదరాబాద్, మే 23, ఉగ్రవాదులకు సహకరించారు.. ఉగ్రవాద అనుబంధ సంస్థలతో కార్యకలాపాలు నెరిపారు.. మనదేశంలో సున్నితమైన ప్రాంతాల సమాచారాన్ని చేరవేర్చారు అనే అభియోగాలతో కేంద్ర దర్యాప్తు సంస్థలు ప్రముఖ యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా, ఏపీలోని విజయనగరానికి చెందిన సిరాజ్ పై దృష్టి సారించాయి. దీంతో వారిద్దరి అసలు పన్నాగం బయటపడింది. వీరిద్దరూ కేంద్ర దర్యాప్తు సంస్థల అధికారుల విచారణలో ఉన్నారు. అధికారుల విచారణలో వీరికి సంబంధించిన కీలక విషయాలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. ముఖ్యంగా వీరి బ్యాంకు ఖాతాలలో భారీగా నగదు ఉండడం అధికారులను ఆశ్చర్యానికి గురిచేస్తుంది. సాధారణంగా ఇలాంటి వ్యవహారాలకు పాల్పడేవారు బినామీ ఖాతాలతో ఆర్థిక వ్యవహారాలు కొనసాగిస్తారు. కానీ జ్యోతి మల్హోత్రా, సిరాజ్ తమ పేరుతోనే బ్యాంకు ఖాతాలను నిర్వహిస్తుండడం విశేషం. పైగా బ్యాంకు ఖాతాలలో భారీగా నగదు ఉండడం అధికారులను సైతం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. జ్యోతి మల్హోత్రా పాకిస్తాన్ ఐఎస్ఐ లో పనిచేసే వ్యక్తితో కొనసాగించిన వాట్సాప్ చాట్ బయటికి వచ్చింది. తనని పెళ్లి చేసుకోవాలని జ్యోతి అతని కోరినట్టు ఆ చాట్ లో ఉంది. అంతేకాదు తనకు ఇస్లామాబాద్ అంటే చాలా ఇష్టమని.. ఇస్లామాబాద్ నగరాన్ని విడిచిపెట్టి రావడం తనకు ఇష్టం లేదని ఆ చాట్ లో జ్యోతి కోరడం విశేషం. మరోవైపు ఐసీస్ అనే ఉగ్రవాద సంస్థ కోసం పని చేస్తున్న సిరాజ్ వ్యవహారం కూడా కేంద్ర దర్యాప్తు సంస్థల అధికారులకు తెలియడంతో విజయనగరంలో కలకలం నెలకొంది. ఇక సిరాజ్ ను అదుపులోకి తీసుకున్న అధికారులు అతడిని విచారిస్తున్నారు. అతడి బ్యాంక్ ఖాతాలో భారీగా నగదు ఉండడంతో అధికారులు సైతం ఆశ్చర్యానికి గురవుతున్నారు. స్థానికంగా ఉన్న డిసిసిబి లో అతడికి ఖాతా ఉంది. అందులో దాదాపు 50 లక్షల వరకు నగదు ఉన్నట్టు తెలుస్తోంది. ఈ నగదును విత్ డ్రా చేయడానికి సిరాజ్ తల్లిదండ్రులు ప్రయత్నించగా.. బ్యాంకు అధికారులు కుదరదని చెప్పారు. సిరాజ్, జ్యోతి కి దుబాయ్ నుంచి గుర్తు తెలియని వ్యక్తులు ఖాతాలలో నగదువేశారు అని తెలుస్తోంది. అయితే దుబాయిలో వీరికి నగదు వేసిన వ్యక్తులు ఎవరు? విడతలవారీగా లక్షలకు లక్షలు నగదు ఎందుకు వేశారు? ఆ నగదుతో వీరు మనదేశంలో ఎలాంటి కుట్రలకు శ్రీకారం చుట్టారు? అనే కోణంలో కేంద్ర దర్యాప్తు సంస్థల విచారణ చేపడుతున్నారు. ఇప్పటికే జ్యోతి గురించి.. సిరాజ్ గురించి అధికారులు కీలక విషయాలు రాబట్టారు. లోతుగా దర్యాప్తు చేస్తే ఇంకా కీలక సమాచారం బయటకు వస్తుందని తెలుస్తోంది. అయితే ఇప్పటికే దర్యాప్తు సంస్థల అధికారులు వీరికి సంబంధించిన బ్యాంకు ఖాతాలను తమ ఆధీనంలోకి తీసుకున్నట్టు తెలుస్తోంది.

# కాంగ్రెస్ లో సీనియర్లు వర్సెస్ జూనియర్లు..

హైదరాబాద్, మే 23, తెలంగాణ కాంగ్రెస్ లో సీనియర్లు వర్సెస్ జూనియర్లు మధ్య వార్ పార్టీకి కొత్తకాదు. అలకలు , బహిరంగ విమర్శలు, బాహాబాహీ బలప్రదర్శనలు సర్వసాధారణం. ఇన్ని జరిగినా, జరుగుతున్నా.. తెలంగాణలో రేవంత్ సారథ్యంలో అధికారం చేపట్టి అలా ముందుకు సాగుతోంది కాంగ్రెస్ ప్రభుత్వం. తాజాగా కరీంనగర్ జిల్లా జగిత్యాల నియోజకవర్గంలో జరుగుతున్నరాజకీయ రచ్చ సీఎం రేవంత్ రెడ్డికి కొత్త తలనొప్పిగా మారింది. కొందరు రాష్ట్ర క్యాబినెట్ మంత్రులు జీవన్ రెడ్డి నియోజకవర్గం అంటేనే హడలిపోతున్నారు. అక్కడ సొంతపార్టీలో? వర్గపోరులో తామెందుకు ఇరుక్కోవడం అనుకుని జగిత్యాలకు దూరంగా ఉంటున్నారు. తాజాగా మంత్రి పొంగులేటి ముందే జీవన్ రెడ్డి ఆగ్రహం చూసిన కాంగ్రెస్ నేతలకు పార్టీలో ఏం జరుగుతుందో అర్థంకాని అయోమయం నెలకొంది. ఇక మీ రాజ్యం.. మీరే ఏలుకోండి.. అంటూ పొంగులేటి ముఖంమీదే అనేశారు జీవన్ రెడ్డి. రాకరాక కాంగ్రెస్ కు అధికారం చేతికొస్తే ,అదేపార్టీలో ఉన్న సీనియర్ నేత జీవన్ రెడ్డి అలా అనేశారేంటి, ఆయన అంతలా రగిలిపోవడం వెనుక ఏం జరుగుతోంది అనే ఆసక్తి తెలంగాణ రాజకీయాల హీటెక్కిస్తోంది. తెంగాణ కాంగ్రెస్‌లో జీవన్ రెడ్డి వీహెచ్ తరువాత అంతటి సీనియర్ నేత, ఆరు సార్లు ఎమ్మెల్యేగా , ఓసారి ఎమ్మెల్సీగా గెలుపొందిన జీవన్ రెడ్డిని తెలంగాణ కాంగ్రెస్‌లో ఇప్పుడు పట్టించుకునే నాథుడే లేడు. నియోజకవర్గంలో కాంగ్రెస్ కార్యకర్తల మద్దతు దండిగా ఉన్నా, హైదరాబాద్ కేంద్రంగా జరుగుతున్న రాజకీయాలు జీవన్ రెడ్డికి మంటెక్కిస్తున్నాయి. గత ఎన్నికల్లో తనకు ప్రత్యర్థిగా పోటీ చేసి గెలిచిన బిఆర్ ఎస్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్, కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో బి?ఆర్ఎస్ వీడి హైదరా?బాద్‌లో రేవంత్ సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఆ రోజు మొదలు జీవన్ రెడ్డికి కంటిమీద కునుకులేదంటే అతిశయోక్తికాదు. నా ప్రత్యర్థినే , నా అనుమతి లేకుండా కాంగ్రెస్‌లోకి ఎలా చేర్చుకుంటారు. పార్టీ కోసం సర్వం త్యాగం చేసిన తనను కాదని, సంజయ్‌ను అందలం ఎక్కిస్తారా అంటూ జీవన్ రెడ్డి రగిలిపోతున్నారు. అనేక సందర్భాల్లో తన అసంతృప్తిని బహిరంగంగానే బయటపెట్టారు. రేవంత్ నాయకత్వంలో ఏర్పడ్డ ప్రభుత్వంలో సీనియర్లను పట్టించుకోవడంలేదంటూ రగిలిపోతున్నారు. ఇలా జగిత్యాల సిట్టింగ్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మధ్య పచ్చగడ్డి వేయకుండానే భగ్గుమంటోంది. ఆ సెగలు జగిత్యాలను రాజకీయలను మాత్రమేకాదు, ఏకంగా తెలంగాణ అంతటా వ్యాపిస్తున్నాయి. సిఎం రేవంత్ రెడ్డి సైతం జోక్యం చేసుకోవడానికి సాహసం చేయలేనంతలా వివాదం ముదిరిపోయింది. జీవన్ రెడ్డి ఆవేదన రేవంత్ రెడ్డి కోటరీకి పట్టడంలేదని విమర్శలు బలంగా వినిపిస్తున్న నేపథ్యంలో రేవంత్ తీరుపై అసంతృప్తిగా ఉన్న కొందరు మంత్రులు, సీనియర్లు జీవన్ రెడ్డికి మద్దతుగా ఏకమవుతున్నారట. ఇటీవల జీవన్ రెడ్డిని కలిసి మంత్రి దామోదర రాజనర్సింహ చేసి వ్యాఖ్యలు ఆసక్తిగా మారాయి. జీవన్ రెడ్డి కాంగ్రెస్‌లో సీనియర్ నాయకుడు, పార్టీ కోసం ఎంతో చేశారు. కాంగ్రెస్ పార్టీ జీవన్ రెడ్డిని వదులుకోదంటూ మద్దతుగా నిలబడ్డారు. ఇలా రేవంత్ వర్గం మంత్రులు జీవన్ రెడ్డికి అంటి ముట్టనట్లు ఉంటే, సీనియర్లు మాత్రం మేమున్నామంటూ భరోసా ఇస్తున్నారట. ఇలాంటి టైంలో తాను స్పందిస్తే రెండు వర్గాలుగా మారి పరిస్థితి మరింత చేయిదాటుందని భావించిన రేవంత్ రెడ్డి వ్యూహాత్మక మౌనం వహిస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. మొత్తానికి బిఆర్ఎస్ నుంచి వస్తున్నారుగా రారమ్మంటూ సంజయ్ ను కాంగ్రెస్ లోకి ఆహ్వానించి, ప్రతిపక్షానికి షాకిచ్చామనే ఆనందం ఓవైపు, తీరా పార్టీలోకి వచ్చాక జరుగుతున్న అంతర్గత కుమ్ములాటలు , జీవన్ రెడ్డితోపాటు సీనియర్ల నుంచి వస్తున్న విమర్శలు రేవంత్ కి తలనొప్పిగా మారాయట.

# హైదరాబాద్ కు 2,000 ఎలక్ట్రిక్ బస్సులు

హైదరాబాద్, మే 23, హైదరాబాద్ నగర వాసులకు కేంద్ర ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. పీఎం ఈ-డ్రైవ్ పథకం కింద 2,000 ఎలక్ట్రిక్ బస్సులను కేటాయించినట్లు కేంద్ర భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ ప్రకటించింది. కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో హైదరాబాద్‌కు ఎలక్ట్రిక్ బస్సుల కేటాయింపుపై నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో ముఖ్యంగా తెలంగాణ, కర్ణాటక, ఢిల్లీ, గుజరాత్ రాష్ట్రాలకు బస్సుల కేటాయింపుపై దృష్టి సారించారు. ఈ పథకం కింద హైదరాబాద్‌తో పాటు బెంగళూరుకు 4,500, ఢిల్లీకి 2,800, అహ్మదాబాద్‌కు 1,000, సూరత్‌కు 600 ఎలక్ట్రిక్ బస్సులను అందజేయనున్నట్లు మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కుమారస్వామి మాట్లాడుతూ, ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ ప్రస్తుతం సుస్థిర పట్టణ రవాణా దిశగా దృఢమైన అడుగులు వేస్తూ ముందుకు సాగుతోంది అన్నారు. బెంగళూరు నుంచి ఢిల్లీ వరకు, నగరాలు ప్రజా రవాణాను మరింత పరిశుభ్రంగా, సైకర్యవంతంగా మార్చేందుకు ఈవీ బస్సులను చురుకుగా స్వీకరిస్తున్నాయని అన్నారు. తాము ఎలక్ట్రిక్ బస్సులను కేటాయించడమే కాకుండా, కొత్త ఆవిష్కరణలు, పర్యావరణ పరిరక్షణతో భారత రవాణా వ్యవస్థ భవిష్యత్తును అద్భుతంగా తీర్చిదిద్దుతున్నామని ఆయన చెప్పుకొచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో పీఎం ఈ-డ్రైవ్ హామీని నెరవేర్చేందుకు తాము కట్టుబడి ఉన్నామని కేంద్రమంత్రి తెలిపారు. పీఎం ఈ-డ్రైవ్ పథకం ద్వారా 2024 ఏప్రిల్ నుంచి 2026 మార్చి వరకు రూ. 10,900 కోట్ల వ్యయంతో 14,028 ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తేవాలనే లక్ష్యాన్ని పెట్టుకున్నామని ఆయన తెలిపారు. పీఎం ఈ-డ్రైవ్ పథకం ప్రపంచంలోనే అతిపెద్ద జాతీయ ప్రయత్నాలలో ఒకటిగా నిలుస్తుందని ఆయన తెలిపారు. ఈ పథకం కింద కొనుగోలుదారులు డిమాండ్ ఇన్సెంటివ్‌ను పొందేందుకు ఈ-వోచర్లను కూడా మంత్రిత్వ శాఖ ప్రవేశపెట్టిందన్నారు. ఇవే కాకుండా పీఎం ఈ-డ్రైవ్ కింద ఈ-ఆంబులెన్స్‌లు, ఈ-ట్రక్కులను కూడా కేంద్ర అందుబాటులోకి తీసుకురానుందన్నారు. ఇందు కోసం రూ. 500 కోట్లు కేటాయించినట్టు మంత్రి తెలిపారు.

# 29 నుంచి దోస్త్ సీట్ల కేటాయింపు

హైదరాబాద్, మే 23 తెలంగాణలో డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్ల కోసం దోస్త్ – 2025 షెడ్యూల్ విడుదలైన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఫస్ట్ ఫేజ్ రిజిస్ట్రేషన్ల గడువు ముగిసింది. మరోవైపు వెబ్ ఆప్షన్ల గడువు కూడా పూర్తి కానుంది. మరికొన్ని గంటలు మాత్రమే ఉండటంతో? రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులు వెంటనే ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని అధికారులు సూచించారు. దోస్త్ ఫస్ట్ ఫేజ్ కు సంబంధించి 87వేలకుపైగా విద్యార్థులు రిజిస్ట్రేషన్లుచేసుకున్నారు. వీరిలో 50 వేలకుపైగా మంది విద్యార్థులు వెబ్ ఆప్షన్లు ఎంచుకున్నారు. మిగిలిపోయిన విద్యార్థులు కూడా ష్టబిబిజూబ://టనీబబి.ఇణణ.ణనీల.తిని వెబ్ సైట్ లోకి వెళ్లి ప్రాసెస్ పూర్తి చేసుకోవాల్సి ఉంటుంది. మే 29వ తేదీన ఫస్ట్ ఫేజ్ సీట్లను కేటాయించనున్నారు. దోస్త్ 2025 ఫస్ట్ ఫేజ్ లో సీట్లు పొందే విద్యార్థులు మే 30వ తేదీ నుంచి ఆయా కాలేజీల్లో రిపోర్టింగ్ చేయాలి. ఈ గడువు జూన్ 6వ తేదీతో ముగుస్తుంది. సీటు పొందిన కాలేజీలో రిపోర్టింగ్ చేయకపోతే? వారి సీటు రద్దు అవుతుంది. మొదటి సెమిస్టర్ తరగతులు జూన్ 30వ తేదీ నుంచి ప్రారంభవుతాయి. దోస్త్ ఫస్ట్ ఫేజ్ లో సీటు పొందే విద్యార్థులు ష్టబిబిజూబ://టనీబబి.ఇణణ.ణనీల.తిని/లివశ్రీఇనీఎవ.టనీ వెబ్ సైట్ నుంచి అలాట్ మెంట్ కాపీని పొందవచ్చు. ఈ కాపీతో పాటు విద్యా అర్హత పత్రాలను సంబంధిత కాలేజీలో సమర్పించి అడ్మిషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాల్సి ఉంటుంది. తెలంగాణ దోస్త్ 2025 రెండో విడత కింద మే 30 నుంచి జూన్ 8 వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. మే 30 నుంచి జూన్ 9 వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. జూన్ 13న సీట్ల కేటాయింపు ఉంటుంది. ఇక మూడో విడత ప్రక్రియ జూన్ 13 నుంచి షురూ అవుతుంది. ఇందుకు జూన్ 19వ తేదీని తుది గడువుగా నిర్ణయించారు. జూన్ 13 నుంచి 19 వరకు వెబ్ ఆప్షన్లు ఎంచుకోవాలి. జూన్ 23న సీట్ల కేటాయింపు ఉంటుంది. ఇంటర్ పూర్తి అయిన విద్యార్థులు డిగ్రీలో ప్రవేశం కోసం దోస్త్ లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. కాలేజీలను ఎంచుకోవాలి. వారి స్కోర్, రిజర్వేషన్ ఆధారంగా సీట్లను కేటాయిస్తారు. దోస్త్ రిజిస్ట్రేషన్ల ద్వారా తెలంగాణలోని ఉస్మానియా యూనివర్శిటీ, కాకతీయ యూనివర్శిటీ, పాలమూరు, మహాత్మగాంధీ, తెలంగాణ వర్శిటీ, చాకలి ఐలమ్మ, శాతవాహన వర్శిటీల పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలను కల్పిస్తారు.

# కవిత వేరు కుంపటేనా

హైదరాబాద్, మే 23,బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత? పార్టీ అధినేత కేసీఆర్ కు లేఖ రాశారు. పార్టీలోని పరిస్థితులను ఇందులో ప్రస్తావించారు. కొన్ని పాజిటివ్ అంశాలను పేర్కొంటూనే?. మరికొన్ని లోపాలను సూటిగా ఎత్తి చూపారు. కవిత రాసిన లేఖ బయటికి రావటంతో?. బీఆర్ఎస్ లో అసలేం జరుగుతోందన్న చర్చ హాట్ టాపిక్ గా మారింది.తెలంగాణ రాజకీయాల్లో సంచలన పరిణామం చోటు చేసుకుంది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాసిన ఓ లేఖ? ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. ఏకంగా పార్టీ అధినేత, తండ్రి అయిన కేసీఆర్ కే ఈ లేఖను సంధించారు. పార్టీలోని పరిస్థితులను వివరించే ప్రయత్నం చేశారు. కవిత తీరుపై రాజకీయవర్గాల్లోనే కాదు సొంత పార్టీలోనూ చర్చ జరుగుతోంది. పార్టీ పగ్గాల విషయంలోనే ఇదంతా జరుగుతుందా..? అన్న డిస్కషన్ కూడా తెరపైకి వస్తోంది. ఇప్పటివరకు పార్టీలో కేసీఆర్ తర్వాత?. కేటీఆర్, హరీశ్ రావ్ అంతా తామై నడిపిస్తున్నారు. భవిష్యత్తులో వీరిలోనే ఒకరికి పార్టీ పగ్గాలు అప్పగించే అవకాశం లేకపోలేదు. ఈ విషయంలో కవితకు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా..? అన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే కవిత కొత్త పార్టీ పెట్టే ఆలోచనలో కూడా ఉన్నారనే ఊహాగానాలు తెరపైకి వస్తున్నాయి. ఈ కోణంలోనే ఆమె? ఇదంతా చేస్తున్నారనే వాదన కూడా వినిపిస్తోంది.ఓవైపు పాజిటివ్ అంశాలను ప్రస్తావిస్తూనే?. మరోవైపు లోపాలను సూటిగా చూపారు. ఇందుకు సంంబంధించిన ఓ లేఖ బయటికి రావటంతో?. అసలు బీఆర్ఎస్ లో ఏం జరుగుతోంది?? కుటుంబ విభేధాలు తారాస్థాయికి చేరాయా..? మరేమైనా పరిణామాలు చోటు చేసుకోబోతున్నాయా..? వంటి అంశాలు తెరపైకి వస్తున్నాయి'మై డియర్ డాడీ' అంటూ ఎమ్మెల్సీ కవిత ఆరు పేజీల లేఖ రాసినట్లు తెలుస్తోంది. పాజిటివ్, నెగెటివ్ ఫీడ్ బ్యాక్ అంటూ వివరంగా లేఖ రాశారు. ఎల్కతుర్తి సభ గురించి ఇందులో పలు అంశాలను ప్రస్తావించారు. ఓ రకంగా సభ నిర్వహణ తీరుపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. సభా వేదికపై పార్టీ సీనియర్ నాయకులు మాట్లాడి ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు.

పార్టీ ఆవిర్భావం నుంచి అండగా నిలిచిన నాయకులు, ధూంధాం కార్యకర్తలు ప్రసంగించి ఉంటే.. అది శ్రేణుల్లో మరింత ఉత్సాహాన్ని నింపి ఉండేదన్నారు.పార్టీ లీడర్స్‌కు యాక్సెస్ ఇవ్వడం లేదంటూ కవిత తన లేఖ ద్వారా కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. బీజేపీపై 2 నిమిషాలే మాట్లాడడంతో అనుమానాలు బలపడుతున్నాయని? బీజేపీ వల్ల తాను కూడా చాలా ఇబ్బందిపడ్డాను అని గుర్తు చేశారు. సభా వేదిక నుంచి బీజేపీని టార్గెట్ చేసి ఉంటే బాగుండేదని అభిప్రాయపడ్డారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పోటీ చేయకుండా బీజేపీకి మద్దతు ఇచ్చిందనే సందేశాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లిందన ఇది పార్టీకి ప్రతికూలంగా మారిందని కవిత గుర్తు చేశారు.వక్ఫ్ బిల్లుపై మాట్లాడి ఉంటే బాగుండేదని? బీసీలకు 42 శాతం కోటా అంశం విస్మరించినట్లు కవిత తన లేఖలో గుర్తు చేశారు.ఎస్సీ వర్గీకరణపై కూడా మాట్లాడలేదని చెప్పారు. ప్రస్తుత రాజకీయ పరిణామాలను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి కీలక నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. పార్టీకి నిర్దిష్టమైన కార్యక్రమాలు, మార్గదర్శకాలు అవసరమని అంతా భావించారని కానీవరంగల్ సభలో అలాంటి స్పష్టత కొరవడిందని ప్రస్తావించారు. తెలంగాణ తల్లి విగ్రహం మార్చడం, తెలంగాణ గీతం విషయం వంటి అంశాలను కూడా ఇందులో పేర్కొన్నారు.ప్రస్తుతం అమెరికా పర్యటనలో కవిత ఉన్నారు.ఆమె విదేశాల్లో



ఉంటున్న సమయంలో లేఖ బయటికి రావటంతో? బీఆర్ఎస్ పార్టీ నేతలు, శ్రేణులు ఉలికిపాటుకు గురవుతున్నారు. అసలు పార్టీలో ఏం జరుగుతోందని చర్చించుకున్నారు.అధికారం కోల్పోయిన తర్వాత కొద్దిరోజుల్లోనే బీఆర్ఎస్ పార్టీ మళ్లీ లైన్ లోకి వచ్చింది. పార్లమెంట్ ఎన్నికల్లో ఖాతా కూడా తెరవలేకపోయిన ఆ పార్టీ ఆ తర్వాత ఒక్కో కార్యక్రమాన్ని తీసుకుంటే ప్రజల్లోకి వెళ్లే ప్రయత్నాలను బలంగా చేసింది. ఈ విషయంలో సక్సెస్ అవుతూనే వచ్చింది. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఏ చిన్న అవకాశాన్ని కూడా చేజారనివ్వకుండా సద్వినియోగం చేసుకున్నట్లు కనిపించింది.కట్ చేస్తే పార్టీ రజతోత్సవ సభను బీఆర్ఎస్ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. నాలుగైదు నెలలుగా కసరత్తు చేయగా? ఏప్రిల్ లో సభను నిర్వహించింది. భారీ స్థాయిలో జనసమీకరణ చేయటంతో సభ గ్రాండ్ సక్సెస్ అయింది. అయితే సభ తర్వాత అనేక అంశాలు తెరపైకి వస్తున్నాయి. నిజానికి సభ ఏర్పాట్ల బాధ్యతలను ముందుగా హరీశ్ రావుకు అప్పగించారు. దీంతో ఆయన పలుమార్లు క్షేత్రస్థాయిలో కూడా పర్యటించారు.

సభ కోసం స్థలాలను కూడా పరిశీలించారు. అయితే ఉన్నట్టుండి? హరీశ్ బాధ్యతల నుంచి తప్పుకున్నారు. ఆ తర్వాత కేటీఆర్ సీన్ లోకి వచ్చారు. అయితే హరీశ్ రావును తప్పించారా..? లేక తప్పుకున్నారా..? అన్న చర్చ గట్టిగా జరిగింది.ఇక రజతోత్సవ సభ వేదికపై కేవలం కేసీఆర్, కేటీఆర్ ఫొటోలను మాత్రం ప్రదర్శించారు. కేటీఆర్ కు పార్టీ నాయకత్వ బాధ్యతలను అప్పగించే కోణంలోనే ఇదంతా జరుగుతుందా..? అన్న చర్చ జోరుగా తెరపైకి వచ్చింది.నిజానికి కూడా వేదికపై ఏ ఇతర నాయకుల ఫొటోలకు కూడా అవకాశం కల్పించలేదు. అంతేకాదు పార్టీ వేదికపై కేవలం కేసీఆర్ మాత్రమే మాట్లాడారు. ఏ ఒక్క నాయకుడికి కూడా అవకాశం ఇవ్వలేదు.కొంతకాలంగా బీఆర్ఎస్ పార్టీలో ఎమ్మెల్సీ కవిత తీరు కూడా చర్చనీయాంశంగా మారింది. బీసీ అజెండాతో పలు కార్యక్రమాలను నిర్వహిస్తూ ముందుకెళ్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ జెండా కాకుండా?. కవిత కేంద్రంగానే ఇదంతా నడుస్తోంది. జిల్లా పర్యటనలు చేస్తూ తమ మార్క్ ను చూపించే ప్రయత్నం చేస్తున్నారు. ఇటీవలే మే డే కార్యక్రమంలో పాల్గొన్న ఆమె? కొన్ని సీరియస్ కామెంట్స్ చేసిందిభౌగోళిక తెలంగాణ మాత్రమే సాధించుకున్నాం.


సామాజిక తెలంగాణ సాధించుకోలేకపోయాం. భూమి ఉన్న వాళ్లకే పంట పెట్టుబడి సాయం ఇచ్చాం. కానీ ఏమీ లేనివాళ్లకు ఏం చేయలేకపోయాం" అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. సరిగ్గా ఈ వ్యాఖ్యలను ప్రత్యర్థి రాజకీయ పార్టీలు అస్త్రంగా మలుచుకున్నాయి. గత పదేళ్ల పాటు అధికారంలోకి ఉన్నది బీఆర్ఎస్ పార్టీనే కదా? సామాజిక తెలంగాణ దిశగా ఎందుకు అడుగులు వేయలేకపోయారంటూ ప్రశ్నలు ఎక్కుబెట్టారు.అంతేకాదు? రైతుబంధు విషయంలో పలు ప్రశ్నలను సంధించారు. కవిత వ్యాఖ్యలను సొంత పార్టీ నేతలు కూడా సమర్థించుకోలేని పరిస్థితి ఏర్పడినట్లు అయింది. దీంతో ఆమె చేసిన వ్యాఖ్యలు పార్టీలోనూ చర్చనీయాంశంగా మారిపోయాయి.ఇటీవలే మీడియాతో మాట్లాడిన కవిత? తనపై కుట్రలు చేస్తున్నారంటూ కూడా మాట్లాడారు. వాళ్లెవరో తనకు తెలుసని? టైమ్ వచ్చినప్పుడు బయటపెడతానంటూ వార్నింగ్ కూడా ఇచ్చారు. తనపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఖండించాల్సిన బాధ్యత పార్టీపై కూడా ఉందంటూ ఆవేదనను వ్యక్తపరిచేలా మాట్లాడారు. అయితే కవిత?. పార్టీలోని ఓ కీలక నేతను ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. ఇదే విషయాన్ని పార్టీ అధినేత కేసీఆర్ దృష్టికి కూడా తీసుకెళ్లారంట..!ఎమ్మెల్సీ కవిత తీరు చూస్తుంటే పార్టీలోని పరిస్థితులపై ఆమె తీవ్రమైన అసంతృప్తితో ఉన్నారనే విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి.ఇటీవలే ఆమె చేసిన కొన్ని వ్యాఖ్యలే ఇందుకు బలం చేకూరుస్తున్నాయని చెప్పొచ్చు. పార్టీ నుంచి తనని సైడ్ చేస్తున్నారనే భావన ఆమెలో బలంగా ఉన్నట్లు కనిపిస్తోంది. పార్టీలో తన ప్రియారిటీని తగ్గించే పరిణామాలు కనిపిస్తున్నాయనే భావనలో కూడా కవిత ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే?.ఆమ సొంతగా పలు కార్యక్రమాలను చేపడుతున్నట్లు అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.పూలే విగ్రహా ఏర్పాటు, బీసీలకు రిజర్వేషన్లు,మహిళా రిజర్వేషన్ల వంటి పలు అంశాలపై కవిత ప్రధానంగా పోరాడుతున్నారు. దీక్షలతో పాటు పలు కార్యక్రమాలను కూడా చేపట్టారు. అంతేకాదు జిల్లాల పర్యటనలు కూడా చేస్తున్నారు. మరోవైపు జాగృతితో పాటు అనుబంధ సంఘాలను కూడా బలోపేతం చేస్తున్నారు. ఇటీవలనే జాగృతి అనుబంధ సంఘాలకు కొత్త కమిటీలను కూడా ప్రకటించారు. మొత్తంగా తన కార్యక్రమాలకు మరింత పదును పెట్టే దిశగా కవిత అడుగులు వేస్తున్నారు.నిజానికి ప్రస్తుతం బయటికి వచ్చిన లేఖ? ఎల్కతుర్తి సభ తర్వాత కవిత?. కేసీఆర్ కు రాసినట్లు తెలుస్తోంది. మొత్తంగా కవిత రాసిన లేఖ వ్యవహారం బీఆర్ఎస్ లోనే కాదు రాజకీయవర్గాల్లోనూ సంచలనంగా మారింది. ఈ లేఖ వ్యవహారం పార్టీ అంతర్గత సమస్య వరకే ఉంటుందా..? లేక సరికొత్త రాజకీయ పరిణామాలకు దారి తీస్తుందా?? అనేది చూడాలి?!

## గ్రూప్, 2, 3 ఇంటర్వ్యూలకు కమిషన్ కసరత్తు

హైదరాబాద్, మే 23, తెలంగాణలో ఏప్రిల్ నాటికి ఉద్యోగ నియామకాల ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం భావించినా కోర్టు కేసులతో జాప్యం జరుగుతోంది.ప్రాధాన్యత క్రమంలో గ్రూప్ 1, 2, గ్రూప్ 3 ఉద్యోగాలను భర్తీ చేయాలని భావించినా ఆలస్యమైంది.గ్రూప్ 1 వ్యవహారం కొలిక్కి రావడంతో గ్రూప్2, 3 సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేపడతారు.తెలంగాణ గ్రూప్ 1 నియామక ప్రక్రియ కొలిక్కి వస్తుడంటంతో మిగిలిన ఉద్యోగ నియామకాలను కొలిక్కి తీసుకువచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. గ్రూప్-1 సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిలిపివేయాలంటూ కొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించడం, పిటిషనర్లకు న్యాయస్థానం జరిమానా విధించడంతో గ్రూప్1 సర్టిఫికెట్ వెరిఫికేషన్ తుది తీర్పుకు లోబడి నిర్వహించారు.గ్రూప్1 వ్యవహారంపై కమిషన్ వాదనలతో కోర్టులో న్యాయ వివాదం కొలిక్కి వచ్చిన వెంటనే టీజీపీఎస్సీ మిగిలిన ఉద్యోగ నియామక పరీక్షలకు సంబంధించిన కసరత్తు పూర్తి చేయాలని కమిషన్ భావిస్తోంది.తెలంగాణలో 2,171 గ్రూప్-2, 3 పోస్టుల భర్తీకి కమిషన్ కసరత్తు ప్రారంభించింది,. రాత పరీక్షల్లో జనరల్ ర్యాంకింగ్ ఆధారంగా అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన చేపట్టేందుకు పరిపాలన ప్రక్రియను టీజీపీఎస్సీ ఇప్పటికే పూర్తి చేసింది.ఉద్యోగ నియామకాల్లో రోస్టర్ పాయింట్లు, మొత్తం పోస్టుల సంఖ్య ఆధారంగా 1:11 నిష్ప త్తిలో అభ్యర్థుల జాబితా ప్రకటించనుంది. గ్రూప్2, గ్రూప్ 3 ఉద్యోగ నియామకాల ప్రక్రియ ఇప్పటికే ఆలస్యం కావడంతో వెంటనే చేపట్టడమో, గ్రూప్ 3 పోస్టింగుల ప్రక్రియ పూర్తయ్యాక చేపట్టాలనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది.783 గ్రూప్2 పోస్టుల భర్తీకి గతేడాది డిసెంబరు 15,16 తేదీల్లో రాత పరీక్షలను నిర్వహించారు. ఈ పరీక్షలకు ,49,964 మంది హాజరయ్యారు. ఓఎంఆర్ పత్రాల్లో పొరపాట్లు చేయడం, బబ్లింగ్ సరిగా చేయకపోవడం వంటి కారణాలతో 13,315 మంది అభ్యర్థులను కమిషన్ అనర్హులుగా ప్రకటించింది.మరోవైపు గ్రూప్-2 పరీక్షలు పూర్తైన మూడు నెలల్లోపే జనరల్ ర్యాంకు జాబితా టీజీపీఎస్సీ ప్రకటించింది. పరీక్ష రాసిన వారిలో 2,36,649 మందికి వచ్చిన మార్కులతో జనరల్ ర్యాంకింగ్ జాబితాను ఈ ఏడాది మార్చి 11న విడుదల చేశారు?.గ్రూప్-3 రాత పరీక్షల జనరల్ ర్యాంకింగ్ కూడా ఇప్పటికే విడుదలైంది. గ్రూప్ 3లో 1,388 పోస్టుల భర్తీకి 2024 నవంబరు 17, 18 తేదీల్లో నిర్వహించిన రాత పరీక్షలకు 2,67,921 మంది హాజర య్యారు. పరీక్షల్లో నిబంధనలు పాటించని 18,364 మందిని పబ్లిక్ సర్వీస్ కమిషన్ అనర్హులుగా ప్రకటించింది.మిగిలిన 2,49,557 మంది అభ్యర్థులతో మార్చి 14న జనరల్ ర్యాంకింగ్ లిస్ట్ విడుదలైంది. ఏప్రిల్ నెలాఖరుకు అన్ని నియామకాలు పూర్తి చేయాలని కమిషన్ భావించినా గ్రూప్-1పై న్యాయవివాదాలు రావడంతో గ్రూప్ 2, గ్రూప్ 3 ఉద్యోగాలకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఆలస్యమైంది.గ్రూప్-1 నియామక ప్రక్రియ పూర్తి కాకుండా గ్రూప్-2, 3 ఎంపికలు ప్రారంభిస్తే పోస్టుల్లో ఖాళీలు మిగిలిపోతాయని కమిషన్ భావిస్తోంది. మెరిట్ అభ్యర్థులకు అన్యాయం జరగకుండా ప్రాధాన్య క్రమంలో పోస్టుల్ని భర్తీ చేయాలని యోచిస్తోంది.స్త్రీ శిశు సంక్షేమ శాఖలో సీడీపీవో, మేనేజర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసింది. 2022లో విడుదలైన 23పోస్టులకు 19,812 మంది దర ఖాస్తు చేశారు. 2023 జనవరిలో ప్రాథమిక పరీక్షలు నిర్వహించారు. ఆ తర్వాత టీజీపీఎస్సీ పరీక్షల పేపర్ లీక్ కావడంతో ఈ ఏడాది జనవరి 3,4 తేదీల్లో మరోసారి ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించారు. దీని ఆధారంగా మల్టీ జోన్ 1,2 ఫలితాలను విడుదల చేశారు. కమిషన్ వెబ్‌సైట్‌లో ఫలితాలు అందుబాటులో ఉంటాయి.

## "సీఎం ప్రజావాణి"ని సందర్శించిన ట్రైనీ ఐ.ఏ.ఎస్. అధికారులు

### -చిన్నారెడ్డి, దివ్యలతో భేటీ



మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో శుక్రవారం జరిగిన " సీఎం ప్రజావాణి" ని శిక్షణ పొందుతున్న తెలంగాణ రాష్ట్ర క్యాడర్ ఐఏఎస్ అధికారుల బృందం సందర్శించింది.సీఎం ప్రజావాణి అమలు జరుగుతున్న తీరును వారు క్షుణ్ణంగా పరిశీలించారు. పలు అంశాలపై సీఎం ప్రజావాణికి వస్తున్న ప్రజలు అందజేసే వినతి పత్రాల దరఖాస్తులను హెల్ప్ డెస్క్ సిబ్బంది సహకారాన్ని ఇవ్వడం, డెస్క్ అధికారులు వాటిని స్వీకరించి ఆన్లైన్లో సంబంధిత శాఖలకు పంపించే విధానాన్ని, ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి వారితో జరుపుతున్న సమన్వయ తీరును శిక్షణ పొందుతున్న ఐ.ఏ.ఎస్. అధికారులు పరిశీలించారు. అత్యవసర వైద్య సేవలు అందించే విభాగాన్ని కూడా వారు పరిశీలించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న ఐఏఎస్ అధికారులు సీఎం ప్రజావాణి ఇన్చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ లతో భేటీ అయ్యారు. సీఎం ప్రజావాణి గురించి వారు అడిగి తెలుకున్నారు.ప్రజల సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రజావాణి, ప్రవాసి ప్రజావాణి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని చిన్నారెడ్డి వారికి తెలిపారు. సీఎం ప్రజావాణిలో సమస్యల పరిష్కారం ప్రస్తుతం 68 శాతం ఉందని, రానున్న రోజుల్లో 70 శాతానికి మించి అత్యుత్తమ ఫలితాలు ఉంటాయని చిన్నారెడ్డి పేర్కొన్నారు. ప్రజల నుంచి పిటిషన్స్ తీసుకుని సమస్యలు విని సంబంధిత శాఖల అధికారులకు ఫోన్ చేసి, పిటిషన్స్ పై ఎండార్స్ మెంట్ చేసి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నట్లు చిన్నారెడ్డి వారికి వివరించారు.సీఎం ప్రజావాణి అమలు తీరు తమకు ఎంతో స్ఫూర్తిని కలిగించిందని, భవిష్యత్తులో ప్రజా సమస్యల పరిష్కారంలో తమకు ఇక్కడి అనుభవాలు చాలా ఉపయోగపడతాయని ట్రైనీ ఐఏఎస్ అధికారులు ప్రణయ్ కుమార్, సాలోని చాభ్ర పేర్కొన్నారు.

## ఇంజనీరింగ్ కనీస ఫీజు రూ.50 వేలు

హైదరాబాద్, మే 23, రాష్ట్రంలో రాబోయే మూడేండ్లకు ఇంజినీరింగ్ కాలేజీల్లో ఫీజుల ఖరారు చివరి దశకు చేరింది. ఇప్పటికే మెజార్టీ ప్రైవేట్ కాలేజీల్లో ఫీజులు ఫైనల్ కాగా, కొన్నింటిపై ఇంకా చర్చలు జరుగుతున్నాయి. అయితే, ఈసారి మినిమమ్ ఫీజును రూ.50 వేలు చేయాలనే యోచనలో అధికారులు ఉన్నారు. మరోపక్క ఫీజు అత్యధికంగా 2 లక్షలు దాటనున్నది. ఈనెలాఖరులో ఇంజినీరింగ్ ఫీజులపై స్పష్టత రానున్నది. స్టేట్ లోని ఇంజినీరింగ్ కాలేజీల్లో 2025?26, 2026?27, 2027?28 విద్యా సంవత్సరాలకు గానూ ఫీజులను నిర్ణయించేందుకు తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ (టీఏఎఫ్ఆర్సీ) ఇప్పటికే పలు మార్లు సమావేశమైంది. ఫీజుల ఖరారుకు టీఏఎఫ్ఆర్సీకి 157 కాలేజీలు దరఖాస్తు చేసుకోగా, ఆయా కాలేజీల పత్రాలను పరిశీలించారు. దీంట్లో ఫీజుల ఖరారు ఓ కొలిక్కి వచ్చింది. సర్కారు కాలేజీలలో ప్రస్తుతం మినిమమ్ ఫీజు రూ.35వేలు ఉండగా, దాన్ని అలాగే కొనసాగించాలని నిర్ణయించారు. ప్రైవేటు కాలేజీల్లో మినిమమ్ ఫీజు రూ.45వేలు ఉండగా, దాన్ని రూ.50 వేలకు పెంచాలని టీఏఎఫ్ఆర్సీ ప్రతిపాదనలు రెడీ చేసింది.దాదాపూ ఇది ఖరారయ్యే చాన్స్ ఉంది. అత్యధికంగా 4 ప్రైవేట్ఇంజినీరింగ్ కాలేజీల్లో రూ. 2 లక్షలకు పైగా ఫీజులు ఉండే అవకాశం ఉంది. ఈ విషయాన్ని మేనేజ్మెంట్లతో జరిగిన సమావేశంలోనూ ఆయా యాజమాన్యాలకు తెలిపి, వారితో ఒప్పుకున్నట్టు టీఏఎఫ్ఆర్సీ అధికారులు సంతకాలూ చేయించుకున్నారు. ఇక అధికారికంగా ప్రకటించడమే ఉంది. గత బ్లాక్ పీరియడ్?లో 38 కాలేజీల్లో లక్షకుపైగా ఫీజు డిసైడ్ చేశారు.ఈ సారి ఆ సంఖ్య డబుల్ అయ్యే అవకాశాలున్నాయి. గతంలో రూ.80వేలకు పైగా ఫీజులున్న చాలా కాలేజీల్లో రూ.లక్షకు పైగా ఫీజులు ఉండే చాన్స్ ఉంది. ఇప్పటికే పలు కాలేజీలు సర్కారు పెద్దలను కలిసి.. ఫీజులు పెంచాలని విజ్ఞప్తులు చేస్తున్నాయి. 25 కాలేజీలు మినహా.. మిగిలిన కాలేజీలు భారీగా ఫీజులు పెంచాలని టీఏఎఫ్ఆర్సీకి ప్రతిపాదనలు ఇచ్చాయి. వీటిపై టీఏఎఫ్ఆర్సీ 3 సార్లు సమావేశమై.. చర్చలు చేసింది.సుమారు 40 కాలేజీల్లో ఫీజులపై కమిటీలో భిన్నాభిప్రాయాలు వచ్చినట్టు తెలుస్తున్నది. దీంతో ఆయా కాలేజీలపై మరోసారి సమావేశంలో చర్చించాలని డిసైడ్ అయ్యారు. అప్పటి వరకూ కాలేజీలు ఇచ్చిన వివరాలపై మరోసారి వెరిఫై చేస్తున్నట్టు సమాచారం. అయితే, ఈ నెలాఖరులోపు ఇంజినీరింగ్ ఫీజులను ఖరారు చేయాలని సర్కారు భావిస్తున్నది. టీఏఎఫ్ఆర్సీ ఇచ్చిన ఫీజుల వివరాలతో ప్రభుత్వం అధికారికంగా జీవో రిలీజ్ చేయనున్నది.

## ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్

### నేడు నిటి అయోగ్ సమావేశంలో పాల్గొనున్న సీఎం

### ప్రధాని మోడీతో భేటీ కానున్నరేవంత్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ బయల్దేరి వెళ్లారు. శనివారం అక్కడ జరిగే నీతి అయోగ్ సమావేశంలో పాల్గొనేందుకు వీలుగా ఆయన శుక్రవారం సాయంత్రం హస్తినకు చేరుకున్నారు. 2018 తర్వాత తొలిసారిగా నీతిఆయోగ్ సమావేశానికి హాజరవుతున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంతే కావటం గమనార్హం. ఢిల్లీ ప్రగతి మైదాన్‌లోని భారత్ మండపంలో శనివారం జరిగే నీతిఆయోగ్ సమావేశానికి సీఎం హాజరుకానున్నారు. భారత్ మండపంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఇతర ముఖ్యమంత్రులతో కలిసి ఆయన అల్పాహారం స్వీకరించనున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులతో కలిసి గ్రూప్ ఫొటో కార్యక్రమంలో పాల్గొంటారు.

సీఎం పర్యటనువివరాలు...

వికసిత్ రాజ్య ఫర్ వికసిత్ భారత్ ఎజెండాగా ఏర్పాటు చేసిన నీతి అయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ మీటింగ్లో తెలంగాణ రైజింగ్ 2047 విజన్ను ఆవిష్కరించనున్న ముఖ్యమంత్రి.

ం2047 నాటికి తెలంగాణ రాష్ట్రం సాధించదల్చుకున్న లక్ష్యాలు.. పాలసీలు.. సుపరిపాలన విధానాలు.. రాష్ట్రాల అభివృద్ధికి కేంద్రం అందించాల్సిన సహాయ సహకారాలపై రాష్ట్రం తరపున ప్రత్యేక నివేదిక సమర్పించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

తెలంగాణ అభివృద్ధే లక్ష్యంగా పెట్టుబడుల సాధన, మౌలిక వసతుల అభివృద్ధికి తెలంగాణ రైజింగ్‌తో ముందుకు సాగుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం

తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ ఎకానమీగా మార్చడం లక్ష్యంగా పెట్టుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.

ంఐటీ, ఫార్మా, అర్బనైజేషన్‌లో ముందున్న తెలంగాణ ఆ రంగాల్లో మరింత ముందుకు పోయేందుకు ప్రజాప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ంఆర్ఆర్ఆర్, రేడియల్ రోడ్లు, డ్రైపోర్ట్, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ఐటీఐలను ఏటీఆర్‌లుగా మారుస్తూ మౌలిక వసతులు, యువతకు నైపుణ్య శిక్షణతో పాటు ప్రపంచ స్థాయి సౌకర్యాలతో యూనివర్సిటీల ఏర్పాటుపై సీఎం ప్రసంగం

సాగు రంగం అభివృద్ధికి చేసిన రుణమాఫీ, వరికి బోనస్, సంక్షేమంలో భాగంగా అందిస్తున్న సన్న బియ్యం, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే పథకం... మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ సరఫరా, రూ.500కే సిలిండర్ సరఫరాలను వివరించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

సామాజిక సాధికారితలో భాగంగా ఎస్సీ కులాల ఉప వర్గీకరణ, కుల గణన, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని శాసనసభలో తీర్మానించిన విషయాన్ని ప్రస్తావించనున్న ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

## మహిళలు అన్నింటిలో భాగస్వాములు కావాలి

### మున్సిపల్ కమీషనర్ మహమ్మద్ అయాజ్




**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి మే 23** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉమెన్ ఫర్ ట్రీస్ అమృత్ 2.0 లో భాగంగా మహిళలు అన్ని కార్యక్రమాలలో భాగస్వాములు అయి అర్థిక పురోగతిని సాధించాలని జమ్మికుంట మున్సిపల్ కమీషనర్ మహమ్మద్ ఆయాజ్ అన్నారు. శుక్రవారం జమ్మికుంట పట్టణంలోని నాయిని చెరువు ప్రాంతంలో మున్సిపల్ కమీషనర్ మహమ్మద్ అయాజ్, మెప్మా డీఎంసీ శ్రీవాణి, మెప్మా ఇంచార్జి టి.ఎం.సి. జ్యోతి, సీ.ఎల్ ఆర్పీ మంజులలు పరిశీలించి, సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమీషనర్ మహమ్మద్ అయాజ్, మెప్మా డీఎంసీ శ్రీవాణిలు మాట్లాడుతూ మహిళా సంఘంలోని సభ్యులు రానున్న వర్షాకాలంలో మొక్కలు నాటి, జియో ట్యాగ్ ద్వారా వాటిని విధిగా సంరక్షించాలన్నారు. మొక్కలు సక్రమంగా పెరిగే విధంగా పూర్తి భాధ్యత సంఘ సభ్యులదే ఉంటుందని అయన అన్నారు. వర్షాకాలంలో కానీ, చలి కాలంలో కానీ, ఎండ కాలంలో కానీ వాటిని సంరక్షించి, వాటి పరిరక్షించాలని అయన పిలుపు నిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రానున్న రోజుల్లో నాయిని చెరువును మినీ ట్యాంక్ బండ్ గా ఏర్పాటు చేయబోతున్నట్లు కమిషనర్ మహమ్మద్ అయాజ్ అన్నారు. ఈ కార్యక్రమంలో అర్పిలు, సంఘ సభ్యులు, ఈ ఈ శ్రీ కాంత్, పలువురు పాల్గొన్నారు.




## ఆపరేషన కాగర్ ను విరమించాలి.

### మారణ హోమాన్ని ఆపాలి,నక్సల్స్ తో శాంతి చర్చలు జరపాలి, కేంద్ర ప్రభుత్వం మొండివైఖరి విడనాడాలి.




**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి మే 23(ప్రజాబలం)**సంగారెడ్డి జిల్లా/సంగారెడ్డి:సిపిఐ ఆద్వర్యంలో ఆపరేషన్ కాగర్ ను విరమించాలని మరణ హోమాన్ని ఆపాలని కోరుతూ సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు, ఈ సందర్భంగా సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు మం ఏ రెహమాన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగారు పేరుతో నక్సల్స్ మరియు ప్రశ్నించే గొంతులను ఆదివాసులను క్రూర తి క్రూరంగా ఎన్కౌంటర్ పేరుతో మారణ హోమాన్ని సృష్టిస్తున్నారు మావోయిస్టు పార్టీ శాంతి చర్చలకు సిద్ధమని ప్రకటించినప్పటికిని ఇతర విపక్ష పార్టీలు మరియు ప్రజా సంఘాలు కేంద్ర ప్రభుత్వానికి నక్సల్స్ తో శాంతి చర్చలు జరపాలని సూచించినప్పటికిని కేంద్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోడీ మరియు హోం శాఖ మంత్రి అమిత్ షా లు శాంతి చర్చలు జరపకుండా మారణ హోమాన్ని సృష్టిస్తున్నారు ఈ మారణ హోమంలో నక్సల్స్ ఆదివాసులు, మిలటరీ జవాన్లు ఎదురుకార్పుల్లో చనిపోతున్నారు ఇవన్నీ పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి నీ వీడకుండా రాత్రి పగలు తేడా లేకుండా ఎన్కౌంటర్లను జరుపుతున్నారు. సిగ్గు లేకుండా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా 2026 మార్చ్ 31 వరకు నాక్సలిజన్ ని అంతం చేస్తాం అని చెప్పడం నిరంకుశ ఫాసిస్ట్ విధానం తప్ప మరేదేమీ కాదు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం నరమేధాన్ని ఆపేసి శాంతి చర్చలు జరపాలి సాయుధ పారా మిలిటరీ దళాలను వెనక్కి రప్పించాలి ఏ సమస్య కు అయినా పరిష్కార మార్గం చర్చలోనే ఉంటుంది కేంద్ర ప్రభుత్వం గుర్తించాలి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న దుశ్చర్యలను దేశ ప్రజలు గమనిస్తున్నారు తస్మాత్ జాగ్రత్త అని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాం లేనిపక్షంలో విపక్ష పార్టీలు ప్రజాస్వామ్యవాదులంతా ఏకమై దేశవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరిస్తున్నాం ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ నాయకులు చింత గంగయ్య సయ్యద సమద్ మల్లేష్ అసద్ తిరుమలేష్ వెంకట్ ఇమ్రాన్ శ్రీనివాస్ యదుల్ సమతా సైనికదళ్ జిల్లా కార్యదర్శి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు

## బసవేశ్వర విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం...





ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం సంగారెడ్డి జిల్లాలో పర్యటించారు. జిల్లాలోని జహీరాబాద్ మండలం హుగ్గెల్లిలో బసవేశ్వర మహారాజ్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. మంత్రులు కొండా సురేఖ, దామోదర రాజనర్సింహ, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎంపీ సురేష్ షెట్కర్, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## నకిలీ విత్తనాల రవాణా,ఉత్పత్తి విక్రయాలపై ప్రత్యేక నిఘా.

### నకిలీ విత్తనాలు ఉత్పత్తి,అమ్మేవారిపై,రవాణా చేసే వారిపై క్రిమినల్ కేసులు, పి.డి.యాక్ట్ నమోదు.

### నకిలీ విత్తనాల అక్రమ రవాణా,విక్రయాలకు సంబంధించిన సమాచారం పోలీస్ వారికి అందించాలి.

### నకిలీ విత్తనాల అక్రమ రవాణా నియంత్రించేందుకు పోలీస్ శాఖ, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు.

### జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే



**రాజన్న సిరిసిల్ల జిల్లా, మే - 23 (ప్రజాబలం ప్రతినిధి)**రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలో నకిలీ విత్తనాలను విక్రయిస్తున్నట్లుగా,రవాణా, ఉత్పత్తి చేస్తున్నట్లు సమాచారం అందింతే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని జిల్లా ప్రజలకు,రైతులకు జిల్లా ఎస్పీ సూచించారు.వానాకాలం సాగు ప్రారంభమవుతున్న వేళను దృష్టిలో వుంచుకోని రైతన్న నకిలీ విత్తనాల బారీన పడకుండా ముందస్తు చర్యలకై జిల్లా పోలీసులు సిద్ధంగా ఉందని నకిలీ విత్తనాల సరఫరా,ఉత్పత్తి,అమ్మకాలు అరికట్టడానికి వ్యవసాయ శాఖ,జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో తరచు తనిఖీలు చెప్పట్టడం జరుగుతుందన్నారు.జిల్లాలో నకిలీ విత్తనాల అక్రమ రవాణా, విక్రయాలను అడ్డుకోవడానికి పోలీస్,వ్యవసాయ అధికారులచే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని,గతంలో నకిలీ విత్తనాలు అమ్మిన వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారియెక్క కదలికలను ఎప్పటికప్పుడు గమనించడం జరుగుతుందన్నారు.నకిలీ విత్తనాలు కలిగి ఉన్నా, అమ్మిన,రవాణా చేసే వ్యక్తుల పై క్రిమినల్ కేసులు,పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపడం జరుగుతుందన్నారు.జిల్లాలో ఒక్క రైతుకు కూడా నకిలీ విత్తనాలతో మోసపోకుండా చూసే బాధ్యత వ్యవసాయ, పోలీసు అధికారులు పై ఉంటుందని,జిల్లా పరిధిలో ఉన్న ఫర్టిలైజర్ షాప్, సీడ్స్ షాప్స్ లపై నిఘా ఉంచి ఆకస్మిక తనికిలు చేస్తూ నకిలీ విత్తనాల విక్రయాలను,రవాణాను అడ్డుకట్ట వేయడం జరుగుతుందని,రైతులు సీడ్స్ అండ్ ఫెర్టిలైజర్స్ షాప్ నుండి విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తప్పకుండా బిల్ తీసుకోవాలని సూచించారు.జిల్లా ప్రజలకు, రైతులకు ఎవరైనా నకిలీ విత్తనాలు,నకిలీ పురుగుల మందులు అమ్ముతున్నారని సమాచారం ఉంటే డయల్100 కి లేదా పోలీసులకి సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు.

## సీసీ కెమెరాల ఆధారంగా దొంగతనానికి పాల్పడ్డ వ్యక్తి అరెస్ట్, రిమాండ్ కి తరలింపు.

### వివరాలు వెల్లడించిన సిరిసిల్ల పట్టణ ఇన్స్పెక్టర్ కృష్ణ.



**రాజన్న సిరిసిల్ల జిల్లా, మే-23 (ప్రజాబలం ప్రతినిధి)**ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ.బోయినిపల్లి మండలము జగ్గారావు పల్లి గ్రామానికి చెందిన కొమురయ్య అనే వ్యక్తి తేదీ:12-05-2025 నరోజున తన భార్య తో కలసి సిద్దిపేటలో ఉన్న తన బందువుల పెళ్ళికి వెళ్తుండగా సిరిసిల్ల బస్ స్టాండ్ లో తన భార్య యొక్క హాండ్ బ్యాగ్ లో నుండి 1) బంగారు నల్ల పూసల తాడు, 2) ఒక జత బంగారు చెవుల కమ్మలు 3) బంగారు వంక ఉంగరము 4) బంగారు చైన్ గల డబ్బాను గుర్తు తెలియని దొంగలు దొంగిలించినారని ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా బస్ స్టాండ్ లో ఉన్న సిసి కేమేరాల ఆధారంగా నిందితుని ఈరోజు సిరిసిల్లలోని పెద్దబజారులోని శివాలయం వద్ద అదుపులోకి తీసుకొని దొంగిలించిన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకొని రిమాండ్ కు తరలించడం జరగిందన్నారు.

ప్రజలకు విజ్ఞప్తి..




1.బస్టాండ్ లాంటి రద్దీగా ఉండే ప్రదేశాలలో ప్రజలు బంగారముతో వెళ్తున్నప్పుడు అప్రమత్తంగా ఉండవలెను.

2. మహిళలు బంగారు ఆభరణాలతో ప్రయాణం చేస్తున్నప్పుడు లేదా ఇంటి నుండి బయటకు వెళ్లినప్పుడు కానీ ఎవరినైనా తోడుగా తీసుకువెల్లవలెను .

3. రద్దీ ప్రదేశాలలో, ఇంటి దగ్గరి ప్రదేశాలలో ఎవరైనా కొత్తగా గాని అనుమానముగా కానీ కనపడితే వెంటనే పోలీసులకి సమాచారము అందించాలి.

4.ఇంట్లోని బంగారు అభరణాలు, నగదును బ్యాంక్ లాకర్లో భద్రపర్చుకోవడం క్షేమాం.

### ఎస్సీ గురుకులాల మూసివేత నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి.

### ౧-కెవిపిఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి టి స్కైలాబ్ బాబు

రాష్ట్రవ్యాప్తంగా 12 గురుకుల జూనియర్ కళాశాలలను మూసివేయాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవిపిఎస్) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు ఒక ప్రకటనవిడుదల చేశారు రాష్ట్ర ప్రభుత్వం గురుకుల జూనియర్ కళాశాలలో విద్యార్థులు లేరనే సాకుతో జూనియర్ కళాశాల మూసివేయడం పేద విద్యార్థులకు నాణ్యమైన ఉన్నతఉద్యను దూరం చెడమేనని విమర్శించారు ప్రభుత్వం అడ్మిషన్ల ప్రక్రియ జాప్యం వల్లనే గురుకుల జూనియర్ కళాశాలలో విద్యార్థులు చేరలేకపోతున్నారని అన్నారు. కళాశాలలో అడ్మిషన్లు విద్యా సంవత్సరం ప్రారంభంలో నే తక్షణ ప్రవేశాల విధానం అమలు చేయడం లేదని అన్నారు. అడ్మిషన్లు జాప్యం చేయడం వలన గురుకుల జూనియర్ కళాశాలలో విద్యార్థులు అడ్మిషన్ పొందలేకపోతున్నారని అన్నారు. గురుకుల జూనియర్ కళాశాలను మూసి వేయడం వల్ల పేదవిద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జూనియర్ కళాశాల మూసివేత నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అప్పుల్లో ఉందని స్వయానా ముఖ్యమంత్రి ప్రకటించారని, కోతల్లో భాగంగా పేదవిద్యార్థుల భవిష్యత్ పై దాడి చేస్తుందన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించని యెడల రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని ఆయన హెచ్చరించారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 23** :రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని భీమారం మండలం పోలంపల్లి,భీమారం, అర్కపల్లి,అంకుసాపూర్ గ్రామాలలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అకాల వర్షాల దృష్ట్యా కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందని, సన్న రకం వడ్లు విక్రయించిన రైతులకు మద్దతు ధరతో పాటు 500 రూపాయల అదనపు బోనస్ అందించడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతుల కోసం త్రాగునీరు, నీడ,ఓ.ఆర్.ఎస్.ప్యాకెట్లు అందుబాటులో ఉంచడంతో పాటు అవసరమైన గోనెసంచులు,టార్పాలిన్లను సమకూర్చడం జరిగిందని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు తరలించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తి చేసిన కొనుగోలు కేంద్రాలను మూసి వేయడం జరిగిందని తెలిపారు. అనంతరం మండల తహసీల్దార్ కార్యాలయాన్ని తహసిల్దార్ సదానందంతో కలిసి సందర్శించి రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల ప్రక్రియ,ఇందిరమ్మ ఇండ్లు అంశాలను పరిశీలించారు. నిరుద్యోగ యువత కోసం ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా దరఖాస్తుల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని,అర్హులైన లబ్ధిదారులకు నిబంధనల ప్రకారం రాయితీతో కూడిన రుణ సదుపాయం కల్పించి ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రోత్సహించాలని తెలిపారు.ఇందిరమ్మ ఇండ్ల పథకం అర్హులకు మాత్రమే వర్తింపచేయాలని, అనర్హులకు అవకాశం ఇవ్వకూడదని తెలిపారు. పథకం అమలులో అవకతవకలు జరిగినట్లయితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కార్యాలయ అధికారులు, సిబ్బంది విధులలో సమయపాలన పాటించాలని, వివిధ రకాల ధృవపత్రాల జారీ కొరకు అందిన దరఖాస్తులను నిబంధనలకు లోబడి పరిశీలించి నిర్ణీత గడువులోగా జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన లబ్ధిదారులకు అందే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో 19 వేల 824 మంది రైతుల ఖాతాలలో 186 కోట్ల రూపాయల జమ

## జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 23** :మంచిర్యాల జిల్లాలోని ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుండి వరి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలో 345 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 321 కేంద్రాలు ద్వారా 19 వేల 824 మంది రైతుల వద్ద నుండి 1 లక్ష 46 వేల 134 టన్నుల వరిధాన్యం కొనుగోలు చేసి సంబంధిత రైతుల ఖాతాలలో 186 కోట్ల 12 లక్షల రూపాయలు జమ చేయడం జరిగిందని తెలిపారు.రైతుల వద్ద నుండి పూర్తి స్థాయిలో నిబంధనల ప్రకారం వరిధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు.నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేసిన 108 కొనుగోలు కేంద్రాలను మూసి వేయడం జరిగిందని తెలిపారు.ప్రతి రోజు 1 వేయి 500 మంది సిబ్బంది, హమాలీలు యజ్ఞంలా పని చేస్తున్నారని, నిత్యం 4 వేల నుండి 8 వేల టన్నుల ధాన్యం కాంటా చేసి 358 లారీల ద్వారా 6 వేల నుండి 8 వేల టన్నుల ధాన్యం కరీంనగర్లోని 68 మిల్లులకు, పెద్దపల్లిలోని 110 మిల్లులకు, జిల్లాలోని 20 మిల్లులకు తరలించడం జరుగుతుందని తెలిపారు. రైతు పండించిన ధాన్యం నష్టపోకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ప్రతి రోజు దాదాపు 5 కోట్ల రూపాయల నుండి 8 కోట్ల రూపాయలు సంబంధిత రైతుల బ్యాంక్ ఖాతాలలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. రైతు ఆటోమెటిక్ యంత్రంతో శుభ్రం చేసి కొనుగోలు కేంద్రాల వద్దకు నిబంధనల ప్రకారం ధాన్యం తీసుకురావాలని,అకాల వర్షాల సమయంలో కేంద్రాలలో అందుబాటులో ఉన్న టార్పాలిన్లను వినియోగించుకోవాలని తెలిపారు.ధాన్యం కొలతలు పరీక్షించి గ్రేడ్ఎ,సాధారణ రకాలను గుర్తించడం జరుగుతుందని తెలిపారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా కొనుగోలు కేంద్రాలలో త్రాగునీరు,నీడ,ఓ. ఆర్.ఎస్.,గోనె సంచులు, టార్పాలిన్లు ఇతర అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందని,రైతులు కొనుగోలు కేంద్రాలలో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని తెలిపారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 23** :రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని భీమారం మండలం పోలంపల్లి,భీమారం, అక్కపల్లి,అంకుసాపూర్ గ్రామాలలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అకాల వర్షాల దృష్ట్యా కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందని, సన్న రకం వడ్లు విక్రయించిన రైతులకు మద్దతు ధరతో పాటు 500 రూపాయల అదనపు బోనస్ అందించడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతుల కోసం త్రాగునీరు, నీడ,ఓ.ఆర్.ఎస్.ప్యాకెట్లు అందుబాటులో ఉంచడంతో పాటు అవసరమైన గోనెసంచులు,టార్పాలిన్లను సమకూర్చడం జరిగిందని తెలిపారు.కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు తరలించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తి చేసిన కొనుగోలు కేంద్రాలను మూసి వేయడం జరిగిందని తెలిపారు. అనంతరం మండల తహసీల్దార్ కార్యాలయాన్ని తహసిల్దార్ సదానందంతో కలిసి సందర్శించి రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల ప్రక్రియ,ఇందిరమ్మ ఇండ్లు అంశాలను పరిశీలించారు. నిరుద్యోగ యువత కోసం ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా దరఖాస్తుల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని,అర్హులైన లబ్ధిదారులకు నిబంధనల ప్రకారం రాయితీతో కూడిన రుణ సదుపాయం కల్పించి ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రోత్సహించాలని తెలిపారు.ఇందిరమ్మ ఇండ్ల పథకం అర్హులకు మాత్రమే వర్తింపచేయాలని, అనర్హులకు అవకాశం ఇవ్వకూడదని తెలిపారు. పథకం అమలులో అవకతవకలు జరిగినట్లయితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కార్యాలయ అధికారులు, సిబ్బంది విధులలో సమయపాలన పాటించాలని,వివిధ రకాల ధృవపత్రాల జారీ కొరకు అందిన దరఖాస్తులను నిబంధనలకు లోబడి పరిశీలించి నిర్ణీత గడువులోగా జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన లబ్ధిదారులకు అందే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# డి.ఈ.ఈ.టి. ఆన్లైన్ ఫ్లాట్ఫామ్లో వివరాలు నమోదు చేసుకోవాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 23 : జిల్లాలోని అర్హత కలిగిన నిరుద్యోగులు, వివిధ పరిశ్రమలు,విద్యా సంస్థలు, ఆసుపత్రులు, కమర్షియల్ ఎస్టాబ్లిష్మెంట్ల వివరాలను డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ ఆఫ్ తెలంగాణ (డి.ఈ.ఈ.టి.) ఆన్లైన్ ఫ్లాట్ఫామ్లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డి.ఈ.ఈ.టి. ఆన్లైన్ ఫ్లాట్ఫామ్ కమిటీ పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగులకు ఉపాధి కల్పించే విధంగా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. జిల్లాలోని అర్హత కలిగిన నిరుద్యోగులు, వివిధ పరిశ్రమలు, విద్యా సంస్థలు, ఆసుపత్రులు, కమర్షియల్ ఎస్టాబ్లిష్మెంట్లను డి.ఈ.ఈ.టి. ఆన్లైన్ ప్లాట్ఫామ్లో నమోదు చేయించాలని తెలిపారు. జిల్లాలోని ఐ.టి.ఐ. పనులను త్వరగా పూర్తి చేయాలని, జూన్ మాసంలో జాబ్ మేళాలు ఏర్పాటు చేయాలని, ఇందుకు గాను ముందుగానే కంపెనీలకు సమాచారం అందించాలని, తద్వారా నిరుద్యోగ యువతకు మేలు కలుగుతుందని తెలిపారు. జిల్లాలో జాబ్మేళా నిర్వహించేందుకు ఎక్కువగా కంపెనీలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని, డిగ్రీ,పి.జి., నర్సింగ్ కళాశాలల యాజమాన్యాల సమన్వయంతో జాబ్మేళాలు నిర్వహించి యువతకు ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.నిరుద్యోగులు / పరిశ్రమలు/సంస్థలు ఆన్లైన్లో%ఀవవ్.వశ్రీఖఅస్త్రుఖు.స్త్రశీజ.ఆఅ%. వెబ్సైట్ ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సి.రవికిరణ్, జిల్లా క్రీడా యువజన సేవల శాఖ అధికారి కీర్తి రాజ్వీరు, జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ,బెల్లంపల్లి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ దేవేందర్, ప్రభుత్వ ఐ.టి.ఐ.ప్రిన్సిపల్ వై.రమేష్,టాస్క్,మెప్మా, కార్మిక శాఖల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# నిశ్చితార్థ కార్యక్రమానికి హాజరైన వైకాపా నేతలు

## కాబోయే నూతన దంపతులను ఆశీర్వదించిన బద్వేల్, ఎమ్మెల్యే ,ఎమ్మెల్సీ, జడ్పీ చైర్మన్ .




బ్రహ్మంగారిమఠం కడప జిల్లా అవధూత కాశి నాయన మండలం అంగం పల్లె గ్రామంలో వైకాపా జిల్లా కార్యదర్శి పుల్లలచెరువు ప్రభాకర్ రెడ్డి ధర్మపత్ని సావిత్రిలా ద్వితీయ పుత్రిక చిరంజీవి మాధురి నెల్లూరు జిల్లా వింజమూరు సమీపంలోని గంగిరెడ్డిపల్లి కు చెందిన రాజశేఖర్ రెడ్డి అనే వరుడితో శుక్రవారం నిశ్చితార్థ కార్యక్రమం జరిగినది ఈ కార్యక్రమానికి బద్వేల్ శాసనసభ్యురాలు దాసరి సుధా మాజీ ఎమ్మెల్యే ఎమ్మెల్సీ గోవిందరెడ్డి ఆయన సతీమణి తులసమ్మ తో పాటు తనయుడు ఆదిత్య రెడ్డి కడప జిల్లా పరిషత్ చైర్మన్ రామ గోవిందరెడ్డితో పాటు బ్రహ్మంగారిమఠం మండల పరిషత్ అధ్యక్షుడు చిలేకంపల్లి వీరనారాయణరెడ్డి లు హాజరై కాబోయే నూతన దంపతులను ఆశీర్వదించారు వీరితోపాటు ఎమ్మెల్సీ తమ్ముడు కాశినాయన మండల జడ్పిటిసి సత్యనారాయణ రెడ్డి గుడిపాటి బాబు మైదుకూరు జడ్పిటిసి సుబ్బారెడ్డి సర్పంచులు ఎంపీటీసీలు మాజీ సర్పంచ్ లు కాబోయే నూతన దంపతులు లోను ఆశీర్వదించారు పీలే కాకుండా వారి బంధు వర్గం కూడా పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ నిశ్చితార్థ కార్యక్రమంలో పాల్గొన్నారు

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

## పేదల ఆరోగ్యం పట్ల కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో ఉంది

## కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రణవ్.




**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి మే 23** కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఆరోగ్యం పట్ల,పరిస్థితి బాగోలేక ఇబ్బందుల పాలైనవారికి సీఎంరిలీఫ్ ఫండ్ చెక్కుల ద్వారా ఆదుకుంటుందని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.శుక్రవారం నాడు హుజురాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జమ్మికుంట పట్టణ, మండల, వీణవంక, ఇల్లందకుంట మండలాలకు చెందిన 86 మంది లబ్ధిదారులకు 30,44,000/- విలువ చేసే చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.అనంతరం వారు మాట్లాడుతూ లబ్ధిదారులు చెక్కులను వెంటనే బ్యాంక్ లో డిపాజిట్ చేసుకోవాలని,తమ దగ్గరికి వచ్చిన వెంటనే చెక్కులను పంపిణీ చేస్తున్నామని అన్నారు.రాజకీయాలతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి లబ్ధిదారునికి అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట,వీణవంక, ఇల్లందకుంట మండలాలకు చెందిన మండల అధ్యక్షులు,పట్టణ అధ్యక్షుడు, ఇల్లందకుంట దేవాలయ చైర్మెన్, డైరెక్టర్లు, సీనియర్ నాయకులు,కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

# 78 కోట్లతో మంచిర్యాల మార్కెట్ అభివృద్ధి





**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ మే23** : మంచిర్యాల నియోజకవర్గ ఎమ్మెల్యేగా కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు గెలిచిన నాటి నుండి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు శ్రీకారం చుట్టారు.దాంట్లో భాగంగా మరొక ముఖ్యమైన అభివృద్ధి కార్యక్రమం మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని మార్కెట్ ఏరియాను తెలంగాణలో పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని విస్తీర్ణమైన ఫుట్పాట్ తో కూడిన రోడ్లు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టం పవర్ సిస్టంతో పాటు సెంట్రల్ లైటింగ్ వినియోగదారులకు వ్యాపారస్తులకు ఇబ్బందులు కలగకుండా పార్కింగ్ సిస్టం ఇలా సకల సౌకర్యాలతో మార్కెట్ కు వచ్చిన వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేయడం కోసం 78 కోట్లతో అభివృద్ధి పనులను మంజూరు చేయించిన గౌరవ మంచిర్యాల శాసన సభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు కి,సహకరించిన గౌరవ రాష్ట్ర ముఖ్య మంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డికి,ఉపముఖ్యమంత్రి వర్యులు మల్లు భట్టి విక్రమార్క గార్ల చిత్రపటాలకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాలాభిషేకం చేసి అనంతరం టపాసులు పేల్చి సంబరాలు చేసుకోవడం జరిగింది.శుక్రవారం ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు తూముల నరేష్ మరియు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పూదరి తిరుపతి మాట్లాడుతూ... మంచిర్యాల ప్రజలు భారీ మెజార్టీతో ప్రేమ్ సాగర్ రావుని గెలిపించిన నాటి నుండి మంచిర్యాల అభివృద్ధి మీద ప్రత్యేక దృష్టి పెట్టి ఎన్నో కార్యక్రమాలకు ఎన్నో పనులకు శ్రీకరం చుట్టారు.దానిలో భాగంగా మాజీ ఎమ్మెల్యే అనాలోచితి నిర్ణయాల వల్ల 30 ఏళ్లు వెనకపడ్డ మంచిర్యాల నియోజకవర్గాన్ని వైద్యరంగంలో విద్యారంగంలో ముందుంచి పేద ప్రజలకు ఎలాంటి కష్టం రాకుండా ఉండడానికి మంచిర్యాల పట్టణ నడిబొడ్డున 300 కోట్లతో సూపర్ స్పెషాలిటీ మరియు మాతా శిశు హాస్పిటల్ తోపాటు విద్యార్థులు చదువుకోవడానికి పేద మధ్యతరగతి విద్యార్థులకు అందుబాటులోకి ఉండడానికి దండేపల్లి మండలంలో 4000 వేల విద్యార్థుల కోసం ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మించడం జరుగుతుంది. నియోజకవర్గంలోని 230 స్కూళ్లలో 30 కోట్లుతో ఆదునీకరణ పూర్తి చేయడం జరిగింది.11 కోట్లతో మహాప్రస్థానం నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరిగింది. మంచిర్యాల రాళ్లవాగు చుట్టూ 250 కోట్లతో కరకట్ట నిర్మాణానికి పనులు మొదలు పెట్టడం జరిగింది. గతంలో లేనివిధంగా మంచిర్యాల రైతాంగం కోసం రెండు పంటలకు నీటిని విడుదల చేయడం జరిగింది.నియోజవర్గంలో రోడ్లు విస్తరణ మరియు గ్రామాల్లో పట్టణాల్లో ఎన్నో నిధులు తీసుకొచ్చి డ్రైనేజీలో రోడ్ల నిర్మాణం చేయడం జరిగింది.గతంలో నాయకులు కేవలం పేపర్లు పాలాభిషేకాలు మాత్రమే చేసిన సందర్భంలో ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు పనులను ప్రారంభించి ప్రజల మనసు గెలుస్తూ మా నియోజకవర్గానికి సరైన నాయకున్ని గెలిపించుకున్నామని అనుకుంటున్న సందర్భం తెలుపారు.ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ వేణు,మాజీ యూత్ అధ్యక్షులు సంపత్ రెడ్డి, సిరిపురం రాజేష్,పెంట రజిత,హేమలత,రామగిరి బాణేష్,ఖాలీద్,జలీల్,దేగ బాపు,సత్యనారాయణ,రమణ రావు,జగన్ మోహన్,ప్రభాకర్, సాయి,కిషన్,వెంకటేష్,అశోక్ తేజ,తాజ్,హజార్,శ్రీనివాస్, కంకణాల శ్యామ్,గట్టు స్వామి,ముకేశ్,శ్రీనివాస్, అనిల్,సత్తమ్మ,కదీర్, రాజన్న,మల్లేష్,భీమన్న, శైలజ,పల్లవి,లలిత,మోహన్, రమేష్,నాగరాజు,సాంబయ్య, ప్రభ,సజీద్,పర్వజ్, హరీష్,సంపత్,కుమార్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మణికొండ మునిసిపల్ అధికారుల నిర్లక్షధోరణి.









**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 23 మే 2025**మణికొండ పరిధిలోని అల్కాపూర్ టౌన్షిప్ రోడ్డు 4 మరియు 24 మార్గ మధ్యలో బి.ఆర్.ఎస్ పార్టీ గుడ్ మార్నింగ్ మణికొండ పేరిట ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం శుక్రవారం రోజున మొదలు పెట్టీ పరిసర ప్రాంతాలను సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు పలు సమస్యలను లేవనెత్తారు. ముఖ్యంగా కబ్జాకు గురైన స్థల విషయమై స్థానికుల పిర్యాదు మేరకు హైడ్రా అధికారులు అడ్డంకులను తొలగించడం జరిగినను అందుకు సంబంధించిన స్థల సేకరణ గావిస్తూ ప్రజలకు అందుబాటులోకి తేవలసి ఉండగా గమ్మున ఉండడం మణికొండ మునిసిపల్ అధికారుల నిర్లక్ష ధోరణికి సూచిక అని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కాలనీలోని పుర వీదులు మొత్తంగా చెత్తా చెదారంతో నిండి ఉన్నవని పర్యవసానంగా దోమల బెడద తీవ్రంగా ఎదుర్కుంటున్నామని వాపోయారు. ఇకపోతే రహదారులు మొత్తంగా దెబ్బ తిని గుంతల మయంగా మారినను మునిసిపల్ అధికారులు గమ్మున ఉండడంపై విడ్డూర పడడం తమ వంతైనదని తెలిపారు. మంచినీటి సరఫరా సక్రమముగా లేదని అందుకు సంబంధించిన స్థానిక లైన్ మెన్ లను బదిలీలు చేయకుండా ఒకే చోట ఉంచడం వలన ఇలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్టు అందుకు గాను పద్ధతి ప్రకారం బదిలీలు చేస్తే కొంత మేర ఉపయోగం ఉంటుందని, కావున సంబంధిత జలమండలి అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇట్టి కార్యక్రమంలో స్థానిక మణికొండ బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు సీతారాం ధూళిపాళ, గుట్టమీది నరేందర్, ఉపేంద్రనాథ్ రెడ్డి, సంఘం శ్రీకాంత్, యాలాల కిరణ్, రాజేంద్రప్రసాద్, షేక్ ఆరిఫ్ మొహమ్మద్, సుమ నళిని, బొడ్డు శ్రీధర్, చెరుకూరి బాలాజీ మొదలగు వారు పాల్గొన్నారు.

## గ్రీన్ డ్రైవ్ను ప్రారంభించిన విజయవాడ రైల్వే డివిజన్ మేనేజర్ నరేంద్ర

విజయవాడరైల్వేలలో ప్లాస్టిక్ కాలుష్యాన్ని అరికట్టడానికి పక్షం రోజుల పాటు నిర్వహించే గ్రీన్ డ్రైవ్ను సౌత్ సెంట్రల్ రైల్వే విజయవాడ డివిజన్ మేనేజర్ నరేంద్ర ప్రారంభించారు.ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించడంపై దృష్టి సారించి సౌత్ సెంట్రల్ రైల్వేలోని విజయవాడ రైల్వే డివిజన్ ఆధ్వర్యంలో రెండు వారాలు పాటు జరిగే గ్రీన్ డ్రైవ్ను సౌత్ సెంట్రల్ రైల్వే విజయవాడ డివిజన్ మేనేజర్ నరేంద్ర ప్రారంభించారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడంలో స్థిరమైన పద్ధతులను స్వీకరించడంలో రైల్వే సిబ్బంది, ప్రయాణీకులు, సాధారణ ప్రజల నుండి అవగాహన కల్పించడం, చురుకైన భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం ఈ గ్రీన్ డ్రైవ్ లక్ష్యం అని రైల్వే అధికారులు తెలిపారు. తొలుత విజయవాడ డివిజనల్ ఆఫీస్ కాంపౌండ్ వద్ద సౌత్ సెంట్రల్ రైల్వే విజయవాడ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ నరేంద్ర, ఎ. పాటిల్ లు తమ సిబ్బంది, బ్రాంచ్ అధికారుల చేత పర్యావరణ అవగాహన ప్రతిజ్ఞను చేయించారు.

# ఘనంగా రాందేవ్ రావు ఆసుపత్రి సీఈవో డాక్టర్.యోబు జన్మదిన వేడుకలు

### మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన కూకట్పల్లి ఉమ్మడి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎర్ర యాకయ్య.



**కూకట్పల్లి (ప్రజబలం) మే,23** : కూకట్పల్లి నియోజకవర్గం పరిధిలోని రాందేవ్ రావు ఆసుపత్రి సీఈఓ డాక్టర్.యోబు జన్మదిన వేడుకలు హాస్పిటల్ యాజమాన్యం, డాక్టర్స్, అన్ని విభాగాలకు చెందిన సిబ్బంది,కూకట్పల్లి జర్నలిస్టుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. కూకట్పల్లి ఉమ్మడి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎర్ర యాకయ్య మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించి,హృదయపూర్వక శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్.యోబు మాట్లాడుతూ నాకు పుట్టినరోజు శు భాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి పేరు పేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి ఉమ్మడి ప్రెస్ క్లబ్ కోశాధికారి పుట్టి నగేష్, జాయింట్ సెక్రెటరీ నాగుల అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

## తడిసిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలి, యువరైతు అక్కెం నాగరాజు.



**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, ఇల్లంతకుంట, ( ప్రజాబలం ),** శుక్రవారం రోజున ఇల్లంతకుంట మండల కేంద్రంలోని కొన్ని గ్రామాలలో దాదాపు ధాన్యం ఆరబోసి నెలలు గడుస్తున్న సరియైన సమయానికి లారీలు రాక, సరైన సదుపాయాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులకు గురి అయ్యారని మ్యాచుర్ వచ్చినా కూడా లారీల కొరత వల్ల మరియు అధికారులు, ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం వల్ల కొన్ని గ్రామాలలో ఉన్న ధాన్యం పూర్తిగా అకాల వర్షాలకు తడిసిపోయింది కాబట్టి అట్టి ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా ప్రభుత్వం ధాన్యం ను కొనుగోలు చేయాలని, అలాగే వర్షాకాలం ప్రారంభంగా కావస్తున్న సందర్భంగా రైతులకు న్యాన్యమైన విత్తనాలు మరియు ఎరువులు అందుబాటులో ఉండే విధంగా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

## గ్రామ పాలన అధికారి పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం



ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మే 23: గ్రామ పాలన అధికారి పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం నేడొక ప్రకటనలో తెలిపారు.

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కూకట్ పల్లిలో గల మహిళా డిగ్రీ కాలేజీలో ఈనెల 25 న గ్రామ పాలన అధికారి పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని 52 మంది అర్హులైన ఆప్షన్ ఇచ్చిన విఆర్ఓలు ఈ పరీక్షకు హాజరవుతున్నట్లు, పరీక్ష ఉదయం 10:30 నుండి 1:30 వరకు జరుగుతుందని కలెక్టరు వివరించారు. పరీక్ష కేంద్రంలోనికి ఉదయం 9.30 గంటల నుండి 10.00 గంటల వరకు మాత్రమే అనుమతిస్తారని ఇట్టి విషయాన్ని అభ్యర్థులు గమనించి, అరగంట ముందే పరీక్షా కేంద్రానికి చెరుకోవాలని ఆయన పేర్కొన్నారు

అభ్యర్థులకు ఏవైనా సందేహాలు ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 733 720 99 0 ఫోన్ నెంబర్ లో సంప్రదించగలరని కలెక్టర్ సూచించారు

# వీర మరణం పొందిన జవాన్లకు నివాళులు అర్పించిన ఉపాధ్యాయులు



**ప్రజా బలం దినపత్రిక వేములవాడ మే - 23**వేములవాడ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో వేములవాడ అర్బన్ మండలంలో పనిచేస్తున్న ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు వృత్యాంతర శిక్షణలో భాగంగా శుక్రవారం రోజున ఉపాధ్యాయులు అందరూ కలిసి ఆపరేషన్ సింధుర్ విజయవంతం అయినందుకు వీర సైనికులందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ భరతమాత ఒడిలో అసువులు బాసి వీర మరణం పొందిన జవాన్లకు ఆత్మశాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి భుఖ్య బన్నాజీ, మండల రిసోర్స్ పర్సన్ లు కమలాకర్ రెడ్డి, చక్రపాణి రామచంద్రం, సదానందం, రాజు, కిషన్ ,వెంకటేశం, నిర్మల, శిక్షణ ఆర్గనైజర్ బొజ్జ కృష్ణ, పట్టణ సిఆర్పి, ఆకుల శ్రీనివాస్, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలం జలాశయానికి ప్రారంభమయ్యిన వరద ప్రవాహం

శ్రీశైలం జలాశయానికి వరద పోటు ప్రారంభమయింది. ఇన్ ఫ్లో :22,509 క్యూసెక్కులువుంది. ఔట్ ఫ్లో : 7,007 క్యూసెక్కులు. పూర్తి స్దాయి నీటి మట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం : 817.20 అడుగులు వుంది. పూర్తిస్థాయి నీటి నిల్వ : 215.8070 టీఎంసీలు. ప్రస్తుతం : 38.8000 టీఎంసీలు. ఎడమ గట్టు జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభం అయింది. కుడి జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం లో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభం కాలేదు.

# వచ్చే దసరా, దీపావళి పండుగలు నూతన గృహంలో చేసుకోవాలి, కలెక్టర్ సందీప్ కుమార్ ఝ.

**30 రోజులలో గా ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణ పనులు ప్రారంభించాలి.**

**పెట్టుబడులేని నిరుపేదలకు స్వయం మహిళా సంఘాల ద్వారా లక్ష రూపాయల రుణం మంజూరు.**

**ఎవరికి ఒక్క రూపాయి ఇవ్వవద్దు, ఎవరైనా డబ్బులు అడిగితే కలెక్టర్ కి ఫోన్ చేయాలి.**

**గంభీరావుపేట మండలంలో రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరి ఉత్తర్వులు పంపిణీ చేసిన కలెక్టర్.**



**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, గంభీరావుపేట, ( ప్రజాబలం ),** ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను లబ్ధిదారులు 30 రోజులలోగా ప్రారంభించి వచ్చే దసరా, దీపావళి పండుగలు నూతన గృహంలో జరుపుకోవాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ ఆకాంక్షించారు. గంభీరావుపేట మండల కేంద్రంలో కలెక్టర్ రెండో విడత కింద 507 మందికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ఉత్తర్వులు, దత్త సాయి ఫంక్షన్ హాల్ లో కేకే మహేందర్ రెడ్డి తో కలిసి పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ గంభీరావుపేట మండలంలో రెండో విడత కింద507 మంది లబ్ధిదారులను పారదర్శకంగా అర్హులుగా ఎంపిక చేసి ఉత్తర్వులు పంపిణీ చేశామని తెలిపారు. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు నాలుగు దశలో ఐదు లక్షల రూపాయలు ఆర్థిక సాయం అందుతుందని,400 చదరపు అడుగుల నుంచి 600 చదరపు అడుగుల లోపు ఇంటి నిర్మాణం జరిగితే నాలుగు దశలో గ్రీన్ ఛానల్ ద్వారా ఆర్థిక సాయం అందుతుందని వెల్లడించారు.

బేస్మెంట్ నిర్మాణం పూర్తయిన తర్వాత లక్ష రూపాయలు, గోడలు నిర్మిస్తే లక్ష రూపాయలు, స్లాబ్ నిర్మించిన తర్వాత రెండు లక్షల రూపాయలు, ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత మరో లక్ష రూపాయలు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ అవుతాయి అని కలెక్టర్ తెలిపారు.

## పైరవీలు అవసరం లేదు.

ప్రభుత్వం అందించే సహాయం గురించి ఏ అధికారి లేదా దళారి నుంచి పైరవీ వంటివి చేయాల్సిన అవసరం లేదని, ఎవరైనా డబ్బులు అడిగితే స్వయంగా ఫోన్ చేయవలసిందిగా కలెక్టర్ స్పష్టం చేశారు. ఇంటి నిర్మాణం పురోగతి ప్రకారం పారదర్శకంగా ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందని ఎవరికి ఒక రూపాయి ఇవ్వడానికి వీలు లేదని కలెక్టర్ సూచించారు.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో పూర్తి సహకారం ప్రభుత్వం నుంచి అందిస్తామని నిర్మాణానికి అవసరమైన ఇసుక మండల కేంద్రాలలో అందుబాటులో పెడతామని తెలిపారు. మండలంలో ఉన్న గ్రామాలకు ఇసుక రీచ్ లను అలాట్ చేస్తామని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి పంచాయతీ సెక్రెటరీ నుండి తాసిల్దార్ వరకు సమాచారం అందిస్తే వారే ఉచితంగా ఇసుక సరఫరా చేస్తారని, ఇంకా ఎవరైనా అర్హులు మిగిలిపోతే వారికి కూడా విడతలవారీగా ఎంపిక చేస్తామని తెలిపారు.

30 రోజుల్లోగా ఇంటి నిర్మాణ పనులను లబ్ధిదారులు ప్రారంభించాలని లేనిపక్షంలో మంజూరు చేసిన ఇల్లు రద్దు అయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. నిరుపేదలకు పెట్టుబడి లేని పక్షంలో స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా లక్ష రూపాయల రుణం అందిస్తామని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వినియోగించుకుంటూ స్వంత స్థలంలో మంచి ఇండ్లు నిర్మించుకొని ప్రజలు సంతోషంగా ఉండాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో పీడీ హౌసింగ్ శంకర్, మండల ప్రత్యేక అధికారి హనుమంతు, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ విజయ, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, ఎంపీడీవో రాజేందర్, తాసిల్దార్ మారుతి రెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# హరితహారాన్ని నిలిపివేయండి.

**ప్రజాధనాన్ని దుర్వినియోగం కాకుండా కాపాడండి.**

**బోయినపల్లి సిపిఎం పార్టీ కన్వీనర్ డిమాండ్.**



**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, బోయినపల్లి, ( ప్రజాబలం),** బోయినపల్లి మండలం లో అలాగే ఇతర ప్రాంతాలలో కూడా అనేక చోట్ల రోడ్ల వెంట హరితహారం కార్యక్రమం లో భాగంగా చెట్లను నాటి, తిరిగి అవి పెరిగి పెద్దదైన సందర్భంలో అట్టి చెట్లను విద్యుత్ సంస్థ శాఖ సిబ్బంది కరెంటు తీగలకు అడ్డు తగులుతున్నాయని కారణాలతో పూర్తిగా మిషన్ల ద్వారా కొట్టివేయడం జరుగుతుంది. ప్రతి సంవత్సరం ప్రభుత్వాలు హరితహారం కార్యక్రమాన్ని ప్రభుత్వ భూములలో, మైదాన ప్రాంతాలలో, అటవీ ప్రాంతాలలో, కాల్వ గట్ల ప్రాంతాలలో పెట్టాల్సిన చెట్లను ఇలా రోడ్ల వెంబడి పెట్టడం వల్ల ఒకపక్క ఈదురుగాలిలో చెట్లు నేలకు ఓ రుగుతున్నాయి. మరో పక్క గొర్లు, మేకలు, ఎడ్ల పాలవుతున్నాయి. మరోపక్క గ్రామీణ ప్రాంత రైతులకు అవగాహన లేక వారి భూముల్లో పత్తి పండించిన తదనంతరం ఆ పత్తి కట్టెలను రోడ్లకు అనుకొని ఉన్న చెట్ల వద్దనే ఆ పత్తి కట్టెలను కుప్పలుగా వేసి తగలబెట్టడం జరుగుతుంది. దీనివల్ల ఒకపక్క పర్యావరణం, మరో పక్క ప్రజాధనం చెట్లు నాటిన రూపంలో దుర్వినియోగం పాలవుతున్నాయి. ప్రభుత్వాలకు ప్రజాధనాన్ని దుర్వినియోగం కాకుండా ఎలా ఖర్చు పెట్టాలి అనేది చిత్త శుద్ధి లేకపోవడం వల్ల రాజుల పైసలు రాళ్లపాలు అన్నట్లు, ప్రజలు అనేక రకాలుగా కష్ట నష్టాలకు ఓర్చు ప్రభుత్వాలకు పన్నుల రూపంలో ఆదాయం కల్పిస్తే, అట్టి ప్రజాధనాన్ని ఏ పద్ధతిలో ఖర్చు పెట్టాలో సామాజిక స్పృహ లేకపోవడం చాలా బాధాకరమైన విషయం అన్నారు. ప్రతి సంవత్సరం హరితహారం కార్యక్రమం పేరిట వందల కోట్ల రూపాయలు దుర్వినియోగం అవుతున్నాయని ఇప్పటికైనా ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించి ప్రజాధనాన్ని దుర్వినియోగం కాకుండా కాపాడవలసిన బాధ్యత ప్రభుత్వాల మీద ఉంది కాబట్టి ఆ దిశగా వ్యవహరించాలని మండల సిపిఎం పార్టీ కన్వీనర్ గురజాల శ్రీధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది.

# కవిత రాసింది నిజాలే.

**బి ఆర్ ఎస్ లో ముసలం తీవ్ర స్థాయికి చేరింది.**

**వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.**



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** బి ఆర్ ఎస్ ఎం ఎల్ సి కల్వకుంట్ల కవిత లేఖ పై తెలంగాణ ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సంచలన కామెంట్ చేశారు. బిఆర్ఎస్ లో విభేదాలు తీవ్ర స్థాయికి చేరింది అని అన్నారు. కవిత రాసిన లేఖతో లుకలుకలు బయటపడ్డాయని చెప్పారు. బిజెపి పార్టీతో బి ఆర్ఎస్ కలిసి పనిచేస్తుందని తాము చాలా కాలం నుండి చెబుతున్న మాటలను కవిత సమర్థించారని అన్నారు. బిజెపితో పొత్తు పెట్టుకోవడానికి కేసీఆర్ సిద్ధమవుతున్నారని కవిత చెప్పకనే చెప్పిందన్నారు. గురువారం మీడియాతో ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ బీజేపీ పైన పల్లెతు మాట మాట్లాడకుండా కేసీఆర్ వ్యవహరించిన తీరును కవిత కడిగి పారేసిందని అన్నారు. రాబోవు రోజులలో బీఆర్ఎస్, బిజెపి పొత్తు పెట్టుకోబోతున్నాయని ఆరోపించారు. బి ఆర్ఎస్ బలహీన పడడం వల్లనే బిజెపితో పొత్తుకు ప్రయత్నిస్తున్నట్లు కవిత అంగీకరించారని ఆది శ్రీనివాస్ తెలిపారు.

కవిత జరిగిన నిజాలు మాట్లాడారు.

కవిత పచ్చి నిజాలు చెప్పారని, మేం చాలా కాలంగా చెప్తున్నా. బిఆర్ఎస్ లో కేసీఆర్ నియంతృత్వ వైఖరిని కూడా కవిత నిలదీశారు పార్టీ రజతోత్సవ వేడుకల్లో కేసీఆర్ ఒక్కరే ప్రసంగించడాన్ని ఆమె ప్రశ్నించారు. కెసిఆర్ వైఖరిని ఆయన కూతురే తప్పుపడుతుంది. ఇక ప్రజలకు వాళ్లేమి సమాధానం చెబుతారు. కెసిఆర్ ఫామ్ హౌస్ కె పరిమితమయ్యారని కవిత తేల్చి చెప్పింది. పార్టీ నాయకులను కలవకుండా ఏకపక్ష పోకడలకు పోతున్నారని ఆమె చెప్పారు. కవిత లేఖ పైన బి ఆర్ఎస్ నాయకత్వం స్పందించి ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. మా సీఎం రేవంత్ రెడ్డి మీద ఒంటి కాలి పైన లేస్తున్న కేటీఆర్ ముందు తన చెల్లికి సమాధానం చెప్పాలన్నారు.

ఆ నైతిక హక్కు కేటీఆర్ కు లేదు.

కవితకు సమాధానం చెప్పకుండా ఇతర పార్టీలను విమర్శించే నైతిక హక్కు కేటీఆర్ కు లేదని, కల్వకుంట్ల కుటుంబంలో లుకలుకలు ఉన్నాయని, మాజీ మంత్రి హరీష్ రావు అలగడంతో ఇంటికి వెళ్లి కేటీఆర్ బ్రతిమిలాడాడని, కవిత లేఖతో బిఆర్ఎస్ ఇద్దరికి మాత్రమే పరిమితమైందని తేలింది అన్నారు. గత పది ఏళ్లలో కేసీఆర్ హయాంలో జరిగిన దోపిడి గురించి కూడా కవిత ప్రశ్నిస్తే బాగుండేది అన్నారు. పంపకాలు, పదవుల్లో తేడా వచ్చి కేసీఆర్ కుటుంబంలో లేఖలు రాసుకుంటున్నారన్నారు. బి ఆర్ఎస్ పని ఇక అయిపోయిందన్నరు. కేటీఆర్ ముందు నీ ఇల్లు సరిదిద్దుకో, అధికారంలో ఉన్నప్పుడు ఫామ్ హౌస్ లోనే, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా కెసిఆర్ ఫామ్ హౌస్ కె పరిమితమయ్యాడు అన్నారు. కెసిఆర్ తీరును ఆయన కూతురే తప్పు పడుతుందన్నారు. ప్రజలకు ఆయన సమాధానం చెప్పాలని ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

# వేములవాడ మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం, వెరసి పట్టణ ప్రజలకు అవస్థలు.

# మౌలిక సదుపాయాల కల్పనలో మున్సిపల్ అధికారులు అలసత్వం.





**వేములవాడ టౌన్, ( ప్రజాబలం),** వేములవాడ మున్సిపల్ పాలకవర్గ పదవీకాలం ముగిసి దాదాపు నాలుగు నెలలు దాటుతున్న మున్సిపల్ అధికారులు వేములవాడ పట్టణంలో ప్రజలకు మౌలిక వసతులు కల్పనలో పూర్తిగా విఫలమైనారని, పట్టణంలో సిసి రోడ్లు సరిగా లేవని, ఉన్న డ్రైనేజీలలో పారిశుద్ధ కార్మికుల శుభ్రం చేయించవలసిన మున్సిపల్ అధికారులు అలసత్వం వహిస్తున్నారని, దీనితో పగలు దుర్గంధం, రాత్రి దోమలతో వేములవాడ పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వేములవాడ పట్టణం లో గల మండల ప్రజాపరిషత్ కార్యాలయం వెనకాల గల విద్యానగర్ కాలనీలో చిన్నపాటి వర్షానికి మురుగునీరు మొత్తం ఇండ్ల ముందుకు వచ్చి ఇంటి లోపలికి వెళ్లడానికి ఇంటి యజమానులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇండ్ల ప్రక్కన గల ఖాళీ ప్రదేశాలలో మురుగునీరు నిలిచిపోయి చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయి. డ్రైనేజీలను శుభ్రం చేయకపోవడంతోనే అనేకమంది పిల్లలు వ్యాధుల బారిన పడుతున్నారని కాలనీవాసులు పేర్కొన్నారు. అయినను మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంలేదని విద్యానగర్ వాసుల ఆరోపిస్తున్నారు. వేములవాడ పట్టణంలోని 12వ వార్డులో నంది విగ్రహం నుండి మల్లారం వెళ్లే ప్రధాన రహదారిలో రాజశ్రీ ఫంక్షన్ హాల్, శ్రీ రాజరాజేశ్వర ఫంక్షన్ హాల్, త్వరలో ఇక్కడే అతిపెద్ద సూపర్ మార్కెట్ ఏర్పాటు కాబోతున్న రహదారిలో డ్రైనేజీ లేక ఇండ్ల నుండి వచ్చే మురుగునీరు మొత్తం ప్రధాన రహదారిపై పారుతుండడం వల్ల పాదాచారులకు, ద్విచక్ర వాహనదారులకు, ఇతరులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి అని, ఆ చుట్టుపక్కల నివసిస్తున్న ప్రజలు తాము ప్రతిరోజు దుర్గంధం మధ్యనే జీవనం కొనసాగించవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇట్టి ప్రధాన రహదారిపై కేవలం 100 నుండి 150 మీటర్ల డ్రైనేజీని గాని, అండర్ గ్రౌండ్ పైప్ లైన్ నిర్మాణం చేస్తే అట్టి రహదారిపై ఎలాంటి ఇబ్బందులు కలగవని వాహనదారులు, చుట్టుపక్కల ప్రజలు కోరుచున్నారు.

వేములవాడ మున్సిపల్ విలీన గ్రామమైన కోనాయిపల్లి లో డ్రైనేజీ పై నిర్మించిన కల్వర్టు పై భాగంలో పెద్ద రంధ్రం ఏర్పడి తరచూ అట్టి రంధ్రంలో వాహనదారులు, పశువులు పడి గాయాల పాలవుతున్న మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంలేదని, అట్టి కల్వర్టును తొలగించే కొత్త కల్వర్టు నిర్మించాలనే ధ్యాస మునిసిపల్ అధికారులకు లేదా అని 13వ వార్డు ప్రజలు బాహాటంగా అధికారులపై తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి డ్రైనేజీలను ప్రతిరోజు శుభ్రం చేయాలని, నంది విగ్రహం నుండి మల్లారం హై లెవెల్ బ్రిడ్జి వరకు నూతన డ్రైనేజీ గాని, అండర్ గ్రౌండ్ పైప్ లైన్ గాని వేసి తమ బాధలు తీర్చాలని, 13వ వార్డులో డ్రైనేజీ పై కొత్త కల్వర్టు నిర్మించాలని, విద్యానగర్లో డ్రైనేజీ



మురుగునీరు ఇండ్ల ముందు గానీ, ఇండ్ల ప్రక్కన గాని నిలవకుండా తగిన ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ అధికారులను ప్రజలు కోరుతున్నారు.

# అంబరాన్నంటిన అంబర్‌పేట కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

## అంబర్‌పేట్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తారని నాకు నమ్మకం కలుగుతుంది :అబ్జర్వర్ వినోద్ కూమార్






**అంబర్‌పేట్ ప్రజాబలంప్రతినిధి:**అంబర్‌పేట్ అసెంబ్లీ నియోజక వర్గంలోని మాజీ రాజ్యసభసభ్యులు వి.హనుమంతరావ్ డీసీసీ ఖైరాతాబాద్ జిల్లా అధ్యక్షులు అంబర్‌పేట్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి డా॥రోహిణ్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించడం ఈ కార్యక్రమానికి అంబర్‌పేట్ అసెంబ్లీ నియోజక వర్గం అబ్జర్వర్లుగా నియమితులైన వినోద్ కూమార్ ,సౌజన్య నేతృత్వంలో అంబరాన్నంటిన అంబర్‌పేట కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం .ఈ కార్యక్రమంలో మాజీ రాజ్యసభసభ్యులు వి.హనుమంతరావ్ ,డా॥రోహిణ్‌రెడ్డి ,అంబర్‌పేట్ అసెంబ్లీ నియోజక వర్గం అబ్జర్వర్లు వినోద్ కూమార్ ,సౌజన్య లను శాలువ కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా సన్మానించడం జరిగినది.ఈ సందర్భంగా వి.హనుమంతరావ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని ఉన్న ప్రతికార్యకర్తకు న్యాయం జరిగేలా నేను కృషి చేస్తానని అన్నారు.డా॥రోహిణ్‌రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పనిచేసిన నన్ను ఆదరించిన ప్రతికార్యకర్త కొరకు నాకు తెలుసు.ఆ కార్యకర్తలకు న్యాయం చేకూరేలా నావంతు ప్రయత్నం నేనుచేస్తాను .ఇప్పుడు మన ప్రభుత్వం ఉన్నది.ప్రతికార్యకర్త రెట్టింపు ఉత్సాహంతో పనిచేయండి. మీ బాధ్యత నాది అని అన్నారు.అంబర్‌పేట్ అసెంబ్లీ నియోజక వర్గం అబ్జర్వర్ వినోద్ కూమార్ మాట్లాడుతూ ఏఐసీసీ ప్రదేశ్ కాంగ్రెస్ కమీటీ ఆదేశాలతో ఈ నియోజక వర్గానికి అబ్జర్వర్‌గా నేను వచ్చినాను.అంబర్‌పేట్ అసెంబ్లీ నియోజకవర్గంలోని బ్లాక్ కమీటీలకు డివిజన్ కమీటీలకు పదవులు ఆశించిన వాళ్ళు మీ బయోడేటాని నాకు ఇవ్వవలసిందిగా కోరుచున్నాను.అనంతరం నియోజకవర్గంలో మేము డివిజన్ల వారిగా పర్యటిస్తాం.మీరు ఆశించిన పదవులకు మేము తెలుసుకుని అధిష్ఠానానికి నివేదిక పంపిస్తాం.ఈ నియోకవర్గ కార్యకర్తల సమావేశాన్ని చూస్తుంటే వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి అంబర్‌పేట నియోజక వర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తారని నాకు నమ్మకం కలుగుతుంది.ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్‌యాదవ్ ,పీ.నారాయణ స్వామి , ఖైరతాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శంబుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్,మోతే రోహిత్,లక్‌పతి యాదగిరిగౌడ్, మాజీ కార్పోరేటర్లు గరిగంటి రమేష్,దిడ్డి రాంబాబు, పులి జగన్ ,టీపీసీసీ కార్యదర్శి శంబుల శ్రీకాంత్ గౌడ్,డివిజన్ అధ్యక్షులు బ్లాక్ అధ్యక్షులు సీనియర్ కాంగ్రెస్ నాయకులు మహిళా కాంగ్రెస్ నాయకురాల్లు తదితరులు పాల్గోన్నారు.

## ఇది చరిత్రాత్మక నిర్ణయం, దేశంలో మొదటి రాష్ట్రంగా తెలంగాణ నిలవడం గర్వకారణం.. మహేష్ కుమార్ గౌడ్..



ఢిల్లీలోని ఇందిరా భవన్ ఏఐసీసీ కార్యాలయంలో బిసి కులఘననపై పిపిటి ఇచ్చిన టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్...

పిపిటి లో పాల్గొన్న ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ, జాతీయ నాయకులు జైరాం రమేష్, కొప్పుల రాజు, మధు యాష్కీ.. తదితరులు

దేశవ్యాప్తంగా పాల్గొన్న ఏఐసీసీ జాతీయ అధికార ప్రతినిదులు, మీడియా ఇంచార్జ్ లు.

ఢిల్లీలోని ఇందిరా భవన్ లో

రెండున్నర గంటలపాటు సాగిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్.

మహేష్ కుమార్ గౌడ్ టీపీసీసీ అధ్యక్షులు మాట్లాడుతూ

దేశానికి తెలంగాణ డిక్సూచి ..

బిసి కులఘనన హామీ తో తెలంగాణ లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది..

రాహుల్ గాంధీ భారత్ జొడో యాత్రలో కులఘనన హామీ ఇవ్వడంతో సమాజంలో బిసిలు కాంగ్రెస్ వైపు మొగ్గుచూపారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే బిసి కులఘనన పై అన్ని రకాల చర్యలు తీసుకున్నాం..



ఢిల్లీ లో ఇందిరా భవన్ లో కులఘనన పై టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఇచ్చిన పిపిటి లో ప్రసంగించిన లోక్ సభ ప్రధాన ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప.ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి వర్గం

కులఘనన విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీస్కొని వేగవంతంగా కార్యాచరణ చేపట్టారు..

శాస్త్రీయంగా కులఘనన చేపట్టారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చైర్మన్ గా క్యాబినెట్ ఉప సంఘం వేశారు.

క్యాబినెట్ లో ఆమోదం, అసెంబ్లీ లో బిల్లు చేసి సమగ్రమైన చర్చ జరిపాము.

ఈ కులఘనన వల్ల రాష్ట్రంలో కులాల వారీగా లెక్కలు తేలాయి. దాంతో ఏ కులానికి ఎంత రిజర్వేషన్లు ఇవ్వాలో లెక్క తేలింది...

కులఘనన దేశంలోనే మొదటిసారి తెలంగాణ లో జరగడం అది కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరగడం గొప్పదనం..

రాహుల్ గాంధీ ఆశయాలకు అనుగుణంగా తెలంగాణ లో కులఘనన చేపట్టాము.

ఇది దేశానికి ఆదర్శంగా నిలిచింది.

రాష్ట్రంలో 42 శాతం బిసి రిజర్వేషన్లు చేయాలని అసెంబ్లీ లో తీర్మానం చేసి పార్లమెంట్ కు పంపడం జరిగింది.

రాబోయే ఎన్నికలలో 42 శాతం బిసి రిజర్వేషన్లు అమలు చేయాలని కృషి చేస్తున్నాం..

ఇది చరిత్రాత్మక నిర్ణయం, దేశంలో మొదటి రాష్ట్రంగా తెలంగాణ నిలవడం గర్వకారణం.. మహేష్ కుమార్ గౌడ్..




Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com